RNI Reg-No.APTEL/2005/19204

ESTD : 1996

# నేటి మనదేశమ్

తెలుగు దినపత్రిక

Simultaneously published from Tirupati, Vijayawada, Visakhapatnam & Hyderabad

https://netimanadesam.com/

సంపుటి :21 సంచిక 100 తిరుపతి సంపాదకులు: కె.యస్.రంగశాయి శనివారం 11-4-2026 పేజీలు :8 వెల: 1-00

శ్రీ పరాభవ నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత రుతువు, చైత్ర మాసం, తిథి॥నవమి రా॥8.42, ఉ.షా. ఉ॥10.20, వర్జ్యం మ॥ 2.34 -4.16,
దుర్ముహూర్తం ఉ॥ 5.57-7.34, శుభ సమయం ఉ॥ 6.00-7.30, రాహుకాలం ఉ॥9.00-10.30, సూర్యోదయం ఉ॥ 5.59, సూర్యాస్తమయం సా॥ 6.08 గం॥

## హైదరాబాద్-విజయవాడ మధ్య విమాన సర్వీసు

2లో

## శ్రీకాకుళం సాగునీటిని గాలికి వదిలేసిన వైసిపి

జిల్లాకు సాగునీటి వసతి కల్పించడమే లక్ష్యం.... వంశధారతో సమస్యలను తీర్చే ప్రయత్నం

కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు వెల్లడి



**శ్రీకాకుళం, ఏప్రిల్ 10 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఐదేళ్ల వైసీపీ పాలనలో శ్రీకాకుళంలో సాగునీటి వ్యవస్థను గాలికి వదిలేశారని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు మండిపడ్డారు. శ్రీకాకుళం జిల్లా వ్యవసాయ ఆధారితమని, జిల్లా ప్రజలకు సాగునీటి భద్రత కల్పించాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. వంశధార నీటిని సద్వినియోగం చేసుకుని జిల్లాను సస్యశ్యామలం చేయాలని పూనుకున్నట్లు ఆయన చెప్పారు. 2010లో వంశధార ట్రైబ్యునల్ ఏర్పాటు అయ్యిందని.. అప్పటి నుంచి నేరడి బ్యారేజ్ విషయంలో ఒడిశాతో ఉన్న సమస్యను పరిష్కరించేందుకు కృషి చేసినట్లు ఆయన చెప్పారు. 2024లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో నేరడి బ్యారేజ్ సమస్యపై దృష్టి పెట్టామని ఈ సందర్భంగా రామ్మోహన్ చెప్పుకొచ్చారు. ఒడిశాలోనూ బీజేపీ ప్రభుత్వం రావటంతో సమస్య పరిష్కారానికి మార్గం సుగమం అయ్యిందని హర్షం వ్యక్తం చేశారు. వంశధార ట్రైబ్యునల్ ఇచ్చిన తీర్పు ఆధారంగా గెజిట్ నోటిఫికేషన్ తెచ్చుకున్నామని.. సుదీర్ఘ కాలం పెండింగ్‌లో ఉన్న సమస్య పరిష్కారమైందని తెలిపారు. దీనిపై వైసీపీ నేతలు ఇప్పుడెందుకు మాట్లాడటం లేదని రామ్మోహన్ నాయుడు ప్రశ్నించారు. కేంద్ర మంత్రి అయినా తన మొదటి ప్రాధాన్యత జిల్లా అభివృద్ధికే అని రామ్మోహన్ స్పష్టం చేశారు. త్వరలో నేరడి బ్యారేజ్ పనులు ప్రారంభమవుతాయని.. రైల్వే జోన్ సాధించుకోవటం మరో విజయమంటూ సంతోషం వ్యక్తం చేశారు. ఉద్దానం ప్రాంతంలోని ఏడు రైల్వేస్టేషన్లను కొత్త రైల్వే జోన్‌లో పెట్టించినట్లు కేంద్ర మంత్రి తెలిపారు. తిరుపతి వెళ్లే భక్తుల కోసం హంసఫర్ ఎక్స్‌ప్రెస్ ఇకపై శ్రీకాకుళం నుంచి బయలుదేరుతుందంటూ ఆయన గుడ్ న్యూస్ చెప్పారు. పలాసలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు చేశామని.. పొందూరు ఖాదీకి జియో ట్యాగ్ సాధించామనీ వెల్లడించారు. కేంద్రం నుంచి జిల్లాకు అన్ని రకాల సహాయ సహకారాలు అందేలా చూస్తున్నానని రామ్మోహన్ పేర్కొన్నారు. జిల్లాలో అభివృద్ధి జరుగుతుంటే వైసీపీ నేతలు జీర్ణించుకోలేకపోతున్నారని కేంద్ర మంత్రి రామ్మోహన్ ఆగ్రహించారు. ప్రజల కోసం పని చేసే నేతలైతే కేంద్ర

మిగతా 2లో..



# కేబినేట్ ఎజెండా ముందే లీక్

**అమరావతి, ఏప్రిల్ 10 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** సీఎం చంద్రబాబు నాయుడు అధ్యక్షతన సచివాలయంలో జరిగిన కేబినెట్ సమావేశం దాదాపు 3 గంటలకు పైగా సాగింది. ఈ సమావేశంలో.. అమరావతికి ఆమోదంపై కేంద్రానికి, ప్రధాని మోడీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలపడంతో పాటు.. కీలక నిర్ణయాలకు ఆమోద ముద్ర వేసింది కేబినెట్.. అయితే, ఎజెండా అంశాలపై చర్చ ముగిసిన తర్వాత.. మంత్రులతో ప్రత్యేకంగా సమావేశమైన సీఎం చంద్రబాబు.. కీలక సమాచారం లీక్ అవుతున్న అంశంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేబినెట్ అజెండాతో పాటు ప్రభుత్వానికి సంబంధించిన ముఖ్యమైన వివరాలు ముందుగానే బయటకు ఎలా వస్తున్నాయంటూ మంత్రులను ప్రశ్నించారు. ఇకపై క్యాబినెట్

మిగతా 2లో..

- కీలక అంశాలు సైతం ముందే వెల్లడి
- గతంలో ఇలా జరిగితే ఎన్టీఆర్ కేబినేట్ రద్దు చేశారు
- సమాచారం లీక్ అయితే మంత్రులదే బాధ్యత
- కేబినేట్ భేటీలో సిఎం చంద్రబాబు సీరియస్ వార్నింగ్
- జలధార తదితర పథకాలపై ప్రచారం కల్పించాలని ఆదేశం

## రాజ్యసభ సభ్యుడిగా నితీశ్ ప్రమాణం



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 10 (ఆర్ఎన్ఎ):** బీహార్ ముఖ్యమంత్రి నితీష్‌కుమార్ శుక్రవారం రాజ్యసభ సభ్యునిగా ప్రమాణస్వీకారం చేశారు. రాజ్యసభ ఛైర్మన్ సి.పి రాధాకృష్ణన్ తన ఛాంబర్‌లో నితీష్‌కుమార్ చేత ప్రమాణస్వీకారం చేయించారు. నితీష్‌కుమార్ హిందీలో ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రి, రాజ్యసభ నేత జెపి నడ్డా, ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్, న్యాయశాఖ సహాయ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్‌లు హాజరయ్యారు. అలాగే జెడియు నేత, ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ సంజరు కుమార్ ఝా, కాంగ్రెస్ నేత జైరాం రమేష్, బిజెపి ఎంపి మాజీ కేంద్రమంత్రి అయిన రాజీవ్ ప్రతాప్ రూడీ తదితరులు ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరయ్యారు. ఎన్‌డిఎ తదుపరి బీహార్ సిఎం ఎవరనేది త్వరలోనే వెల్లడించనుంది. బహుశా ఏప్రిల్ 14న కొత్త ముఖ్యమంత్రిని ఎన్‌డిఎ ఎన్నుకునే అవకాశం ఉంది.

## మహిళలకు రూ.3వేలు, ఆరు నెలల్లో యూసీసీ అమలు

– బెంగాల్‌లో 'సంకల్ప్ పత్ర' పేరుతో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా భాజపా మ్యానిఫెస్టో

**కలకత్తా, ఏప్రిల్ 10 (ఆర్ఎన్ఎ):** పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో భాజపా తన మ్యానిఫెస్టోను విడుదల చేసింది. 'సంకల్ప్ పత్ర' పేరుతో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా శుక్రవారం దీన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వంపై అమిత్‌షా తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఆ ప్రభుత్వ 15 ఏళ్ల పాలన పశ్చిమబెంగాల్‌కు ఒక పీడకల అని అభివర్ణించారు. రాష్ట్ర ప్రజలు ప్రస్తుతం భయంతో జీవిస్తున్నారని.. వారు మార్పు కోరుకుంటున్నారని అమిత్‌షా అన్నారు. తాము అధికారంలోకి వచ్చాక బెంగాల్‌లోని అన్నివర్గాలను నిరాశ నుంచి బయటపడేస్తామన్నారు. పంట నష్టాల కారణంగా సతమతమవుతున్న రైతులు, నిరుద్యోగ యువత, భయంతో జీవిస్తున్న మహిళలకు కొత్త దారి చూపిస్తామన్నారు. కాగా.. బెంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికలు ఏప్రిల్ 23, 29న రెండు విడతలుగా జరగనున్నాయి. మే 4న ఓట్ల లెక్కింపు ఉండనుంది.

**మ్యానిఫెస్టోలోని ముఖ్యాంశాలు..**

– గోవుల అక్రమ రవాణాపై కఠిన చర్యలు



– బెంగాల్‌లో చొరబాటుదారులపై జీరో టోలరెన్స్
– ఆరు నెలల్లో ఉమ్మడి పౌరస్మృతి (యూసీసీ) అమలు
– ఉద్యోగులకు 7వ వేతన సంఘం అమలు
– ఐదేళ్లలో కోటి కొత్త ఉద్యోగాలు
– స్వయంఉపాధి అవకాశాలు
– నిరుద్యోగ యువతకు నెలకు రూ.3వేలు
– మహిళలకు ప్రతినెలా రూ.3వేలు ఆర్థిక సాయం
– మహిళల కోసం ప్రత్యేక పోలీస్ బెటాలియన్లు
– రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు

## రష్యాలో చిక్కుకుపోయిన 26 మంది భారతీయులు

– సుప్రీం కోర్టులో పిటిషన్



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 10 (ఆర్ఎన్ఎ):** రష్యాలో చిక్కుకుపోయిన 26 మంది భారతీయులను స్వదేశానికి సురక్షితంగా తీసుకొచ్చేలా కేంద్రాన్ని ఆదేశించాలని కోరుతూ సుప్రీం కోర్టు (రాబజూతీవవవ జశీబతీ)లో పిటిషన్ దాఖలైంది. దీనిని పరిశీలించిన న్యాయస్థానం విచారణకు అంగీకరించింది. అయితే, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని వీరిని రష్యా (=బంంఖు)కు పంపించిన కొందరు ఏజెంట్లు.. వారిని తప్పుదోవ పట్టించారనే ఆరోపణలున్నాయి. ఆ తర్వాత పుతిన్ సైన్యంతో కలిసి ఉక్రెయిన్ యుద్ధంలో పాల్గొనేలా వారిపై ఒత్తిడి తెచ్చారని సమాచారం. రష్యాలో 26 మంది భారతీయులు చిక్కుకుపోయారని, వారి ఆచూకీ తెలుసుకోవడానికి దౌత్యపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ బాధిత కుటుంబాలు సుప్రీం కోర్టును ఆశ్రయించాయి. మాస్కో నిర్బంధంలో ఉన్న వారి ప్రస్తుత పరిస్థితి ఏంటనే విషయాన్ని తెలియజేయాలని అందులో పేర్కొన్నాయి. ఉక్రెయిన్‌తో

మిగతా 2లో..

## యమునా నదిలో పడవ బోల్తా..

– పలువురి మృతి



**మథుర, ఏప్రిల్ 10 (ఆర్ఎన్ఎ):** ఉత్తర్‌ప్రదేశ్‌లోని మథురలో పెను విషాదం చోటుచేసుకుంది. బృందావన్‌లోని యమునా నదిలో పడవ బోల్తా పడిన ఘటనలో పదుల సంఖ్యలో పర్యాటకులు గల్లంతయ్యారు. రంగంలోకి దిగిన పోలీసులు స్థానికుల సహాయంతో ఘటనాస్థలంలో ముమ్మరంగా సహాయక చర్యలు కొనసాగిస్తున్నారు. ఈ ఘటనలో ఆరు మృతదేహాలను వెలికి తీయగా.. 17 మందిని సురక్షితంగా బయటకు తీసుకొచ్చి

మిగతా 2లో..

## రూ.39,436 కోట్ల విలువైన 31 ప్రాజెక్టులకు ఆమోదం

– క్వాంటమ్ వ్యాలీ ప్రాజెక్టులో మూడు సంస్థల ఏర్పాటు... విశాఖపట్నం, అనకాపల్లిలో ఏఐ డేటా ప్రాజెక్టు అమలు

విశాఖలో కేబుల్ ల్యాండింగ్ స్టేషన్ స్థాపన కోసం సీటెక్ భూముల కేటాయింపు

సత్యసాయి జిల్లాలో సెమీకండక్టర్ ఫ్యాబ్రికేషన్ కోసం ఆర్ఆర్ ఎలక్ట్రానిక్స్‌కు 60 ఎకరాలు

కేబినేట్ వివరాలు వెల్లడించిన మంత్రి పార్థసారథి

**అమరావతి, ఏప్రిల్ 10 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన ఆంధ్రప్రదేశ్ కేబినెట్ సమావేశం కీలక నిర్ణయాలు తీసుకుంది. సచివాలయంలో దాదాపు 3 గంటలకు పైగా కేబినెట్ భేటీ కొనసాగగా.. ముఖ్యంగా రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించిన కేంద్ర ప్రభుత్వానికి, ప్రధాని నరేంద్ర మోడీకి మంత్రి మండలి ధన్యవాదాలు తెలియజేసింది. ఈ సమావేశంలో 16వ రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలిలో చర్చించిన పలు పెట్టుబడి ప్రతిపాదనలకు కేబినెట్ ఆమోదం తెలిపింది. మొత్తం రూ.39,436 కోట్ల విలువైన 31 ప్రాజెక్టులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. ఈ ప్రాజెక్టులు రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధికి దోహదపడనున్నాయి. అదేవిధంగా, క్వాంటమ్




వ్యాలీ ప్రాజెక్టులో భాగంగా మూడు సంస్థల ఏర్పాటుకు కూడా కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇది సాంకేతిక రంగంలో ముందుకు తీసుకెళ్లే కీలక అడుగుగా భావిస్తున్నారు. ఇక జోనల్ వ్యవస్థకు సంబంధించి కూడా కేబినెట్‌లో చర్చ జరిగింది. రాష్ట్ర పరిపాలనలో సమతుల్యత కోసం తీసుకునే చర్యలపై అధికారులు వివరాలు సమర్పించారు.

పలు పరిశ్రమలు, సంస్థలకు భూ కేటాయింపుల విషయంలో కూడా కేబినెట్ అనుమతులు ఇచ్చింది. మొత్తం 60కి పైగా ఎజెండా అంశాలను పరిశీలించిన కేబినెట్, వాటిలో ముఖ్యమైన వాటికి ఆమోదం తెలిపింది. మొత్తానికి, ఈ కేబినెట్ సమావేశం రాష్ట్ర అభివృద్ధికి దిశానిర్దేశం చేసే పలు నిర్ణయాలతో ముగిసిందని అధికారులు పేర్కొన్నారు. కూటమి

మిగతా 2లో..

## పరాకాష్టకు చేరిన వైసిపి రాజకీయం

- క్రిమినల్స్ ఇలానే రాజకీయం చేస్తారు
- మంత్రులతో సిఎం చంద్రబాబు నాయుడు



**అమరావతి, ఏప్రిల్ 10 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** వైసీపీ అరాచకాలు పరాకాష్టకు చేరాయి. ఎవరిని లేపుతారు.. ఇటువంటి క్రిమినల్స్ చేసే బెదిరింపులకు ఎవరూ భయపడరని సీఎం చంద్రబాబు అన్నారు. వైసిపి క్రిమలన్ రాజకీయాలతో జాగ్రత్తగా ఉండాలని మంత్రులకు సూచించారు. వైసీపీ నేతలు చేస్తున్న వ్యాఖ్యలపై ఏబీ కేబినెట్‌లో చర్చ జరిగింది. మంత్రి నిమ్మల

మిగతా 2లో..

నిజమైన నాగరికత ఇంద్రియ సుఖానుభూతులనుండి, పశుత్వం నుండి మనిషిని ఉద్ధరించేదిగా ఉండాలి. మిమ్మల్ని బలవంతులుగా చేసే ప్రతీ ఆశయాన్ని స్వీకరించండి.

## నేటి మనదేశమ్ సంపాదకీయం

# మహిళా బిల్లుతో పాటు.. సమాజ రుగ్మతలపైనా చర్చించాలి !

భారతదేశం స్వాతంత్ర్యం సముపార్జించి 80వ ఏట అడుగిడబోతున్నాం. సాధించిన విజయాలకన్నా అపజయాలే ఎక్కువగా చర్చించుకోవాలి. దేశంలో నేటికీ సరైన విద్యా వైద్యం అందడం లేదు. పేదలు పేదలు గానే జీవిస్తున్నారు. గృహవసతి అందని ద్రాక్షగా మారింది. విద్య డబ్బున్న వారికే అందుబాటులో ఉంది. విద్యకోసం మధ్య తరగతి, పేదలు అప్పులు చేయాల్సి వస్తోంది. సరైన వైద్యం అందుబాటులో లేదు. కనీసం జిల్లాకో మంచి కార్పోరేట్ తరహా ఆస్పత్రి కట్టలేక పోయారు. ఫీజు రియంబర్స్ మెంట్, ఆరోగ్యశ్రీ లాంటి పథకాలకు వేలకోట్లు వెచ్చిస్తున్న ప్రభుత్వాలు సొంతంగా ఆస్పత్రులను నిర్మించలేక పోతున్నాయి. అన్నింటికీ మించి గంజాయి, డ్రగ్స్ విచ్చలవిడిగా వాడేస్తున్నారు. అత్యాచారాలకు లెక్కేలేదు. మహిళల భద్రత డొల్ల అని చెప్పక తప్పదు. అమ్మాయిల అపహరణ కేసులు పెరుగుతున్నాయి. సమాజాన్ని పట్టిపపీడిస్తున్న ఈ సమస్యలపై నిరంతరం చర్చించాలి. నిర్మూలనకు చర్యలు తీసుకోవాలి. ఈ క్రమంలో మహిళల రిజర్వేషన్లను ముందుకు తీసుకెళ్లే ముఖ్యమైన బిల్లుపై చర్చించేందుకు, ఆమోదించేందుకు ఏప్రిల్ 16న పార్లమెంటు సమావేశం కానుంది. దీనికి చట్టబద్ధత కల్పించడం ద్వారా చట్టసభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్లు అమలు కానున్నాయి. దీంతో ఎంతోకాలంగా ఎదురు చూస్తున్న మహిళా రిజర్వేషన్ల కల సాకారం కానుంది. 2029 ఎన్నికల నుంచి ఇది అమల్లోకి రానుంది. భారత్‌లోని కోట్లాది మహిళల ఆకాంక్షలకు ఇది ప్రతిబింబంగా చూడాలి. మహిళలు అభివృద్ధి సాధించినప్పుడే సమాజం పురోగమి స్తుందనే మన సుదీర్ఘ నాగరికతా స్ఫూర్తికి ఇది నిదర్శనం. దేశ జనాభాలో దాదాపు సగం మంది మహిళలే ఉన్నా వారికి ఇన్నాళ్లూ చట్టసభల్లో తగిన ప్రాతినిధ్యం దక్కలేదు. ఈ దేశానికి వారు అందిస్తున్న సేవలు అపారమైనవే కాదు... అమూల్యమైనవి కూడా. అయినా ఇంకా చిన్నచూపు చూస్తూనే ఉన్నారు. పిల్లను కనే యంత్రాలుగా భావిస్తున్నారు. నిజానికి ప్రతిరంగం లోనూ మహిళలు సాధిస్తున్న అద్భుతమైన విజయాలకు ఎందరో దిక్సూచిగా నిలిచారు. శాస్త్ర, సాంకేతిక రంగాల నుంచి ఔత్సాహిక పారిశ్రామిక రంగం వరకు, క్రీడల నుంచి రక్షణ బలగాల వరకు, సంగీతం నుంచి లలితకళల వరకు దేశాభివృద్ధిలో మహిళలే అగ్రగామిగా ఉన్నారు. కొన్నేళ్లుగా చేసిన ప్రయత్నాలు స్త్రీ సాధికారత దిశగా అనుకూల వాతావరణాన్ని సృష్టించాయి. చదువుకునేందుకు విస్తృతంగా పెరిగిన అవకాశాలు, మెరుగైన ఆరోగ్య సేవలు, విస్తరించిన ఆర్థిక సమ్మిళితత్వం, అందుబాటులోకి వచ్చిన ప్రాథమిక అవసరాలు.. ఆర్థిక, సామాజిక కార్యక్రమాల్లో మహిళల భాగస్వామ్యాన్ని విస్తృతం చేశాయి. అయినప్పటికీ.. సమాజంలో మహిళలు పోషిస్తున్న పాత్రకు అనుగుణంగా రాజకీయ రంగంలో, శాసనసభల్లో వారికి తగు ప్రాతినిధ్యం లభించలేదు. ఇది దురదృష్టకరం అని చెప్పుకోవాలి. దాదాపు 80 ఏళ్ల స్వాతంత్ర్యానంతరం ఇప్పుడు ఈ కల సాకారం కాబోతున్నది. పరిపాలనలో, నిర్ణయాధికారంలో మహిళలు భాగస్వాములైతే.. వారిదైన ఆలోచనలనూ, అనుభవాలనూ జోడించడం ద్వారా ప్రజోపయోగ చర్చలు, పాలనా సామర్థ్యం మరింత మెరుగవు తాయనడంలో సందేహం లేదు. రిజర్వేషన్ల బల్లు ఆమోదం దక్కాక రానున్న అంటే... 2029లో లోక్‌సభ, వివిధ రాష్ట్రాల శాసనసభలకు ఎన్నికలు జరిగే నాటికి మహిళా రిజర్వేషన్లను అమలుచేయడం ఇక అనివార్యం కానుంది. ప్రజాస్వామ్య వ్యవస్థలో మహిళలకు దక్కాల్సిన ప్రాధాన్యాన్ని అందించేందుకు గత ప్రభుత్వాలు కూడా దశాబ్దాలుగా తమవంతు ప్రయత్నం చేస్తూ వచ్చాయి. కమిటీలు ఏర్పాటయ్యాయి. ముసాయిదా బిల్లులను ప్రవేశపెట్టారు. కానీ అవేవీ కార్యరూపం దాల్చలేదు. అయినప్పటికీ... చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యం పెరగాలన్న అంశంలో విస్తృత ఏకాభిప్రాయం వ్యక్తం అయింది. ఈ ఏకాభిప్రాయ స్ఫూర్తితోనే 2023 సెప్టెంబరులో నారీ శక్తి వందన్ అధీనియం ను పార్లమెంటు ఆమోదించింది. భారత చరిత్రలో ఇదో సువర్ణాధ్యాయంగా చెప్పుకోవాలి. మహిళలను శక్తివంతంగా ఎదగడానికి ఇదో ప్రయత్నంగా చూడాలి. వారికి సమున్నత గౌరవం ఇచ్చే చర్యగా భావించాలి. మహిళలకు రిజర్వేషన్లు కల్పించే ఈ అవకాశం మన రాజ్యాంగ స్ఫూర్తికి నిదర్శనంగా చూడాలి. ఓ రకంగా ప్రపంచ దేశాలతో పోలిస్తే మనం ఎంతో ముందున్నామని చెప్పుకోవాలి. ఆచరణాత్మక రూపంలో సమానత్వానికి ప్రాతినిధ్యం ఉన్న సమాజాన్ని నిర్మించాలన్న మన రాజ్యాంగ నిర్మాతల ఆకాంక్షలను నెరవేర్చడంలో భాగంగా చేపడుతున్న ఈ ప్రయత్నం నిజంగా అభినందించ దగ్గదే. శాసన వ్యవస్థల్లో మహిళల పాత్రను బలోపేతం చేయడం అంటే వారిని మనం గౌరవించుకోవడమే. వారి శక్తిని దేశానికి ఉపయోగించడమే అవుతుంది. ఒక ఇంటిని ఎలా అయితే మహిళ నిర్మిస్తుందో, దేశ భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ప్రతి మహిళకు సమాన భాగస్వామ్యాన్ని అందించే సమాజాన్ని నిర్మించడంలో మనమంతా అవకాశం ఇవ్వాలి. నిజానికి ఇది ఎప్పుడో జరగాల్సిన సత్కార్యం. మహిళల ప్రాతినిధ్యాన్ని ముందుకు తీసుకెళ్లడంలో ఇప్పటికే జాప్యం జరిగింది. శాసన వ్యవస్థల్లో మహిళల భాగస్వామ్యాన్ని పెంపొందించాల్సిన అవసరాన్ని దశాబ్దాల కిందటే గుర్తించినా అడుగు ముందుకు వేయలేదు. ఈ అంశంపై చర్చించారు తప్ప చట్టం చేయలేదు. జనాభాలో సగ భాగంగా ఉన్న వారి ఆకాంక్షలను మన శాసన వ్యవస్థలు ప్రతిబింబించాల్సిన అవసరం ఉంది. మహిళా రిజర్వేషన్ బిల్లుకు లభించే ఆమోదంలో విస్తృత ఏకాభిప్రాయం ముఖ్యం. ఇక్కడ శశభిషలకు తావు లేకుండా ఏకగ్రీవంగా పార్లమెంట్ దీనిని ఆమోదించి తీరాలి. జాతీయ ప్రయోజనాలే పరమావధి అన్న సంకల్పంతో ముందుకు సాగాలి. భారతీయ మహిళల కోసం చేపడుతున్న ఈ ముఖ్యమైన కార్యక్రమానికి మద్దతు అందించాల్సి బాధ్యత అన్న పార్టీలకు ఉంది. ఇకపోతే ఇదే సందర్భంలో దేశాన్ని పట్టిపీడిస్తున్న కొన్ని రుగ్మతలనైనా రూపుమాపేందుకు చర్చించాలి. దేశంలో వేళ్లూనుకు పోయిన కులవ్యవస్థపై చర్చంచాలి. కులాల వారీగా రిజర్వేషన్లు అనేవి ఉన్నా.. కులాల ఉమ్మలాటలు ఆగడం లేదు. దేశ ప్రజలంతా సమానమే అన్న భావన రావాలంటే కుల వ్యవస్థను కూకటివేళ్లతో పెరికివేయాలి. ఈ విషయంపైనా ఇటీవల పలువురు ప్రముఖులు చర్చ లేవనెత్తారు. రాజకీయ పార్టీలు దూరదృష్టితో ఆలోచిస్తే.. ఇదేమంత పెద్ద సమస్య కాబోదు.

# ప్రారంభోత్సవానికి రెడీ అవుతున్న భోగాపురం

**జూలైలో ప్రారంభోత్సవానికి తేదీలు ఖరారు... జూలై 5వ తేదీ లేదా 8వ తేదీన డేట్లు ఫిక్స్ చేసిన ప్రభుత్వం**

**ప్రారంభోత్సవానికి ప్రధాని మోడీకి ఆహ్వానం**

**విశాఖపట్నం, ఏప్రిల్ 10 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఉత్తరాంధ్ర ప్రజల దశాబ్దాల కల, ఏపీ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవానికి ముహూర్తం ఖరారైంది. జూలై మొదటి వారంలో ఈ విమానాశ్రయం ప్రారంభం కానుండటంతో ఉత్తరాంధ్ర రూపురేఖలు మారిపోనున్నాయి. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం పనులు తుది దశకు చేరుకున్నాయి. జూలై 5వ తేదీ లేదా 8వ తేదీన ఈ విమానాశ్రయాన్ని ప్రారంభించాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిర్ణయించారు. ఈ విమానాశ్రయ ప్రారంభోత్సవానికి రావాల్సిందిగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఇప్పటికే ఆహ్వానం పంపారు. మోదీ షెడ్యూల్ ఆధారంగా జూలై 5వ తేదీ లేదా 8వ తేదీల్లో ఒకటి ఖరారు కానుంది. జూన్ 30వ తేదీ కల్లా మిగిలిన అన్ని పనులను పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం అదనపు సిబ్బందిని మోహరించి రాత్రింబవళ్లు పనులు కొనసాగిస్తున్నారు. అంతర్జాతీయ విమానాల రాకపోకల కోసం అవసరమైన ఇమ్మిగ్రేషన్ స్టేటస్ నోటిఫికేషన్‌ను త్వరగా పూర్తి చేయాలని సీఎం చంద్రబాబు కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే ఈ విమానాశ్రయాన్ని కస్టమ్స్ ఎయిర్‌పోర్ట్‌గా కేంద్రం నోటిఫై చేసింది. విమానాశ్రయానికి వెళ్లే ప్రయాణికులకు ట్రాఫిక్ కష్టాలు లేకుండా ప్రభుత్వం భారీ ప్రణాళికలు సిద్ధం చేసింది. విశాఖపట్నం నుంచి భోగాపురం వెళ్లే మార్గంలో అత్యంత రద్దీగా ఉండే ఆనందపురం జంక్షన్ వద్ద ట్రాఫిక్ సమస్యను పరిష్కరించడానికి ఫ్లైఓవర్ అలైన్‌మెంట్‌ను ఖరారు చేశారు. దీనికి సంబంధించిన డీపీఆర్ 45 రోజుల్లో సిద్ధం కానుంది. భోగాపురం వరకు మెట్రో సౌకర్యాన్ని కల్పించేందుకు సంస్థ సవరించిన డీపీఆర్‌ను సిద్ధం చేస్తోంది. ఇది డబుల్ డెక్కర్ మోడల్‌లో ఉండబోతోంది (కింద రోడ్డు, పైన మెట్రో). విశాఖ స్టీల్ ప్లాంట్ నుంచి భోగాపురం వరకు ఈ కారిడార్ విస్తరించనుంది. రోడ్ నంబర్ 12, 14 పనుల కోసం అటవీ, రక్షణ శాఖల అనుమతులను వేగవంతం చేశారు. తీర ప్రాంతం వెంట విశాఖను భోగాపురంతో కలిపే ప్రత్యేక కోస్టల్ కారిడార్ పనులు కూడా ఊపందుకున్నాయి. భోగాపురం ఎయిరోసిటీ, ఐటీ హబ్స్, లాజిస్టిక్ పార్కుల వల్ల ఈ ప్రాంతంలో వేలాది మందికి ఉపాధి లభించనుంది. అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ఈ విమానాశ్రయం వల్ల ఉత్తరాంధ్రలోని పర్యాటక ప్రాంతాలకు అంతర్జాతీయ గుర్తింపు లభిస్తుంది. ఫార్మా, మత్స్య పరిశ్రమల ఎగుమతులకు ఈ విమానాశ్రయం కేంద్ర బిందువుగా మారనుంది. భోగాపురం ఎయిర్ పోర్టు, మూలపేట గ్రీన్ ఫీల్డ్ పోర్టు త్వరలో పూర్తవుతాయని కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు వ్యాఖ్యానించారు. కేంద్రప్రభుత్వ సహకారంతో ఏపీ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. భోగాపురం ఎయిర్ పోర్టు జూలై మొదటి వారంలో ప్రారంభించటానికి చర్యలు చేపట్టామని తెలిపారు. ఉత్తరాంధ్ర ప్రాంతానికి ఇదో మైలు రాయని ఉద్ఘాటించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేతుల మీదుగా భోగాపురం ఎయిర్ పోర్టు ప్రారంభించటానికి ప్రయత్నిస్తున్నామని రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు.

# హైదరాబాద్-విజయవాడ మధ్య విమాన సర్వీసు

**ఫ్లై 91 విమాన సర్వీసును ప్రారంభించిన రామ్మోహన్ నాయుడు**




**శ్రీకాకుళం/విజయవాడ, ఏప్రిల్ 10 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** హైదరాబాద్ – విజయవాడ మధ్య ప్రయాణించే వారికి శుభవార్త. ప్రాంతీయ విమానయాన సంస్థ ఫ్లై 91 తన నూతన సర్వీసులను తెలుగు రాష్ట్రాల మధ్య అధికారికంగా ప్రారంభించింది. రెండు తెలుగు రాష్ట్రాల రాజధానుల మధ్య ప్రయాణ దూరాన్ని తగ్గించడంతో పాటు, సామాన్యులకు విమాన ప్రయాణాన్ని చేరువ చేసే లక్ష్యంతో ఫ్లై 91 సంస్థ తన కార్యకలాపాలను విస్తరించింది. కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ఈ నూతన సర్వీసును శ్రీకాకుళం నుంచి వర్చువల్‌గా పచ్చజెండా ఊపి ఈ సర్వీసును శుక్రవారం ప్రారంభించారు. తక్కువ ధరలో వేగవంతమైన ప్రయాణాన్ని అందించడమే ఈ సంస్థ ప్రధాన ఉద్దేశ్యం. విమాన సర్వీసును ప్రారంభించిన అనంతరం కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా టైర్–2, టైర్–3 నగరాలను అనుసంధానించేందుకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ప్రాంతీయ కనెక్టివిటీని పెంచడం ద్వారా సామాన్యులు కూడా విమానం ఎక్కాలన్న ప్రధానమంత్రి కల నిజమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. విజయవాడ – హైదరాబాద్ మధ్య రద్దీ దృష్ట్యా ఈ సర్వీస్ ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. రోడ్డు మార్గంలో సుమారు 5 నుంచి 6 గంటల సమయం పట్టే ప్రయాణం, విమానం ద్వారా కేవలం 50 నిమిషాల నుంచి గంటలో పూర్తవుతుంది. హైదరాబాద్‌లో ఐటీ రంగం, విజయవాడలో వ్యాపార రంగాలు బలంగా ఉన్న నేపథ్యంలో, ఈ విమాన సర్వీస్ వ్యాపారవేత్తలకు వరంలా మారనుంది. ఫ్లై 91 సంస్థ తన టికెట్ ధరలను ఇతర విమాన సంస్థలతో పోలిస్తే అందుబాటులో ఉంచేలా ప్రణాళికలు చేస్తోంది. ఈ సంస్థ గోవా కేంద్రంగా పనిచేస్తున్న ఒక ప్రాంతీయ విమానయాన సంస్థ. ఇది ప్రధానంగా తక్కువ దూరం ఉండే నగరాల మధ్య సర్వీసులను నడుపుతోంది. తెలుగు రాష్ట్రాల్లో తమ నెట్‌వర్క్‌ను పెంచుకోవడం ద్వారా ప్రయాణికులకు మరిన్నిసౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయి. ఈ కొత్త సర్వీసు అందుబాటులోకి రావడం వల్ల అటు విజయవాడ ప్రాంత ప్రజలకు, ఇటు హైదరాబాద్ ప్రజలకు రవాణా పరంగా మరిన్ని వెసులుబాట్లు కలగనున్నాయి. ఈ విమాన సర్వీసు అందుబాటులోకి రావడం వల్ల రోడ్డు ప్రయాణంపై ఒత్తిడి తగ్గనుందని భావిస్తున్నారు.

# 18న మన వారసత్వానికి ఘనమైన వెలుగు

**– ప్రపంచ వారసత్వ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు**

**– మీడియా సమావేశంలో కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**

**విజయవాడ, ఏప్రిల్ 10 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మన ఘనమైన వారసత్వాన్ని కాపాడుకుంటూ బలమైన భవిష్యత్తును నిర్మించే ప్రయత్నంలో భాగంగా ఈ నెల 18న ప్రపంచ వారసత్వ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తామని, వినూత్న కార్యాచరణతో వారసత్వానికి పట్టంకట్టే ఈ చొరవను విజయవంతం చేద్దామని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. ప్రపంచ వారసత్వ దినోత్సవం సందర్భంగా నిర్వహించే ప్రత్యేక కార్యక్రమాలపై కలెక్టర్ లక్ష్మీశ శుక్రవారం మీడియా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర పర్యాటక, ఎన్‌టీఆర్ జిల్లా అధికార యంత్రాంగం, జిల్లా పర్యాటక ప్రాధికార సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కనకదుర్గమ్మ వారి ఆలయంతో పాటు మొగల్రాజపురం గుహలు, అక్కన్న మాదన్న గుహలు, గాంధీ కొండ, కొండపల్లి ఖిల్లా.. ఇలా మన ఘన సాంస్కృతిక వారసత్వ సంపదకు ఎన్నో ప్రతీకలు ఉన్నాయని.. వీటిని కాపాడుకుంటూ భావితరాలకు విలువైన వెలకెట్టలేని వారసత్వాన్ని బహుమతిగా ఇవ్వాల్సిన అవసరం ఉందని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు.


**హెరిటేజ్ ట్రెక్కింగ్ నుంచి సంగీత స్వర ఝరి వరకు:**

ఈ నెల 18వ తేదీ ఉదయం కొండపల్లి ఖిల్లాపైకి హెరిటేజ్ ట్రెక్కింగ్ ఉంటుందని.. ఉదయం 6 గంటలకు ఇది ప్రారంభమవుతుందని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. అదేవిధంగా కొన్ని స్పోర్ట్స్ ఈవెంట్లు కూడా జరుగుతాయన్నారు. ఇండియన్ నేషనల్ ట్రస్ట్ ఫర్ ఆర్ట్ అండ్ కల్చరల్ హెరిటేజ్ (ఐఎన్‌టీఏసీహెచ్) భాగస్వామ్యంతో నగరంలో హెరిటేజ్ వాక్ కార్యక్రమాన్ని కూడా నిర్వహించనున్నట్లు తెలిపారు. కొండపల్లిలో కొండపల్లి బొమ్మలతో మేళా కూడా ఏర్పాటు చేయడం జరుగుతుందని.. ఇది మూడు రోజుల పాటు కొనసాగుతుందని వెల్లడించారు. వారసత్వ సంస్కృతి, ఆధునిక జెన్ జెడ్, పండగలు, సుస్థిర అభివృద్ధి తదితర అంశాలపై మార్చి 8న కొండపల్లి బొమ్మల పోటీ నిర్వహించడం జరిగిందని.. ఇందులోని విజేతకు కొండపల్లి బొమ్మల మేళా కార్యక్రమం సందర్భంగా రూ. లక్ష విలువైన బహుమతులు, సర్టిఫికెట్లు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. అదేవిధంగా 18వ తేదీ రాత్రి ఇందిరాగాంధీ మునిసపల్ మైదానం పక్కన ఖాళీ స్థలంలో సంగీత ఝరితో వారసత్వానికి పట్టంకట్టే కార్యక్రమం జరుగుతుందని.. ఈ కార్యక్రమానికి ప్రముఖ గాయకులు ఎస్‌పీ చరణ్, సునీత తదితరులు పాల్గొంటారని తెలిపారు. వారసత్వ ఔన్నత్యానికి ప్రతీకలుగా నిలిచే వారిని గుర్తించి, వారిని ఘనంగా సత్కరించడం జరుగుతుందని కలెక్టర్ లక్ష్మీశ వివరించారు. వారసత్వ సంపదను భావితరాలకు అందించే బృహత్ సంకల్పానికి ప్రతిఒక్కరూ కలిసిరావాలని.. సమష్టి కృషితో విజయవంతం చేద్దామని పిలుపునిచ్చారు. ఈ ఒక్క సంవత్సరానికి పరిమితం కాకుండా వీటిని ఏటా నిర్వహించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు వివరించారు. సమావేశంలో ఇన్‌టాక్ విజయవాడ చాప్టర్ కన్వీనర్ సాయి పాపినేని, ఆర్‌టీఐహెచ్ విజయవాడ సీఈవో జి.కృష్ణన్, జిల్లా పర్యాటక అధికారి ఎ.శిల్ప, కొండపల్లి బొమ్మల హస్తకళాకారుల సొసైటీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.




## మొదటి పేజీ తరువాయి

# కేబినేట్ ఎజెండా ముందే లీక్



సమావేశానికి ముందే ఎజెండా లీకైతే సంబంధిత మంత్రులే బాధ్యత వహించాల్సి వస్తుందని స్పష్టంగా హెచ్చరించారు. గతంలో ఇలాంటి లీకుల కారణంగా ఎన్టీఆర్ తన కేబినెట్‌ను రద్దు చేసిన విషయాన్ని గుర్తుచేస్తూ, అలాంటి పరిస్థితి మళ్లీ రాకూడదని చెప్పారు. ఎన్టీఆర్ ఎవరు లేకుండా 15 రోజులు ప్రభుత్వాన్ని నడిపారని సీఎం గుర్తు చేశారు. పేపర్ లీక్ కేసులో ఆ రోజు బాలయోగి రాజీనామా చేశారని చెప్పారు. ఇప్పుడు సాంకేతికతతో ఎవరి నుంచి లీక్ అయిందో తేలికగా కనుక్కోవచ్చని స్పష్టం చేశారు. మంత్రులు, కార్యదర్శులు బాధ్యతగా ఉండాలని సీఎం చంద్రబాబు నాయుడు సూచించారు. మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతమైతే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. అదేవిధంగా, ప్రభుత్వ పథకాల అమలుపై కూడా సీఎం మంత్రులకు పలు సూచనలు చేశారు. 'జలధార' పథకం గురించి ప్రజల్లో మరింత అవగాహన కల్పించాలని సూచించారు. పాస్‌బుక్స్ వ్యవహారంపై రెవెన్యూ అధికారులు, సంబంధిత మంత్రులు నెలకు కనీసం నాలుగు సార్లు ప్రాంతాల వారీగా పర్యటించాలని ఆదేశించారు. 'సూర్య ఘర్' పథకంపై మరింత దృష్టి పెట్టాలని, వచ్చే ఏడాదితో ముగియనున్న లక్ష్యాలను సమయానికి పూర్తి చేయాలని మంత్రులకు నిర్దేశిరచారు. కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే మహిళా బిల్లుపై కూడా కేబినెట్‌లో చర్చ జరిగింది. ఇక, రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల నిర్వహణపై కూడా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. మూడు నుంచి నాలుగు నెలల వ్యవధిలో ఎన్నికలు నిర్వహించే అవకాశాలపై చర్చించినట్లు తెలుస్తోంది. మొత్తంగా, ఏపీ కేబినెట్‌లో లీకుల అంశంపై సీఎం చంద్రబాబు గట్టి హెచ్చరిక జారీ చేయడంతో పాటు, ప్రభుత్వ పథకాల అమలుపై స్పష్టమైన దిశానిర్దేశర చేశారు. అజెండా అంశాలు ముగిశాక వివిధ అంశాలపై మంత్రులతో సీఎం చర్చించారు. కేబినెట్ సమావేశం ప్రారంభమైనా అజెండా మాత్రం మంత్రులకు రాలేదని మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రస్తావించారు. అజెండా ముందే వస్తే స్టడీ చేసుకుని కేబినెట్‌కు వచ్చే వీలు ఉండేదన్నారు. దీంతో వివిధ శాఖల కార్యదర్శుల పనితీరుపై ముఖ్యమంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. వ్యవస్థలు రాను రాను మరింత ఉపయోగపడాల్సింది పోయి క్లిష్టంగా మారుతున్నాయంటూ అధికారుల తీరను ముఖ్యమంత్రి తప్పుబట్టారు. కార్యదర్శులు గతంలో స్లబెక్టుల్లో భాగస్వాములవుతూ చర్చల్లో ఏ సందేహం వచ్చినా పూర్తిగా నివృత్తి చేసేందుకు చొరవ చూపేవారని సీఎం చంద్రబాబు గుర్తుచేశారు. ఇప్పుడా పరిస్థితి లేదంటూ అసంతృప్తి వ్యక్తం చేశారు. డీమ్డ్ యూనివర్సిటీలను రాష్ట్రంలో ఎక్కువ ప్రమోట్ చేయాలని సీఎం ఆదేశించారు. 10 ఎకరాలు తక్కువ కాకుండా నిబంధనలు పెట్టి నాణ్యత పెంచుతూ ఎక్కువ సంఖ్యలో డీమ్డ్ యూనివర్సిటీలను అందుబాటు లోకి తీసుకురావాలన్నారు. ఇతర రాష్ట్రాలతో పోల్చితే ఏపీలో తక్కువ డీమ్డ్ యూనివర్సిటీలు ఉన్నాయని సీఎం తెలిపారు. జలధార, సూర్యఘర్, పీఎం కుసుమ్, పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలను మంత్రులు ఓనర్ షిప్ తీసుకోవాలని సీఎం దిశానిర్దేశర చేశారు. ప్రతి మంత్రి పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీకి సంబంధించి నాలుగు కార్యక్రమాల్లో అయినా పాల్గొనాలని ఆదేశించారు. కూటమి ఎమ్మెల్యేలూ ఇదే అనుసరించాలన్నారు. జలధారకు ఉపాధి హామీ నిధులు అనుసంధానం అయ్యేలా పనులు చేపట్టాలని సీఎం నిర్దేశిరచారు. సూర్యఘర్, పీఎం కుసుమ్ కింద వీలైనన్ని ఎక్కువ కనెక్షన్లు ఇచ్చేలా కార్యాచరణ ఉండాలన్నారు. గ్రామాలను శుభ్రంగా ఉంచుకుంటూ వ్యాధుల నివారణకు కృషి చేసేలా స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలు చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలు జారీ చేశారు.

# రష్యాలో చిక్కుకుపోయిన 26 మంది భారతీయులు

రష్యా చేస్తోన్న యుద్ధంలో వీరు పాల్గొనాల్సి వచ్చిందని.. కొందరు గాయపడటం, మరికొందరు నిర్బంధంలో ఉన్నట్లు తెలిసిందని పిటిషనర్ తరఫు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. పిటిషనర్ల విజ్ఞప్తిని పరిశీలించిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం.. కేంద్రాన్ని వివరణ కోరింది. ఈ పిటిషన్‌ను పరిశీలించి, కేంద్రం నుంచి సూచనలు తీసుకుంటానని ప్రభుత్వ తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోర్టుకు తెలియజేశారు. ఇందుకు అంగీకరించిన న్యాయస్థానం.. ఈ నెల చివరలో దీనిపై విచారణ చేపడతామని తెలిపింది.

# యమునా నదిలో పడవ బోల్తా..

ఆస్పత్రికి తరలించినట్లు జిల్లా మెజిస్ట్రేట్ చంద్ర ప్రకాశ్ సింగ్ తెలిపారు. వీరంతా పంజాబ్‌కు చెందిన వారని తెలుస్తోంది. వేగంగా వీస్తున్న గాలుల కారణంగా నది మధ్యలో పడవ అదుపు తప్పిందని.. అనంతరం సీ ఘాట్ వద్ద ఉన్న పాంటూన్ వంతెనను ఢీకొట్టడంతో బోల్తా పడినట్లు ప్రాథమిక నివేదికలో తేలిందన్నారు. ఈ ఘటనలో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది

**ప్రధాని మోదీ దిగ్భ్రాంతి**

పడవ ప్రమాదంపై ప్రధాని నరేంద్ర మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందించాలని స్థానిక యంత్రాంగాన్ని ఆదేశించారు.

# పరాకాష్టకు చేరిన వైసిపి రాజకీయం

రామానాయుడు ఈ అంశాన్ని ప్రస్తావించారు. 'కొత్త పలుకు కాదు... ఇక పలుకే ఉండదు' అని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి వ్యాఖ్యానించినట్లు రామానాయుడు కేబినెట్‌కు తెలియజేశారు. దీనిపై సీఎం చంద్రబాబు తీవ్రంగా స్పందించారు. క్రిమినల్స్‌ను ఎట్టి పరిస్థితుల్లో నూ ఫర్మ్‌గా డీల్ చేస్తామని ముఖ్యమంత్రి తెలిపారు. బెదిరించి భయపెడదామని అనుకుంటున్నారని మండిపడ్డారు. ఇటువంటి రాజకీయాలను ఎప్పటికప్పుడు జాగ్రత్తగా గమనించాలని, అన్ని విషయాలను ప్రజలకు తెలియజేయాలని మంత్రులకు సీఎం సూచించారు. 'క్రిమినల్స్ ఇలానే రాజకీయాలు చేస్తారు. వాళ్ల ఆటలు సాగనివ్వకూడదు. ప్రజలకు నిజాలు తెలియచేస్తే సరిపోతుంది. డైవర్షన్ పాలిటిక్స్‌కు వాళ్లు అలవాటు పడ్డారు' అంటూ ముఖ్యమంత్రి విమర్శలు గుప్పించారు.

# రూ.39,436 కోట్ల విలువైన 31 ప్రాజెక్టులకు ఆమోదం

ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.9.36 లక్షల కోట్లు పెట్టుబడులకు ఆమోదం తెలిపినట్లు మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. తద్వారా 9.62 లక్షల మందికి ఉద్యోగాలు లభించాయన్నారు. సమావేశం వివరాలను మంత్రి పార్థసారథి మీడియాకు వివరించారు. విశాఖపట్నం, అనకాపల్లిలో ఏఐ డేటా ప్రాజెక్టు అమలు ప్రతిపాదనలకు ఆమోదం తెలిపామన్నారు. విశాఖలో కేబుల్ ల్యాండింగ్ స్టేషన్ స్థాపన కోసం సీటెక్ భూముల కేటాయింపునకు క్యాబినెట్ ఆమోదం ఇచ్చింది. సత్యసాయి జిల్లాలో ఔట్‌సోర్స్ సెమీకండక్టర్ అసెంబ్లీ టెస్టింగ్ సౌకర్యం రానుంది. సత్యసాయి జిల్లాలో సెమీకండక్టర్ ఫ్యాబ్రికేషన్ కోసం ఆర్ఆర్ ఎలక్ట్రానిక్స్‌కు 60 ఎకరాల కేటాయింపునకు ఆమోదం ఇచ్చారు. ఏపీఐఐసీ, టీసీఎస్ మధ్య ఒప్పందంలో నిబంధనల సవరణకు ఆమోదం ఇచ్చారు. ఏపీఐఐసీ, రహేజా కార్ప్ సంస్థ మధ్య ఒప్పందంలో నిబంధనల సవరణకు ఆమోదం ఇచ్చారు.

# శ్రీకాకుళం సాగునీటిని గాలికి వదిలేసిన వైసిపి

ప్రభుత్వ సహకారంతో చేసిన పనులను అభినందించాలని డిమాండ్ చేశారు. అమరావతి రాజధాని బిల్లు పార్లమెంట్ ఉభయ సభల్లో ఆమోదం పొందడం చరిత్రాత్మక ఘట్టమని ఈ సందర్భంగా ఆయన ప్రశంసించారు. అమరావతి బిల్లుకు కాంగ్రెస్ కూడా మద్దతు ఇచ్చిందని.. జగన్ పార్టీ మాత్రం బిల్లు సందర్భంగా పార్లమెంట్ నుంచి వాకౌట్ చేసిందని మండిపడ్డారు. అమరావతి చట్టబద్ధత కోసం సీఎం చంద్రబాబు నాయుడు చాలా కృషి చేశారని చెప్పుకొచ్చారు. రాజధానిగా అమరావతికి రాష్ట్ర ప్రజలు ఎన్నికల ద్వారా సంపూర్ణ మద్దతు ఇచ్చారని చెప్పుకొచ్చారు. అధికారంలో ఉన్నప్పుడు రాజధానిపై జగన్ మూడు ముక్కలాట ఆడారని.. ఇప్పుడూ అదే డ్రామాలు ఆడుతున్నారని విమర్శించారు. అమరావతి పూర్తయితే చంద్రబాబు పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందన్న భయం వైసీపీదని ఆరోపించారు. జాతీయస్థాయిలో చంద్రబాబుది ఓ ప్రత్యేక గుర్తింపని కొనియాడారు. రాష్ట్రానికి పెట్టుబడులు రాకూడదనేది వైసీపీ అజెండా అయితే.. చంద్రబాబుది అభివృద్ధి అజెండా అని పేర్కొన్నారు. ప్రజలు ఛీ కొట్టినా వైసీపీకి ఇంకా బుద్ధి రాలేదని.. చరిత్ర హీనులుగా మిగిలిపోవడం ఖాయమంటూ నిప్పులు చెరిగారు. విశాఖ రాజధాని పేరుతో వైసీపీ నేతలు భూదందా చేశారని ఆరోపించారు రామ్మోహన్ నాయుడు. త్వరలో భోగాపురం ఎయిర్ పోర్టు, మూలపేట గ్రీన్ ఫీల్డ్ పోర్టు పూర్తవుతాయని.. కేంద్రం సహకారంతో రాష్ట్రాభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని ఆయన చెప్పారు. ఒక పక్క అభివృద్ధి జరుగుతుంటే మరో పక్క వైసీపీ నేతలు గుంట నక్క రాజకీయాలు చేస్తున్నారని కేంద్ర మంత్రి ఆగ్రహించారు.

# అంబేద్కర్ జయంతి ఉత్సవాలను జయప్రదం చేయండి

**కడప, ఏప్రిల్ 10 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135వ జయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలని అంబేద్కర్ జయంతి ఉత్సవాల కమిటీ నాయకులు సగిలి గురప్ప, ఆంజినేయులు , జయవర్ధన్, సుబ్బరాయుడు,అంకన్న, ఓబయ్య, జగన్ నాయక్, రాజేంద్ర ప్రసాద్, గోపి, హరి పిలుపు నిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అంబేద్కర్ సమాజంలో సమానత్వం, స్వేచ్ఛ, సోదరభావం కోసం జీవితాంతం పోరాడిన మహానుభావుడు అని పేర్కొన్నారు. ఆయన చూపిన మార్గంలో నడుస్తూ సామాజిక న్యాయం సాధించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కడప నగరంలో ఈ నెల 14 వ తేదీన నిర్వహించనున్న ర్యాలీ కోటిరెడ్డి సర్కిల్ నుండి ఆర్టీసీ బస్టాండ్ అంబేద్కర్ సర్కిల్ వరకు జరగనున్నదని తెలిపారు. ఈ ర్యాలీలో విద్యార్థులు, యువకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అన్ని వర్గాల ప్రజలు, విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థుల ప్రతిభ

**మదనపల్లె, ఏప్రిల్ 10 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పట్టణంలోని బెసెంట్ దివ్యజ్ఞాన ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరచారు. విజయవాడలోని సెయింట్ మేరీస్ స్టెల్లా కాలేజీలో రూసా అండ్ పి.యం. ఉషా ప్రోగ్రాం రాష్ట్ర డైరెక్టరేట్, ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా కమిషనరేట్, ఆంధ్రప్రదేశ్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు వారి సంయుక్త సహకారంతో రాష్ట్రస్థాయి సర్కులర్ ఎకానమీ ఐడియాథాన్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా సృజన, ఆకృతి - లైవ్ ప్రోడక్ట్ ట్రాక్ పోటీలలో బి.టి. కాలేజీ విద్యార్థులు స్వయంగా తయారుచేసిన ప్లాస్టిక్ వ్యర్థాల ద్వారా పంట పొలాలను జంతువులు, పక్షుల నుండి సంరక్షించే యంత్రాన్ని ప్రదర్శించి తృతీయ బహుమతి పొందారు. ఈ మేరకు శక్రవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గన్నవరం శ్రీదేవి ఆధ్వర్యంలో పోటీల్లో పాల్గొన్న విద్యార్థులను అభినందించి సర్టిఫికెట్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ శ్రీమతి అనూషను, కళాశాల సిబ్బందిని ఆమె అభినందించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ మలిగి రాఘవరెడ్డి, అధ్యాపకులు డాక్టర్ శైలజ సి.ఎస్, డాక్టర్ శ్రీనివాస దేరంగ్, డాక్టర్ చిన్నారెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

# కీర్తన హత్య దారుణం : వెన్న పూస మధురెడ్డి

**కడప , ఏప్రిల్ 10 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** జిల్లాలోని ఖాజీ పేటలో జరిగిన కీర్తన హత్య దారుణమని కాంగ్రెస్ పార్టీ యువనేత వెన్న పూస మధు రెడ్డి ఆవేదన వ్యక్తంచే శారు. శుక్ర వారం కడపలో ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రేమ పేరుతో గొంతు కోసి హత్య చేసిన వ్యక్తిని శిక్షించాలని డిమాండ్ చేశారు. మహిళా భద్రత గాలిలో దీపంలా మారిందని వాపోయారు. హోం మంత్రి ఈ సంఘటనపై స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

# నిబద్ధతతో జనగణన ప్రక్రియను పూర్తి చేయాలి

## - జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్

**అనంతపురం, ఏప్రిల్ 10 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** క్షేత్రస్థాయిలో జనగణన ప్రక్రియలో ప్రజల నుండి సమాచార సేకరణకు వెళ్లనున్న ఎ న్యూమరేటర్లు, సూపర్వైజర్లు తమ కర్తవ్య విధులను నిబద్ధతతో పూర్తిచేయాలని జాయింట్ కలెక్టర్ సి .చరణ్ సూచించారు . శుక్రవారం ఉదయం ఆర్ట్స్ కళాశాలలో ని కంప్యూటర్ కాన్ఫరెన్స్ హాల్లో జనగణన నమోదు ప్రక్రియపై జరుగుతున్న రెండవ రోజు శిక్షణా తరగతులను డిఆర్ఓ మాలోల తో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనాభా లెక్కల సేకరణ ముఖ్యమైనదని, దేశవ్యాప్తంగా వివిధ విధానాల రూప కల్పనలు, ప్రజల సంక్షేమం , దేశాభివృద్ధికి ప్రణాళికలు బడ్జెట్ కేటాయింపులు , సమర్థవంతమైన పాలనకు పునాదిగా ఈ జనగణన ప్రక్రియ ఉంటుందన్నారు. నిర్దేశించిన 33 అంశాలపై పూర్తిస్థాయిలో సమాచార సేకరణ నమోదు పూర్తి చేయాలన్నారు. మండల తాసిల్దారులు మున్సిపల్ కమిషనర్లు ఇతర అధికారులు ఆయా స్థాయిలో సమాచార సేకరణకు పర్యవేక్షణ చర్యలు తీసుకుని ప్రతి డేటాను పారదర్శకతతో పూర్తి చేయాలన్నారు. ఈనెల 16 నుండి ప్రజలు నేరుగా తమ వ్యక్తిగత కుటుంబ వివరాలను నమోదు చేసుకుని అవకాశం ఉంటుందన్నారు. డిఆర్ఓ మాలోల మాట్లాడుతూ శిక్షణ తరగతులలో సందేహాలు నివృత్తి చేసుకొని, అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్ తో డిఆర్ఓ మాలోల ఇంచార్జ్ తాసిల్దార్ రాజా, సెన్సస్ విభాగం డిప్యూటీ తాసిల్దార్ మధుసూదన రావు, ఆర్ ఐ యువ తేజ, జె. ఎ. షఫీ, ఫీల్డ్ ట్రైనర్లు డా.రామచంద్ర, అహ్మద్, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

# శెట్టిపల్లి భూముల రిజిస్ట్రేషన్

## - తుడా ఛైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి

## శెట్టిపల్లి భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభంతో లబ్ధిదారుల హర్షం



**తిరుపతి,ఏప్రిల్ 10 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** శెట్టిపల్లి భూముల రిజిస్ట్రేషన్ తో వారి జీవితాల్లో ప్రభుత్వం వెలుగులు నింపిందని తుడా ఛైర్మన్ తిరుమల తిరుపతి దేవస్థానం ఎక్స్ అఫిషియో మెంబర్ తెదేపా తిరుపతి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి డాలర్స్ దివాకర్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దశాబ్దాల తరబడి పెండింగ్లో ఉన్న శెట్టిపల్లి భూముల సమస్యను పరిష్కరించడం చారిత్రాత్మక ఘట్టమని అభివర్ణించారు.జనవరి 14న ముఖ్యమంత్రి చేతుల మీదుగా 2000 ప్లాట్లకు అత్యంత పారదర్శకమైన రీతిలో సింగిల్ బటన్ లాటరీ ద్వారా కేటాయింపులు జరిగిందన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు వివిధ మండలాల సర్వేయర్లను రప్పించి, 3 నెలల పనిని కేవలం 5 రోజుల్లో పూర్తి చేసి సుమారు 500 ఎకరాల భూమికి బౌండరీలు ఫిక్స్ చేశామన్నారు. ఇందులో 65 ఎకరాలు తుడాకు, 90 ఎకరాలు రెవెన్యూకు, మరియు 200 ఎకరాలు లబ్ధిదారులకు కేటాయించారన్నారు.తిరుపతి అర్బన్ పరిధిలో 2 సెంట్ల లోపు ప్లాట్లు ఉన్నవారు ఇల్లు కట్టుకోలేని పరిస్థితిని గమనించి, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు వెంటనే స్పందించి 900 మందికి పైగా లబ్ధిదారులకు 2 సెంట్ల ప్లాట్లు ఇచ్చేలా ఆదేశాలు జారీ చేశారని గుర్తు చేశారు.ఏప్రిల్ నెలాఖరులోపు రిజిస్ట్రేషన్ చేస్తామన్న మాట ప్రకారం, గడువు కంటే 20 రోజుల ముందే ప్రక్రియను ప్రారంభించామన్నారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా తిరుపతి అర్బన్, రూరల్ మరియు రేణిగుంట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఉదయం 8:30 నుండి 10:30 గంటల వరకు ప్రత్యేకంగా రిజిస్ట్రేషన్లు నిర్వహిస్తున్నామన్నారు.రిజిస్ట్రేషన్ ఫీజుల భారం లక్షల్లో ఉండటంతో పేద రైతులు ఇబ్బంది పడుతున్న విషయాన్ని నారా లోకేష్ గారు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని తెలిపారు.సుమారు 16 కోట్ల రూపాయల రిజిస్ట్రేషన్ ఫీజును ప్రభుత్వమే భరించి, రైతులకు మరియు ప్లాట్ దారులకు ఉచితంగా రిజిస్ట్రేషన్ చేయించాలని ప్రభుత్వం నిర్ణయించిందని అన్నారు.ప్లాట్ యజమానులు చనిపోయి ఉంటే, వారి వారసులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా డెత్ సర్టిఫికేట్ మరియు ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికేట్ ఆధారంగా ప్లాట్లు బదిలీ చేస్తున్నామని తెలిపారు.శెట్టిపల్లిని ఒక అద్భుతమైన శాటిలైట్ టౌన్ షిప్ గా తీర్చిదిద్దేందుకు తుడా కట్టుబడి ఉందని ఛైర్మన్ తెలిపారు.ఇందులో భాగంగా రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్ మరియు నీటి సౌకర్యం,చిల్డ్రన్ పార్కులు, అవెన్యూ ప్లాంటేషన్ చేపడతామని తెలిపారు.మంగళం నుండి రేణిగుంట వరకు 150 అడుగుల రోడ్డు 2.9 కి.మీ పనులు ప్రారంభమయ్యాయి. అలాగే 80 అడుగులు, 100 అడుగులు మరియు 60 అడుగుల మూడు మాస్టర్ ప్లాన్ రోడ్ల పనులు త్వరలో ప్రారంభం కానున్నాయని అన్నారు.ఈ కార్యక్రమంలో తుడా సెక్రటరీ డా యన్ వి శ్రీకాంత్ బాబు భూసేకరణ అధికారి సుజన, తుడా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# తిరుచానూరు రైల్వే స్టేషన్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతి

**తిరుపతి, ఏప్రిల్ 10 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తిరుచానూరు రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఉండగానే రైల్వే పోలీసులు గుర్తించారు. సుమారు 35 సంవత్సరాలు వయసు కలిగిన బ్లూ కలర్ షర్టు వేసుకున్న వ్యక్తి రైలు పట్టాలపై పడి మృతి చెంది ఉన్నాడు. రైలు నుంచి ప్రమాదవశాత్తు పడ్డాడా లేదా ఆత్మహత్యకు పాల్పడ్డాడా అన్న విషయం తెలియాల్సి ఉంది. తలకు ముక్కు భాగంలో తీవ్ర రక్త గాయాలు కావడంతో మృతి చెందినట్లు పోలీసులు గుర్తించారు. స్థానికుల సమాచారం మేరకు రైల్వే పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని పంచనామా నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. మృతుడికి సంబంధించి ఎటువంటి సమాచారం ఉన్న తిరుపతి రైల్వే పోలీసులను సంప్రదించాలని వారు కోరారు.

# విన్యాసం.. చేపల వేటకు సాహసం



**శ్రీకాళహస్తి, ఏప్రిల్ 10 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** సువర్ణముఖి నదిలో మత్స్యకారులు ప్రమాదకర విన్యాసాలతో చేపలు పడుతున్నారు. రామసేతు పాత వంతెన గట్టుపై ఇరుకైన ప్రదేశంలో కూర్చొని చేపలు పడుతున్నారు. ఇలాంటి ప్రమాదకర విన్యాసాలకు పాల్పడే మత్స్య కారులను అధికారులు గట్టిగా హెచ్చరించాల్సి ఉంది.

# సూచికల్లేక.. తికమక.. క్యూ లైన్లల్లో భక్తులకు కష్టాలు




**శ్రీకాళహస్తి,ఏప్రిల్ 10 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** శ్రీకాళహస్తీశ్వరుని దర్శనార్థం వచ్చే భక్తులకు నూతనంగా కేంద్రీయ అర్జిత సేవా టికెట్ల సముదాయాలు అందుబాటులోకి తీసుకువచ్చారు. అయితే ప్రస్తుతం కొన్ని కౌంటర్లల్లో నగదు తీసుకుని సేవా టికెట్లు పంపిణీ చేస్తున్నారు. మరి కొన్నింటిలో కేవలం ఆన్ లైన్ చెల్లింపులకే టికెట్లు ఇస్తున్నారు. ఇందుకు సంబంధించి సూచికలు లేకపోవడంతో భక్తులు క్యూలైన్ల పొడవునా నిరీక్షిస్తూ వెళ్లి చివరకు అక్కడ ఆన్ లైన్ మాత్రమే అని చెప్పడం లేదా నగదు చెల్లిస్తేనే టికెట్లు ఇస్తామని చెప్పడంతో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. భక్తులకు కన్పించే విధంగా సూచికలు ఏర్పాటు చేయిస్తే సౌకర్యవంతంగా ఉంటుంది. ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టాలని భక్తులు కోరుతున్నారు.

# రాధాకృష్ణ చేసిన వ్యాఖ్యలకు క్షమాపణ చెప్పాలి

## - వైఎస్ఆర్సిపి నాయకులు డిమాండ్

**సూళ్లూరుపేట,ఏప్రిల్ 10 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రాధాకృష్ణ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ సూళ్లూరుపేటలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు రాధాకృష్ణ క్షమాపణ చేయాలని ఎస్ఐ అజయ్ కుమార్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం మండల అధ్యక్షులు అల్లూరు అనిల్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ సభ్యత సంస్కారంలేని వ్యక్తి అని, జగన్మోహన్ రెడ్డి పార్టీ పెట్టినప్పుడు నుండి జగన్‌పై విషం చిమ్ముతూ అవాస్తవాలను ప్రచురిస్తున్నారని ఆరోపించారు. రాధాకృష్ణ జర్నలిస్ట్ ముసుగులో ఉండి చంద్రబాబు నాయుడుకి రక్షణగా ఉంటూ, తెలుగుదేశం పార్టీ ప్రభుత్వాన్ని, కాపాడుకుంటూ తన ఆర్థిక లాభాలను పెంచుకుంటూ ఉన్నారని అనిల్ రెడ్డి ఆరోపించారు. రాధాకృష్ణను వెంటనే క్షమాపణలు చెప్పాలని సూళ్లూరుపేట వైఎస్ఆర్సిపి నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు కృపాకర్ రెడ్డి, జెట్టి వేణు, అయితే శ్రీధర్, చిలకా యుగంధర్, చిన్ని సత్యనారాయణ, మీజురు రామకృష్ణారెడ్డి, తుపాకుల ప్రసాద్, బందిలి మహేష్, వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## దివ్యాంగులకు మూడు చక్రాల వాహనాల పంపిణీ

**అనంతపురం,ఏప్రిల్ 10 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** అనంతపురం నగరంలోని పార్లమెంట్ సభ్యుల కార్యాలయంలో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ చేతులమీదుగా దివ్యాంగులకు నాలుగు మూడు చక్రాల వాహనాలను పంపిణీ చేశారు. ఎంపీ నిధుల నుంచి వాహనాలను దరఖాస్తు చేసుకున్న నలుగురు దివ్యాంగులకి శుక్రవారం ఎంపీ అంబికా బండి తాళాలు అందజేశారు. షేక్ నబీ సాబ్, హరినాథ్ రెడ్డి, శ్రీకాంత్, శ్రీనాథ్ రెడ్డి దివ్యాంగులు వాహనాలు అందుకున్నారు. షేక్ నబి సాబ్ మాట్లాడుతూ మా ఆర్థిక పరిస్థితిని గమనించి దరఖాస్తు చేసుకున్న వెంటనే వాహనం అందించినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో దివ్యాంగుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు అర్చన, సూపరింటెండెంట్ అనిల్, సిఆర్ఓ నాగమోణి, తదితర ఎంపీ ఆఫీస్ సిబ్బంది, దివ్యాంగుల సంక్షేమ శాఖ సిబ్బంది, ఇతర దివ్యాంగులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ట్రాక్టర్ నగర్‌లో కలెక్టర్ పర్యటన

**అనంతపురం,ఏప్రిల్ 10 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** శింగనమల మండలం ఆకులేడు పరిధిలోగల దక్షిణ క్షేత్ర వ్యవసాయ యంత్రముల శిక్షణ, పరీక్షణ సంస్థ (ట్రాక్టర్ నగర్)ను శుక్రవారం కలెక్టర్ ఓ.ఆనంద్ పరిశీలించారు. ఈ సందర్భంగా సంస్థ మౌలిక సదుపాయాలు, తరగతి గదులు, ప్రయోగశాలలు, వివిధ కట్ -మోడల్స్, డ్రోన్ ప్రయోగశాల, టెస్టింగ్ ల్యాబ్‌లు, ఇంజన్ టెస్ట్ ల్యాబ్‌లు, ప్లాంట్ ప్రొటెక్షన్ టెస్ట్ ల్యాబ్‌లను కలెక్టర్ పరిశీలించారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం గల వ్యవసాయ యంత్రాలు , పరికరాలను సిబ్బంది, సభ్యులు ప్రదర్శించారు. అకడమిక్ ట్రైనింగ్ కోర్సు శిక్షణార్థులతో కలెక్టర్ సంభాషించారు. రైతులతో మాట్లాడి, శిక్షణ పొందుతున్న వారికి , రైతులకు కలెక్టర్ శుభాకాంక్షలు తెలియజేశారు. సంస్థ కార్యకలాపాలు , విజయాల ఎస్ఆర్ఎఫ్ఎమ్టిటిఐ డైరెక్టర్ డాక్టర్ పి.పి.రావు వివరించిన ఆయనను కలెక్టర్ ప్రశంసించారు.

# జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను విజయవంతం చేయాలి



**నాయుడుపేట, ఏప్రిల్ 10 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** సామాజికవేత్త, సమసమాజ స్థాపన కోసం విశేష కృషి చేసిన మహనీయులు జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను విజయవంతం చేయాలని బీసీ సంక్షేమ సంఘం సూళ్లూరుపేట నియోజకవర్గ అధ్యక్షులు జువ్వలపాటి మస్తాన్ కోరారు. శనివారం పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద గల జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద ఆయన జయంతి వేడుకలను వైభవంగా నిర్వహించనున్నట్లు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ పాల్గొని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తారని తెలిపారు. శనివారం జరుగునున్న జ్యోతిరావు పూలే జయంతి వేడుకల్లో నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, బీసీ సంక్షేమ సంఘం నాయకులు, ప్రజలు పార్టీలకతీతంగా పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

# తిరుపతి జిల్లా

# కార్యకర్తల సంక్షేమానికి కృషి చేస్తా

## - కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే పులివర్తి నాని



**రామచంద్రాపురం,ఏప్రిల్ 10 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** కష్టకాలంలో తెలుగుదేశం పార్టీ అభ్యున్నతికి, విజయానికి కృషి చేసిన ప్రతి కార్యకర్త కష్టాలలో పాలుపంచుకుంటానని, వారి సంక్షేమానికి చొరవ చూపుతానని ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. శుక్రవారం మండలంలోని నెత్తకుప్పం గ్రామంలో రాయలచెరువు కట్టపై ఉన్న గ్రామ పంచాయతీల క్లస్టర్, యూనిట్ ఇన్చార్జులు, నాయకులు కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యేకి టిడిపి నాయకులు స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2024 ఎన్నికలలో ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేసి మూడు దశాబ్దాల అనంతరం చంద్రగిరిలో టిడిపి ఎమ్మెల్యేగా నన్ను గెలిపించినందుకు ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేశారు. కలిసికట్టుగా పనిచేద్దాం..... గ్రామాలను అభివృద్ధి చేసుకుందామని పిలుపునిచ్చారు. తెలుగుదేశం పార్టీలో కార్యకర్తలే అధినేతలు... పార్టీకి మూల స్తంభాలని, వారి సంక్షేమానికి పార్టీ పెద్దపీట వేస్తున్నదని తెలిపారు. టిడిపిలో కష్టపడిన ప్రతి కార్యకర్తకు గుర్తింపు వుంటుందన్నారు. అనంతరం పంచాయతీల వారీగా కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేసి కార్యకర్తల సమస్యలు, గ్రామాలలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

# ప్రాణాలను కాపాడడం గొప్ప విషయం

## - జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్



**చిత్తూరు,ఏప్రిల్ 10 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** అన్ని విషయాల కన్నా ప్రాణాలను కాపాడడం గొప్ప విషయమని కలెక్టర్ సుమిత్ కుమార్ స్పష్టం చేశారు. జాతీయ సర్వే డేను శుక్రవారం ఉదయం స్థానిక రెవిన్యూ భవన్ లో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ సర్వేల అసోసియేషన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జాయింట్ కలెక్టర్ రాజేంద్రన్ ప్రారంభించారు. జిల్లా గ్రామీణ సర్వేయర్లు అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో పలువురు సర్వేయర్లు తమ రక్తాన్ని దానం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నెలకు 200 యూనిట్ల రక్తం కొరత ఉందని, పదుల సంఖ్యలో ప్రాణాలను కోల్పోతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో గ్రామీణ సర్వేయర్లు రక్తాన్ని దానం చేయడం గొప్ప విషయమన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు శాఖల అధికారులు, సిబ్బంది సైతం తరచుగా తమ రక్తాన్ని దానం చేయాలన్నారు. అనంతరం కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ను జిల్లా గ్రామీణ సర్వేల అసోసియేషన్ ప్రతినిధులు దుస్సాలువలతో సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణ సర్వేయర్ల అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సోమకుమార్, వినోద్ కుమార్, కోశాధికారి ప్రతాప్ రెడ్డి, ఉపాధ్యక్షులు నరేష్, సంయుక్త కార్యదర్శులు షణ్ముగం, చంద్రశేఖర్, సలహాదారులు ప్రకాష్, ఐటీ కార్యదర్శి యుగంధర్, కార్యనిర్వాహక కార్యదర్శి దేవేంద్రనాయక్, మహిళా విభాగం కార్యదర్శి పరిమళ, సంక్షేమ కార్యదర్శి భవ్య, క్రీడల కార్యదర్శి దీపికతో పాటు పెద్ద ఎత్తున గ్రామీణ సర్వేయర్లు పాల్గొన్నారు.

# విద్యార్థుల ప్రతిభకు వేదికగా 'స్పోర్ట్స్ అండ్ కల్చరల్ డే-2026'

## - అపోలోలో క్రీడా - సాంస్కృతిక మహోత్సవం



**చిత్తూరు, ఏప్రిల్ 10 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మురకంబట్టులోని అపోలో నాలెడ్జ్ సిటీలో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన "స్పోర్ట్స్ అండ్ కల్చరల్ డే--2026" వేడుకలు విద్యార్థుల ఉత్సాహం, ఐక్యత, సృజనాత్మకతకు అద్దంపట్టాయి. క్రీడా పోటీల్లో విజేతల ఆనందం, వేదికపై సాంస్కృతిక ప్రదర్శనల కళాత్మకత కలసి క్యాంపస్‌ను పండుగ వాతావరణంతో నింపాయి. క్రీడలు - కళలు- వినోదం సమ్మేళనంగా సాగిన ఈ వేడుక విద్యార్థుల ప్రతిభకు ప్రతిబింబంగా నిలిచి అందరినీ ఆకట్టుకుంది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వైస్ ఛాన్సలర్ డాక్టర్ హెచ్. వినోద్ భట్ మాట్లాడుతూ, రెండు వారాల పాటు ఏకేసీ క్యాంపస్‌లో జరిగిన క్రీడా పోటీలకు ఇది ముగింపు వేడుక అని తెలిపారు. గెలుపు, ఓటమికంటే పాల్గొనడం ముఖ్యం అని విద్యార్థులకు సూచించారు. క్యాంపస్‌లో విభిన్న కార్యక్రమాలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. ఇంటర్ యూనివర్శిటీ క్రీడల్లో అపోలో విద్యార్థులు మంచి ప్రతిభ చూపుతున్నారని పేర్కొన్నారు.వివిధ క్రీడా విభాగాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్ వంటి పోటీల్లో విజేతలైన వారికి ప్రత్యేక అభినందనలు లభించాయి. సాంప్రదాయ నృత్యాలు, ఆధునిక నృత్యాలు, నాటకాలు, ఫ్యాషన్ షో విద్యార్థుల ప్రతిభను ప్రతిబింబించాయి. సామాజిక సందేశాలతో కూడిన నాటికలు విశేష ఆదరణ పొందాయి. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం. పోతరాజు, అడిషినల్ రిజిస్ట్రార్ అనీల్ కుమార్ ఎస్, ఎఐఎంఎస్ఆర్ డీన్ డాక్టర్ అల్ఫ్రెడ్ జె. అగస్టీన్, యూనిట్ హెడ్ ఎస్. బాలరాజ్, డీన్‌లు ప్రొఫెసర్ కె. భాస్కర్‌రెడ్డి, డాక్టర్ డి. జగదీషన్, డాక్టర్ సెహనా, ఫిజియోథెరపీ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ కిరణ్, కార్యక్రమ చైర్మన్ ప్రొఫెసర్ ఎస్. మురళీకృష్ణ, కో-చైర్‌పర్సన్ డాక్టర్ శ్రావణ దీప్తి, ఫ్యాకల్టీ నిర్వాహకులు డాక్టర్ షాని ఎస్.ఎస్., డాక్టర్ కీర్తన థాంకచన్, అన్వేషా పాల్, వి. డానియెల్, అధ్యాపకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రయాణీకులపై దురుసుగా ప్రవర్తించిన కండక్టర్

**పుంగనూరు, ఏప్రిల్ 10 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** బస్ కండక్టర్ వృద్ధురాలైన ప్రయాణికురాలిని దుర్భాషలాడి, ఇదేమని ప్రశ్నించిన తోటి ప్రయాణికులను కూడా నోటికొచ్చినట్లు మాట్లాడి, దూషించినట్లు ప్రయాణీకులు తెలిపారు. అతనిపై ఎటువంటిచర్యలు తీసుకుంటారో వేచి చూడాలని ప్రజలు చర్చించుకుంటున్నారు వివరాల్లోకి వెడితే... ఈడిగపల్లి సమీపంలో పుంగనూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సులో కండక్టర్ సీట్‌లో ఒక వృద్ధురాలు కూర్చోవడంతో కండక్టర్ తీవ్ర ఆవేశానికి గురై దురుసుగా ప్రవర్తించడంతో బస్సులో ప్రయాణికులు కండక్టర్‌ను అలా మాట్లాడరాదని చెప్పడంతో వారిపై కూడా అసభ్య పదజాలంతో దూషించిన దృశ్యాలు సోషల్ మీడియాలో శుక్రవారం హల్చల్ చేస్తున్నాయి. ప్రయాణికులు చిత్రీకరించిన దృశ్యాలను చూసి కండక్టర్‌పై సంబంధిత అధికారులు ఎటువంటి చర్యలు తీసుకుంటారు వేచి చూడాలని ప్రజలు చర్చించుకుంటున్నారు.

# కొత్తయిండ్లు వాసికి నోయిడ పిహెచ్ డి

**పుంగనూరు , ఏప్రిల్ 10 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పుంగనూరు వాసి కేంద్ర రక్షణ శాఖ రాజ్‌నాథ్ సింగ్ చేతుల మీదుగా పి హెచ్ డి అందుకున్నారు. కొత్త యిండ్లు కు చెందిన ఆర్.శ్రీరాజ్ కుమార్‌కు డిపార్ట్మెంట్ అఫ్ నోయిడ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ ద్వారా పబ్లిక్ హెల్త్ విభాగం లో పి హెచ్ డి ని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్ చేతుల మీదుగా ఢిల్లీ నోయిడా ఇంటర్ నేషనల్ యూనివర్శిటి లో డాక్టరెట్ అందుకొన్నారు. తాను డిపార్ట్మెంట్ అఫ్ పబ్లిక్ హెల్త్ పై పి హెచ్ డి పై రీసర్చ్ చేసినట్లు శ్రీరాజ్ కుమార్ తెలిపారు. ఉద్యోగం చేస్తూనే డిపార్ట్మెంట్ అఫ్ పబ్లిక్ హెల్త్ సైన్స్ పై రెండు డిగ్రీ లు పూర్తి చేసి గ్రేటర్ నోయిడా లో డిపార్ట్మెంట్ అఫ్ నోయిడ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ వారి సూచనలతో ఐదేళ్ళు పి హెచ్ డి పబ్లిక్ హెల్త్ పై పరిశోధనను పూర్తి చేసినట్లు అయన తెలిపారు. ఇరవై సంవత్సరాలుగా ఉత్తర్ ప్రదేశ్ లోని గ్రేటర్ నోయిడా శారదా విశ్వ విద్యాలయంలో యూనివర్సిటీ నర్సింగ్ విభాగం లో డీన్ గా విధులు అయన తెలిపారు.

# కమ్యూనిటీ క్లినిక్‌ను సద్వినియోగం చేసుకోవాలి

## - కలెక్టర్ సుమిత్ కుమార్





**చిత్తూరు,ఏప్రిల్ 10 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** చిత్తూరు నగరపాలక ప్రజలు కమ్యూనిటీ హెల్త్ క్లినిక్‌ను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం పట్టణ పరిధిలోని మిట్టూరులో ప్రభుత్వం, వేలూరు సిఎంసి వైద్యశాల చిత్తూరు క్యాంపస్ సంయుక్త భాగస్వామ్యంలో నిర్మించిన చిత్తూరు కమ్యూనిటీ క్లినిక్ ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ తండ్రి చెన్నకేశవులు, వేలూరు సిఎంసి పాలనా యంత్రాంగం డైరెక్టర్ డాక్టర్ బిజూ జార్జ్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ రాజేష్, తదితరులు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ వైద్య రంగంలో అనేక సవాళ్లను అధిగమించి, ప్రజలందరికీ అందుబాటులో ఉండే ఆరోగ్య సేవలు అందించాలంటే ప్రభుత్వం, వైద్య నిపుణుల మధ్య భాగస్వామ్యం ఎంతో అవసరమన్నారు. వెల్లూరు సిఎంసితో ఈ సంయుక్త ఆస్పత్రి ఆ దిశగా ఒక ముఖ్యమైన " తొలి అడుగు" అని పేర్కొన్నారు. ప్రజలు ఈ ఆస్పత్రిని సద్వినియోగం చేసుకోవాలని నగర తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన ఉద్దేశ్యం గ్రామ స్థాయి లేదా వార్డు స్థాయి హెల్త్ క్లినిక్‌లు సమర్థవంతంగా పనిచేయడ మన్నారు. ఈ కేంద్రాలలో అందుబాటు ధరలో నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించగలిగితే, జిల్లా స్థాయి ఆసుపత్రులు, ఇతర ప్రాంతీయ ఆసుపత్రులపై భారం తగ్గుతుందన్నారు. ఈ దిశగా, సిఎంసి సంస్థతో భాగస్వామ్యం ( పార్ట్నర్‌షిప్ ) ద్వారా ఒక మంచి ఆలోచన కార్యరూపం దాల్చడం జరిగిందన్నారు. ఈ భాగస్వామ్యంలో భాగంగా సిఎంసి బృందం వైద్యులు అవసరమైన మందులను అందుబాటులో ఉంచుతూ, ఇక్కడ ఒక చిన్న క్లినిక్‌ను ఏర్పాటు చేశారన్నారు. దీని ద్వారా నాణ్యమైన ఆరోగ్య సేవలు అందుబాటులోకి వస్తాయని, ఈ భాగస్వామ్యం మూడు నెలల క్రితం ప్రారంభమై, ప్రస్తుతం క్లినిక్‌లో కొంత పునరుద్ధరణ (రినోవేషన్) పనులు పూర్తయ్యాయని పేర్కొన్నారు. ఈ కేంద్రం రాబోయే కాలంలో ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు ఆశిస్తున్నట్లు, ఇకపై వార్డు స్థాయిలో ఆరోగ్య సదుపాయాలు మరింత మెరుగుపడేందుకు మున్సిపల్ కమిషనర్ , హెల్త్ ఆఫీసర్ పర్యవేక్షించాలని సూచించారు. వెల్లూరు సిఎంసి డైరెక్టర్ డాక్టర్ బిజూ జార్జ్ మాట్లాడుతూ ఈ ఆస్పత్రి ప్రారంభం చిత్తూరు పట్టణ ప్రజల ఆరోగ్య అవసరాలను మెరుగ్గా తీర్చడంలో, నాణ్యమైన సేవలు అందించడంలో మైలురాయిగా నిలుస్తుందని తెలిపారు. ఈ ఆస్పత్రి ఓపీడీ సేవలు ఏప్రిల్ 13 నుండి ప్రారంభమవుతాయని, ప్రతి వారం సోమవారం నుండి శుక్రవారం వరకు సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ నాగ శశి భూషణ్ రెడ్డి, జిల్లా ఆస్పత్రుల సమన్వయాధికారి డాక్టర్ పద్మాంజలి దేవి, మున్సిపల్ కమిషనర్ నరసింహప్రసాద్, మున్సిపల్ వైద్యాధికారి డాక్టర్ లోకేష్, చిత్తూరు అసోసియేట్ డైరెక్టర్ డాక్టర్ ఉదయ్ జార్జ్ జకారియా పాల్గొన్నారు.

# నలుగురు దొంగల అరెస్ట్



**పలమనేరు, ఏప్రిల్ 10 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తాళాలు వేసిన ఇళ్లలో దొంగతనాలకు పాల్పడ్డ నలుగురు దొంగలను పోలీసులు అరెస్టు చేశారు. పలమనేరు డి.ఎస్.పి డేగల ప్రభాకర్ వివరాలు మేరకు ... 12 లక్షల విలువగల బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు, 12 పొట్టేళ్లు, రెండు మోటార్ సైకిళ్ళు, పంచలోహ నంది విగ్రహం వంటివి చోరీకి పాల్పడ్డారు. రాజేంద్ర(57) విజయనగర్ చిన్న కోటే 5 క్రాస్ బంగారు పేట టౌన్ కోలార్ జిల్లా, మురుగ (35) గోనుగురు చిత్తూరు జిల్లా, కన్నన్ (51) గిడ్డే గౌడ నా హల్లి గ్రామం దొడ్డి కంబల్లి కేజీఎఫ్ తాలూకా కోలార్ జిల్లా, కర్ణాటక రాష్ట్రం, రాజశేఖర్(29) కోట్ల గురు గ్రామం క్యాంపసముద్రం బందార్లపల్లి రామకుప్పం మండలం కు చెందిన నలుగురు వీకోట మండలం చుట్టుప్రక్కల గ్రామాలలో కొన్ని రోజులుగా దొంగతనాలకు పాల్పడ్డారనే సమాచారంతో వి. కోట సిఐ సోమశేఖర్ రెడ్డి, సిబ్బందిని రెండు టీములుగా విభజించి సాంకేతిక నైపుణ్యం ఆధారంగా సిబ్బందితో కలిసి నాయకనేరి చెక్ పోస్ట్ వద్ద వీకోట - పేర్నం బట్ రోడ్ లో వాహనాలు తనిఖీ చేస్తుండగా టయోటా ఇతిహాస్ కారులో నలుగురు వ్యక్తులు పేర్నంబట్టు వైపుకు వస్తూ పోలీసులను చూసి వెనక్కు వెళ్ళేందుకు ప్రయత్నించగా, వారిని విచారించి కారులో చూడగా బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు, పంచలోహ నంది విగ్రహం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేసి, ముద్దాయిలను రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. ప్రతిభ కనబరిచిన క్రైమ్ సిబ్బందికి రివార్డు కొరకు చిత్తూరు జిల్లా ఎస్పీ తుషార్ దూడే కు సిఫార్సు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పలమనేరు అర్బన్ సీఐ మోహన్ రెడ్డి, వీకోట సీఐ సోమశేఖర్ రెడ్డి, ఎస్.ఐ. షెక్షావలి, క్రైమ్ పార్టీ ఏఎస్ఐ శ్రీనివాసులు, ఎల్లప్ప, శశి, వెంకటరమణ, సతీష్, అస్గర్ తదితరులు పాల్గొన్నారు.

# శాంతిభద్రతల పరిరక్షణలో రాజీ పడొద్దు : ఎస్పీ



**రామకుప్పం, ఏప్రిల్ 10 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రామకుప్పం పోలీస్ స్టేషన్ చిత్తూరు జిల్లా ఎస్పీ తుషార్ దూడి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ నిర్వహణ, సిబ్బంది పని తీరు, విధులు, ముఖ్యమైన కేసుల దర్యాప్తు, స్టేషన్ లో నిర్వహిస్తున్న కేసు డైరీ, విలేజ్ రోస్టర్ , వివిధ క్రైమ్ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు తీసుకున్న చర్యలను సమీక్షించారు. బ్లాక్ స్పాట్స్ వద్ద రోడ్డు ప్రమాదాలు జరుగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు తీసుకున్న చర్యలను సమీక్షించారు. హత్యలు, హత్యాయత్నాలు, క్రైమ్ ఎగైనెస్ట్ ఉమన్, గర్ల్ మిస్సింగ్, ప్రాపర్టీ కేసులు, రోడ్డు ప్రమాదాలు, తదితర కేసుల రికార్డ్స్ పరిశీలించారు. స్కూల్స్ , హోటల్స్, లాడ్జిలల వద్ద నిఘా ఏర్పాటు చేయాలని, ఎక్కువగా విజిబుల్ పోలీసింగ్ చేయాలని, సమర్థవంతమైన నేర నియంత్రణ, నివారణ చర్యలు చేపట్టాలని, రాత్రి , పగల బీట్ల పనితీరును నిరంతర మానిటరింగ్ చేయాలన్నారు. సైబర్ క్రైమ్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు, మహిళలకు చట్టాలపై నిరంతరం అవగాహన కల్పించాలని సూచించారు. పోలీసు అధికారులు తరచుగా గ్రామాలను సందర్శిం చాలని, గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శులతో సమన్వయం చేసుకోవాలని తెలిపారు. గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాలని, సీసీటీవీ కెమెరాల ఏర్పాటుపై గ్రామస్థులను ప్రోత్సహించాలని, స్టేషన్‌లో పెండింగ్‌లో ఉన్న కేసులను, సీజ్ చేసిన వాహనాలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు సూచించారు.కార్యక్రమంలో ఏఎస్పి డా.తరుణ్ పహ్వా, కుప్పం డివైఎస్పి పార్ధసారథి, ఎస్.బి. ఇన్ స్పెక్టర్ మురళీమోహన్, డిసిఆర్బి ఇన్ స్పెక్టర్ మనోహర్, రామకుప్పం ఎస్.ఐ. వెంకట మోహన్, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# వైకాపాను వీడి.. టిడిపిలో చేరిన 25 కుటుంబాలు



**పలమనేరు,ఏప్రిల్ 10 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** వి.కోట మండలం బైరుపల్లిలో వైకాపా పంచాయతీ కన్వీనర్ శంకర్ రెడ్డి తోపాటు 25 కుటుంబాలు వైకాపాను వీడి ఎమ్మెల్యే అమరనాథరెడ్డి సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సిసి రోడ్డు ప్రారంభించిన ఆయన వైకాపా నేతలపై విమర్శలు గుప్పించారు. ఈ కార్యక్రమాలలో జిల్లా పార్టీ అధ్యక్షులు షణ్ముఖ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి సునీల్ చౌదరితో పాటు మండల కూటమి నాయకులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యేను సన్మానించిన ముస్లిం మత పెద్దలు



**పలమనేరు, ఏప్రిల్ 10 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** వీ.కోట మండలంలోని పలు మసీదులకు చెందిన ముస్లిం మత పెద్దలు ఎమ్మెల్యే అమర్నాథ రెడ్డిని శుక్రవారం కలిసి ఘనంగా సన్మానించారు. మండల పర్యటనలో ఎమ్మెల్యేను ముమ్మిడేర్లపల్లిలో కలిసి సన్మానించారు. వీ.కోటలోని కరప్పల్లె కాలనీ -2 నందు మండల పరిధిలోని ఇమామ్ లకు ఇంటి స్థలాలను అడిగిన వెంటనే మంజూరు చేయించిన ఎమ్మెల్యేకు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలియజేశారు. మసీదు నిర్మాణానికి స్థలాన్ని కేటాయించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. త్వరలో మసీదును పూర్తి చేసి ప్రారంభోత్సవానికి ఆహ్వానిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఇమామ్ లు సాధిక్ హజరత్, అఫ్రోజ్, జాఖా, రఫిక్, రియాజ్, అశ్రఫ్ అలీ, మౌలానా అబ్దుల్ కయ్యూమ్ లతోపాటు టిడిపి మైనారిటీ నాయకులు అకమల్, అఖిల్ అహ్మద్, రూహుల్లా, తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు షణ్ముఖ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి సునీల్ చౌదరి, పలమనేర్ ఏఎంసి చైర్మన్ రాజన్న తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే పర్యటనకు బ్రహ్మారథం పట్టిన మహిళలు



**పలమనేరు, ఏప్రిల్ 10 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** వి.కోట మండలంలో "మన ఊరికి - మన ఎమ్మెల్యే" కార్యక్రమం మూడవ రోజు శుక్రవారం అత్యంత ఉత్సాహంగా సాగింది. స్థానిక ఎమ్మెల్యే అమరనాథ్ రెడ్డి పర్యటించిన ప్రతి గ్రామంలోనూ ప్రజలు అపూర్వ స్వాగతం పలికారు. ముఖ్యంగా మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి, ఆయనకు మంగళ హారతులు ఇచ్చి, తిలకం దిద్దారు. ఈ సందర్భంగా ప్రజలతో నేరుగా మమేకమైన ఎమ్మెల్యే, కూటమి ప్రభుత్వ ఆశయాలను వివరించారు. రాష్ట్రంలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ప్రజలు పూర్తి సంతృప్తి వ్యక్తం చేయడం విశేషం. "ప్రజల ముంగిటకే పాలన అందించడమే మన కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. మహిళల ఆదరాభిమా నాలు, ప్రజల ముఖాల్లో కనిపిస్తున్న చిరునవ్వే మా అభివృద్ధికి నిదర్శనమని ఆనందం వ్యక్తం చేశారు. గ్రామాభివృద్ధే తమ ధ్యేయమని ఆయన తెలియజేశారు. కార్యక్రమంలో ఆయన ప్రజా సమస్యలను స్వయంగా తెలుసుకుంటూ తక్షణ పరిష్కార దిశగా అడుగులు వేస్తు, అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన కరపత్రాలను ప్రజలకు పంపిణి చేస్తూ పర్యటన సాగించారు. 3వ రోజు పర్యటనలో ఎమ్మెల్యే చేతుల మీదుగా పలు ప్రారంభోత్సవాలు వి.కోట మండలంలో ఎమ్మెల్యే చేపట్టిన కుంబార్లపల్లి, బైరుపల్లి పంచాయతీల పరిధిలోని గ్రామాలలో పర్యటన జనసంద్రమైంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. కుంబార్లపల్లి పంచాయతీ పరిధిలోని అనంతపురంలో ర్మించిన సీసి రోడ్డును, గెస్తింపల్లెలో, కుంబార్లపల్లిలో నిర్మించిన రోడ్లను ఆయన ప్రారంభించారు. వీ.కోట నుంచి బైరుపల్లి వయా యాదకుంట, పెదరాంపల్లి వరకు నిర్మించిన బీటి రోడ్డును, బైరుపల్లిలో ఏర్పాటు చేసిన సీసి రోడ్డులను ఆయన ప్రారంభించారు. రైతులకు విద్యుత్ అంతరాయం కలగకుండా ఉండేందుకు పాపేపల్లి మిట్ట సబ్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన బ్రేకర్ ను ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే అమర్నాథరెడ్డి సమక్షంలో పలువురు వైకాపాను వీడి శక్రవారం తెలుగుదేశం పార్టీలో చేరారు. కుంభార్ల పల్లె, బాలేంద్ర పల్లిలకు చెందిన బీ.వెంకటరమణ, సురేష్ (వాలంటీర్), శ్రీనివాసులు, వేణుగోపాల్, ఎం.మహమ్మద్ రఫీ, ముబారక్ పీర్ భాషా, గుల్షీర్, ఎల్. మహమ్మద్ రఫీ, తయుబ్, అస్లాం,సురేష్, శివప్ప, పిఆర్ సుబ్రహ్మణ్యం, భాను ప్రకాష్ తదితరులు టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా వారికి ఎమ్మెల్యే పార్టీ కండువాన్ని వేసి సాధరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్, బాలాజీ కో-ఆపరేటివ్ సూపర్ బజార్ అధ్యక్షులు ఆర్వి బాలాజీ టీడీపీ నాయకులు రామచంద్ర నాయుడు, రాంబాబు, రంగనాథ్, ఏ, నారాయణ స్వామి, రాంబాబు, ధీరజ్, శభరీష్ , ఏఆర్ నాగరాజు, జీకే కుమార్, గిరిబాబు, నాగరాజు, దేవరాజు, రాధాకృష్ణ, మణి,సురేష్,రాజ్ కుమార్, విశ్వనాథ్, రమేష్ బాబు, అక్బర్, చాంద్ భాషా,బైరుపల్లి పంచాయతీ నాయకులు సుబ్రహ్మణ్యం, తిప్పచారి లతో పాటు బీజేపీ నాయకులు విజయ్ తదితరులు పాల్గొన్నారు.



# చిత్తూరు జిల్లా

# ఎమ్మెల్యే కార్యాలయంలో వినతుల స్వీకరణ



**చిత్తూరు, ఏప్రిల్ 10 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ కార్యాలయం ప్రజాదర్బార్ లో శుక్రవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక ( పీజీ ఆర్ఎస్ ) కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ప్రజాదర్బార్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గుడిపాల ఎంపీడీవో శిరీష, చిత్తూరు మున్సిపల్ డిఈ రమణ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకుని సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో 19 వినతులు అందాయి. వీటిని సంబంధిత శాఖలకు పంపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్లు తులసీరామ్, వెంకటరమణ, ఏవో వేణు, హౌసింగ్ డీఈ శ్రీధర్, టిడిపి నగర అధ్యక్షుడు నరేష్ చౌదరి, ప్రధాన కార్యదర్శి, పీఏసీఎస్ చైర్మన్ నీరజాక్షులునాయుడు, వెంకటేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

## - ఎంపీపీ సులోచన గుర్రప్ప



**రామకుప్పం, ఏప్రిల్ 10 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ప్రభుత్వం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నేతృత్వంలో ప్రతిష్టాత్మకంగా పేదల అభ్యున్నతి కోసం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేసేలా అధికారులు , ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని రామకుప్పం మండల ప్రజాపరిషత్ అధ్యక్షురాలు శ్రీమతి సులోచన గుర్రప్ప పిలుపునిచ్చారు. శక్రవారం మండలం ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో మండల పరిషత్ సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలువురు ప్రజా ప్రతినిధులు మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల అమలు చేసే బాధ్యత సచివాలయ అధికారుల పై ఉన్నా సిబ్బంది కొరతతో ప్రజలకు వేగవంతంగా అమలు కాలేకపోతున్నామని, క్షేత్రస్థాయి సిబ్బంది ప్రజా ప్రతినిధులకు ప్రభుత్వ కార్యక్రమాలను తెలియజేయడంలో అలసత్వం వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీడీవో మాట్లాడుతూ వేసవిని దృష్టిలో ఉంచుకుని ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారులు హాజరు కావలసి వున్నా, కొంతమంది అధికారులు హాజరై తమ కింద సిబ్బందిని పంపడంపై ప్రజా ప్రతినిధులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మురళీధర్ రెడ్డి, వైస్ ఎంపీపీ వెంకట్రామగౌడ, రెస్కో వైస్ చైర్మన్ జి విశ్వనాథ్, సింగల్ విండోచైర్మన్ మహమ్మద్ రఫీ, మండల విద్యాశాఖ అధికారులు మల్లికార్జున, నారాయణ, ఏపీవో గణేష్ , మండల వ్యవసాయ శాఖ అధికారిని అమృత, ఏఈలు సుబ్బయ్య, హరి ప్రసాద్,వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజలు ఇప్పుడు గుర్తుకు వచ్చారా?

## - మాజీ శాసనసభ్యులు వెంకటే గౌడ్



**వి.కోట, ఏప్రిల్ 10 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మన ఎమ్మెల్యే - మన ఊరికి కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని పంచాయతీలలో శాసనసభ్యులు అమర్నాథ్ రెడ్డి రెండు రోజులుగా విస్తృతంగా పర్యటిస్తున్నారు. ఈ విషయమై శుక్రవారం మాజీ శాసనసభ్యులు వెంకటే గౌడు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ.... ప్రభుత్వం ఏర్పాటైన 22 నెలల తరువాత ఎమ్మెల్యేకు ఇప్పుడు ప్రజలు గుర్తుకొచ్చారా అని ఎద్దేవా చేశారు. గ్రామాలలో ఆర్భాటాలు తప్ప, పేదవారి సమస్యలు పరిష్కరించిన దాఖలాలు లేవని అన్నారు. ఎన్నికల ముందు వాగ్దానం చేసిన ఏ ఒక్క హామీ అయినా అమలు చేశారా అని ప్రశ్నించారు. ప్రతి నెల పెన్షన్లు పంపిణీ చేసి ఫోటోలు అప్లోడ్ చేయడం తప్పించి, నూతనంగా ఒక్క పెన్షన్ మంజూరు చేయలేదన్నారు. గత ప్రభుత్వంలో 15 వేల ఇంటి పట్టాలు, 10 వేల ఇళ్లకు మంజూరు చేయడం జరిగిందని, నూతనంగా ఒక్క ఇల్లు మంజూరు చేయకపోవడం హాస్యాస్పదమని అన్నారు. ఏడగురికి, బోడిగుట్టపల్లి, నాయకనేరి, గ్రామాలలో గత ప్రభుత్వం నిర్మించిన రోడ్లకు సంబంధించిన శిలాఫలకాలను ధ్వంసం చేసి తమ శిలాఫలకాలను నాటడం సమంజసం కాదన్నారు. ప్రోటోకాల్ ప్రకారం కలెక్టర్ పేరును ఎక్కడ శిలాఫలకాలలో కనబరుచుకుండా, పదవీ కాలం ముగిసిన సర్పంచుల పేర్లు అందులో ఉండడం హాస్యాస్పదమ న్నారు. వి.కోట బాలుర పాఠశాల ప్రహరీ చుట్టూ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించేందుకు పూనుకున్నారు. తమ దృష్టికి రావడంతో హై కోర్టును ఆశ్రయించామని అన్నారు, హైకోర్టు మొట్టికాయలు వేయడంతో నిర్మాణ పనులు ఆపుదల చేసినారు. తమ ప్రశ్నలకు సూటిగా సమాధానాలు ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి పి.ఎన్ నాగరాజు, ఎంపీపీ యువరాజ్, వైకాపా శ్రేణులు, తదితరులు పాల్గొన్నారు.

# కోళ్లుపల్లి కేసులో కోర్టుకు హాజరవుతున్న తెదేపా నేతలు



**రామకుప్పం , ఏప్రిల్ 10 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రామకుప్పం మండలం కొంగనపల్లి పంచాయతీ కోళ్లపల్లి గ్రామం వద్ద రెండు సంవత్సరాల క్రితం అప్పటి మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును వైకాపా కార్యకర్తలు రాళ్ల దాడి చేసి అడ్డుకున్నారన్న కోపంతో వైకాపాశ్రేణులపై నిరసన వ్యక్తం చేసిన పలువురు తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులపై నమోదైన కేసుకు ఇటీవల వారం రోజుల నుండి స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు ప్రతిరోజు చిత్తూరు కోర్టుకు హాజరవుతూ వస్తున్నారు. ఈ సందర్భంగా స్థానిక మీడియాను ఉద్దేశించి మాజీ ఎమ్మెల్సీ, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి, మాజీ టీటీడీ బోర్డు మెంబర్, గౌని వారి శ్రీనివాసులు, చంద్రబాబు నాయుడు కార్యదర్శి తమపై కేసులు నమోదు చేశారని తుదకు సత్యమే గెలుస్తుందన్న విషయం త్వరలోనే గౌరవ కోర్టు ద్వారా నిర్ణయించడం జరుగుతుందన్నారు. టీటీడీ పాలక మండలి సభ్యులు వైద్యం శాంతారామ్, కడ అడ్వైసింగ్ కమిటీ మెంబర్ రాజ్ కుమార్, శాంతిపురం మండల పార్టీ అధ్యక్షుడు నందిగమ్ ఉదయ్ కుమార్, మాజీ అధ్యక్షుడు విశ్వనాథ్ నాయుడు, మాజీ సర్పంచ్ జయశంకర్, బీసీ సెల్ అధ్యక్షుడు వేలు, కో క్లస్టర్ శంకర్ చలం, శాంతిపురం మండల మాజీ ప్రధాన కార్యదర్శి నాగరాజు, ఆర్ఎస్ మణి, రెస్కో డైరెక్టర్ విజయ్ కుమార్, వెంకటేష్, తదితరులున్నారు.

# పార్టీ కోసం నిరంతరం శ్రమిస్తా



**పలమనేరు ,ఏప్రిల్ 10 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** జనసేన పార్టీ కోసం నింతరం కృషి చేస్తానని డాక్టర్ ఆకుల గజేంద్ర ప్రసాద్ తెలిపారు. ఎమ్మెల్సీ నాగబాబు సమక్షంలో పార్టీలో చేరిన ఆయన కుటుంబ సమేతంగా కాశి త్రివేణి సంగమం అయోధ్య యాత్రలో విజయవంతంగా ముగించుకొని స్వస్థలమైన పలమనేరుకు రావడం జరిగింది. తాను జనసేన పార్టీ కోసం నిరంతరం శ్రమిస్తానని ఈ సందర్భంగా ఆయన విలేకరుల సమావేశంలో తెలిపారు.

# బూత్ కమిటీ ప్రధాన కార్యదర్శిగా సాదిక్ అహ్మద్



**వాల్మీకిపురం,ఏప్రిల్ 10 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** వాయల్పాడు పట్టణానికి చెందిన వి.ఏ. సాదిక్ అహ్మద్‌ను అన్నమయ్య జిల్లా బూత్ కమిటీ ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ వైఎస్సార్సీపీ కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి అధికారిక ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ నియామకం పార్టీ అంతర్గత వ్యవస్థలో కీలకమైనదిగా భావించబడుతోంది. ఈ సందర్భంగా సాదిక్ అహ్మద్ మాట్లాడుతూ, ఈ బాధ్యత తనకు అప్పగించడం గౌరవంగా భావిస్తున్నానని తెలిపారు. పార్టీ బలోపేతం, ముఖ్యంగా బూత్ స్థాయిలో కార్యాచరణను సమర్థవంతంగా అమలు చేయడంలో తాను కృషి చేస్తానన్నారు. గ్రామ స్థాయి నుంచి పార్టీ కార్యకలాపాలను బలపరచడం, కార్యకర్తలతో సమన్వయం పెంపొందించడం తన ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. వైఎస్సార్సీపీ రాష్ట్ర అధ్యక్షులు , మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ పదవి లభించిందని, వారి నాయకత్వం తనకు ప్రేరణగా నిలుస్తుందని తెలిపారు. పీలేరు మాజీ శాసనసభ్యులు చింతల రామచంద్ర రెడ్డి ఆశీస్సులు, మార్గదర్శకం తనకు ఎల్లప్పుడూ తోడ్పాటుగా ఉన్నాయని చెప్పారు. పీలేరు యువ నాయకులు చింతల సాయి కృష్ణ రెడ్డి సహకారం వల్లే ఈ స్థాయికి చేరుకున్నానని కృతజ్ఞతలు తెలియజేశారు. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కృషి చేస్తానని, రాబోయే రోజుల్లో పార్టీ విజయానికి తన వంతు కృషి చేస్తానని ఆయన తెలిపారు.

# మొదటి స్థానంలో ములకలచెరువు టమోటా మార్కెట్

## - ఉత్తమ ఉద్యోగులకు షీల్డ్ బహుకరణ



**ములకలచెరువు, ఏప్రిల్ 10 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** అన్నమయ్య జిల్లాలోని టమోటా మార్కెట్లలోఅత్యధికంగా ములకలచెరువు టమోటా మార్కెట్‌కు ఆదాయం వచ్చింది. జిల్లాలో ఆదాయంలో మొదటి స్థానం దక్కింది. ఏడాదికి మార్కెట్ ఆదాయం రూ. 1.40 కోట్ల ఆదాయం చేయాలని టార్గెట్ ఉండగా, ఏడాదికి రూ.1. 56 కోట్ల రూపాయలు ఆదాయం ములకలచెరువు టమోటా మార్కెట్ కు వచ్చింది. ఈ విషయంపై మార్కెట్ కమిటీ జెడి రామాంజనేయులు ఏడియం త్యాగరాజులు టమోటా మార్కెట్ సిబ్బందిని అభినందించారు. ఈ మేరకు ఆదాయంలో మొదటి స్థానంలో నిలిపిన ఉద్యోగులకు మార్కెట్ కమిటీ కార్యదర్శి నవీన్ కుమార్ రెడ్డి శుక్రవారం మార్కెట్ కార్యాలయంలో సూపర్వైజర్ బాలాజీ, ఎల్డిసి అరవింద్, సిబ్బంది రాజు, రహీం, సునీల్ బాషా, రెడ్డి భాష, ప్రకాష్ గుప్తాలకు షీల్డ్లను అందజేసి అభినందించారు.

# జిల్లా నూతన రిజర్వ్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతల స్వీకరణ

## - ఎస్పీని కలిసిన నూతన అధికారి



**మదనపల్లె, ఏప్రిల్ 10 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** అన్నమయ్య జిల్లా లో నూతన రిజర్వ్ ఇన్ స్పెక్టర్‌గా ఎం. రవికుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన మదనపల్లె లోని జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఎస్పీ. ధీరజ్ కునుబిల్లిని కలిశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ నూతన రిజర్వ్ ఇన్‌స్పెక్టర్‌ను అభినందించారు. ప్రజల రక్షణ కోసం నిరంతరం అప్రమత్తంగా ఉంటూ, పోలీసు శాఖ ప్రతిష్టను పెంచేలా కృషి చేయాలని ఆదేశించారు.

# మిట్స్ వర్సిటీలో వ్యక్తిగత బ్రాండింగ్ లింక్డ్ ఇన్ బ్లూప్రింట్ అంశంపై అతిథి ఉపన్యాసం

## - లింక్డ్ ఇన్ విద్య, ఉద్యోగ అభివృద్ధికి సహాయపడే సాధనం

## - ముఖ్య అతిథి కృష్ణారెడ్డి



**మదనపల్లె/ కురబలకోట, ఏప్రిల్ 10 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మిట్స్ డీమ్డ్ టు బి యూనివర్సిటీలో ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో "డిజిటల్ యుగంలో వ్యక్తిగత బ్రాండింగ్ లింక్డ్ ఇన్ బ్లూప్రింట్" అనే అంశంపై విద్యార్థులకు అతిథి ఉపన్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఐ.టి సంస్థ లింక్డ్ఇన్, రీజినల్ హెడ్ కృష్ణారెడ్డి చింత పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లింక్డ్ఇన్ ఇంజినీరింగ్ విద్యార్థులకు ఎంతో ముఖ్యమైన విద్య, ఉద్యోగ అభివృద్ధికి సహాయపడే సాధనంగా మారిందన్నారు. ఇది కేవలం ఒక సోషల్ మీడియా ప్లాట్ ఫారమ్ మాత్రమే కాకుండా, ప్రొఫెషనల్ ప్రపంచానికి గేట్‌వేలా పనిచేస్తుందని పేర్కొన్నారు. విద్యార్థులు తమ స్కిల్స్, ప్రాజెక్ట్స్, ఇంటర్న్‌షిప్స్, సర్టిఫికేషన్స్‌ను వ్యక్తిగత వివరాలలో చూపిస్తూ ఒక బలమైన డిజిటల్ రెజ్యూమ్‌ను తయారు చేసు కోవచ్చు. అలాగే ఇండస్ట్రీ ప్రొఫెషనల్స్, అల్యూమిని, రిక్రూటర్స్‌తో కనెక్ట్ అవుతూ మంచి నెట్‌వర్క్‌ను నిర్మించు కోవచ్చని తెలిపారు. లింక్డ్ఇన్ లెర్నింగ్ వంటి ఫీచర్ల ద్వారా కొత్త టెక్నాలజీలు, సాఫ్ట్ స్కిల్స్ నేర్చుకోవచ్చు. ఇది రిక్రూటర్స్ దృష్టిని ఆకర్షిస్తుందని సూచించారు. ఇండస్ట్రీ ట్రెండ్స్, కంపెనీల అప్డేట్స్ తెలుసుకోవడం ద్వారా కెరీర్ ప్లానింగ్‌కు ఉపయోగ పడుతుంది. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ డి.ప్రదీప్ కుమార్, అసోసియేట్ డీన్-ట్రైనింగ్ అండ్ స్కిల్ డెవలప్మెంట్ డాక్టర్ వి.జయ ప్రకాషన్, సీనియర్ మేనేజర్-స్టూడెంట్ అఫైర్స్ డాక్టర్ పి.అథాహర్ సమీనా, కోఆర్డినేటర్స్ జె.టి ద్రుపద్ వర్మ, షైక్ టిప్పు రెహమాన్, విద్యార్థులు పాల్గొన్నారు.

# గిరిజన మహిళపై దాడిని ఖండించిన నాయకులు

## - కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన - జాయింట్ కలెక్టర్‌కు వినతి



**మదనపల్లె, ఏప్రిల్ 10 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** గిరిజన మహిళ భుక్యా మునెమ్మ పై జరిగిన దాడిని గిరిజన సంఘాలు నాయకులు తీవ్రంగా ఖండించారు. ఈ విషయం పై శుక్రవారం అన్నమయ్య జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపి, జాయింట్ కలెక్టర్ కు ఫిర్యాదు చేసి, వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజన మహిళ భూమి విషయం లో రెవెన్యూ రికార్డులను పరిశీలించి ఆమె కు న్యాయం చేయాలని కోరారు. మహిళ అని చూడకుండా దాడి చేసిన వారిపై చట్ట పరంగా చర్యలు తీసుకొని, ఆమెకు భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. తమ విజ్ఞప్తి పైన జాయింట్ కలెక్టర్ సానుకూలంగా స్పందించారని, తగు విచారణ జరిపి ఆమెకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమం లో ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం అన్నమయ్య జిల్లా అధ్యక్షులు భుక్యా నాగు నాయక్, అఖిల భారత బంజారా సేవా సంఘం అన్నమయ్య జిల్లా అధ్యక్షులు పాల్త్య అమరేంద్ర నాయక్, గిరిజన విద్యార్థి సంఘం అన్నమయ్య జిల్లా అధ్యక్షులు బాణావత్ రఘునాయక్, గిరిజన సంఘం నాయకులు భుక్యా శంకర నాయక్, భుక్యా కృష్ణ గోపాల్ నాయక్, మీసేవ నాగరాజు నాయక్, బాణావతి కుమార్ నాయక్, బాణావత్ చంద్రశేఖర్ నాయక్, బాణావత్ శంకర్ నాయక్, భూక్య మునీంద్రా నాయక్, భుక్య దినకర్ నాయక్, మహిళా నేతలు పాల్గొన్నారు.

# పంచాయతీ కార్మికులు పోరాటానికి సిద్ధం కావాలి

## - అన్నమయ్య జిల్లా మహాసభ పిలుపు

**మదనపల్లె, ఏప్రిల్ 10 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** గ్రామ పంచాయతీ కార్మికులు గ్రామాలలో వెట్టి చేస్తున్నారని, హక్కులను సాధించుకు నేందుకు పోరాటాలకు సిద్ధం కావాలని ఏపీ గ్రామపంచాయతీ కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు డి.వెంకట్రామయ్య, సిఐటియు జిల్లా కోశాధికారి టి. హరిశర్మ లు పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణం లోని ఎన్.జీ.ఓ. హోం లో గ్రామ పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ అన్నమయ్య జిల్లా రెండవ మహాసభ హరిప్రసాద్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన వెంకట్రామయ్య, హరిశర్మ మాట్లాడుతూ ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో పంచాయతీ కార్మికులకు నిధులు ఇవ్వకపోవడం దుర్మార్గమన్నారు. గ్రామ పంచాయతీల్లో పనిచేసే కార్మికులందరికీ రాష్ట్రవ్యాప్తంగా ఒకే వేతనం ఇవ్వాలన్నారు. పంచాయతీలతో సంబంధం లేకుండా ప్రభుత్వమే జీతాలు చెల్లించాలన్నారు. మున్సిపల్ కార్మికులకు ఇస్తున్న తరహాలో రూ.21 వేల వేతనం పంచాయతీ కార్మికులకూ ఇవ్వాలన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలన్నారు. అంత్యక్రియలకు రూ. 20వేలు చెల్లించాలని కోరారు. పనిముట్లు, బట్టలు, కొబ్బరి నూనె, సబ్బులు, ఇప్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై సంబంధిత శాఖా మంత్రి పవన్ కళ్యాణ్ స్పందించి పరిష్కార చర్యలు చేపట్టాలని కోరారు. సమస్యలపై స్పందించకుంటే పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. జిల్లా కార్యదర్శి ఎస్. సురేంద్రబాబు గత మూడు సంవత్సరాలనుండి సంఘం చేపట్టిన కార్యకలాపాలు, నిర్మాణ నివేదికను ప్రవేశపెట్టారు. కార్యక్రమంలో జిల్లాలోని పంచాయతీ కార్మికులు, గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు.

**నూతన జిల్లా కమిటీ ఏకగ్రీవం**

ఏపీ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ అన్నమయ్య జిల్లా నూతన కమిటీ ని ఏకగ్రీవంగా మహాసభ ఎన్నుకున్నది. అధ్యక్షులు గా బీ.వి.రమణ (పీలేరు), ప్రధాన కార్యదర్శి గా ఎస్.సురేంద్రబాబు (పిటియం), కోశాధికారి గా విజయకుమార్ (కలకడ), వర్కింగ్ ప్రసిడెంట్ గా డి. గోపాల్ ( మదనపల్లె ), వీరితో పాటు మరో ఆరు మంది ఆఫీస్ బేరర్లు, 11మంది కమిటీ సభ్యులను మహాసభ ఎన్నుకున్నది.

# తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోండి

## - అధికారులకు ఎమ్మెల్యే ఆదేశం



**మదనపల్లె, ఏప్రిల్ 10 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** వేసవిని దృష్టిలో పెట్టుకొని పట్టణంలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపట్టాలని మున్సిపల్ అధికారులను ఎమ్మెల్యే షాజహాన్ బాషా ఆదేశించారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ ప్రమీలతో కలిసి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణంలో నెలకొన్న సమస్యలను గుర్తించి పరిష్కరించాలని సూచించారు. కౌన్సిలర్ల పదవీ కాలం ముగియడంతో ఆయా అవార్డుల పరిధిలోని తెలుగుదేశం పార్టీ నాయకులతో సచివాలయ సిబ్బంది సమన్వయం చేసుకొని అభివృద్ధి పనులను వేగవంతం చేయాలన్నారు. డ్రైనేజీ వ్యవస్థ, వీధిలైట్లు, పరిసరాల పరిశుభ్రత తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించడం జరిగిందన్నారు. రామారావు కాలనీ, గజ్జలకుంట, సొసైటీ కాలనీ మరికొన్ని ప్రాంతాల్లో నీటి సమస్య పరిష్కరించాలని సూచించారు. పట్టణంలో మూడు రోజులకోసారి నీటిని సరఫరా చేపట్టి, ప్రజల కష్టాలను తీరుస్తామన్నారు. వైసిపి పాలకులు కౌన్సిల్ హాల్, ఇతర గదుల మరమ్మతులను గాలికొదిలేశారని విమర్శించారు. ప్రత్యేక అధికారి పాలనలో మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ సమావేశంలో పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

# పిల్లల ఆరోగ్యమే భవిష్యత్తుకు బలం

## - కలెక్టర్ నిశాంత్ కుమార్



**మదనపల్లె, ఏప్రిల్ 10 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** జిల్లాలో 8వ పోషణ పక్వాడ కార్యక్రమాల ద్వారా ఈ నెల 23 వరకు అంగన్వాడీ కేంద్రాలు, పంచాయితీలు , గ్రామ స్థాయిలో పౌష్టికాహారం లోపంపై విస్తృతంగా అవగాహన కల్పించాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ సంబంధిత అధికారులు ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్లో... ఐసిడిఎస్ శాఖ ఆధ్వర్యంలో పోషణ పక్వాడ ప్రచార పోస్టర్లను అధికారులతో కలిసి కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తల్లిదండ్రులు, గర్భిణీలు , బాలింతల్లో పోషకాహారంపై అవగాహన పెంచాలన్నారు. రెండు సంవత్సరాల లోపు పిల్లలకు 1000 రోజుల కాలం అత్యంత కీలకమని, ఈ దశలోనే మెదడు అభివృద్ధిలో 80 శాతం పూర్తవుతుందని కలెక్టర్ తెలిపారు. ఈ సమయంలో సరైన పోషకాహారం, సంరక్షణ చాలా అవసరమని స్పష్టం చేశారు. పౌష్టికాహారం లోపం వల్ల పిల్లల ఎదుగుదలపై ప్రతికూల ప్రభావం పడుతుందని, ఊబకాయం, మధుమేహం, ఏకాగ్రత లోపం వంటి సమస్యలు పెరుగుతున్నాయని తెలిపారు.

**జంక్ ఫుడ్, అధిక ఉప్పు-నూనె ప్రమాదకరం**

జంక్ ఫుడ్ వినియోగం, మితిమీరిన ఉప్పు , నూనె ఆరోగ్యానికి హానికరమని, ఇవి భవిష్యత్తులో అనేక రకాల వ్యాధులకు దారి తీస్తాయని తెలిపారు. రెండు సంవత్సరాల లోపు పిల్లలకు మొబైల్ స్క్రీన్ వినియోగం వల్ల మానసిక, శారీరక సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని, స్క్రీన్ టైమ్ తగ్గించి ఆటలు, కుటుంబ అనుబంధాలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో డీడబ్ల్యూసీడబ్ల్యూ అండ్ ఈఓ కె. హైమావతి, పోషణ అభియాన్ జిల్లా కోఆర్డినేటర్, డిస్ట్రిక్ట్ ప్రాజెక్ట్ అసిస్టెంట్, డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్, సీడీపీఓలు తదితరులు పాల్గొన్నారు.

# గుండెపోటుతో పాత్రికేయుడు గంగాధర్ మృతి

## - నివాళులర్పించిన కాంగ్రెస్ నాయకులు ఎస్.రెడ్డి సాహెబ్



**మదనపల్లె, ఏప్రిల్ 10 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** అన్నమయ్య జిల్లా కేంద్రమైన మదనపల్లె పట్టణంలో పాత్రికేయుడిగా పనిచేస్తున్న గంగాధర్ గురువారం గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలిసిన వెంటనే గంగాధర్ పార్థివదేహానికి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రెడ్డి సాహెబ్ నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా రెడ్డీ సాహెబ్ మాట్లాడుతూ పాత్రికేయ వృత్తిలో అందరికీ సుపరిచితుడుగా గుర్తింపు పొందిన గంగాధర్ ఆకస్మిక మృతి దురదృష్టకరమన్నారు. గంగాధర కుటుంబానికి అధికారులు, ప్రభుత్వం అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు.



# అన్నమయ్య జిల్లా

# పీలేరు శ్రీ చైతన్య విద్యార్థుల ప్రతిభకు జాతీయ స్థాయిలో గుర్తింపు



**కలికిరి,ఏప్రిల్ 10 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** జాతీయ స్థాయి ఇంటర్నేషనల్ టాలెంట్ సర్చ్ ఒలంపియాడ్ పరీక్షల్లో పీలేరు శ్రీ చైతన్య విద్యాసంస్థల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారు. ఈ పరీక్షల్లో శ్రీ చైతన్య రెండు బ్రాంచ్ లకు చెందిన 350 మంది విద్యార్థులు పాల్గొని గణనీయ సంఖ్యలో గోల్డ్ మెడల్స్, ప్రతిభా పురస్కారాలు సాధించారు. ముఖ్యంగా కొంతమంది విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ర్యాంకులు సాధించి ల్యాప్‌టాప్‌లు, స్మార్ట్‌వాచీలు, గోల్డ్ మెడల్స్, కన్సోలేషన్ బహుమతులు అందుకున్నారు. ఈ బహుమతులను ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి చేతుల మీదుగా కలికిరి మండలం నగిరిపల్లిలోని ఆయన స్వగృహంలో విద్యార్థులకు ప్రదానం చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు పట్టుదలతో చదివితే జాతీయ స్థాయిలో మెరుగైన ఫలితాలు సాధించగలరని, ఈ విజయాలు అందుకు నిదర్శనమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏజీఎం సురేష్, ఆర్.ఐ శ్రీధర్, కోఆర్డినేటర్ రవికుమార్, ప్రిన్సిపల్స్ సుమన్ గౌడ్, ప్రతాప్ రెడ్డి, డీన్ జానకిరామ్, ప్రైమరీ ఇన్‌చార్జ్‌లు అనూష, సునంద, పీలేరు 'షీ' విద్యాలయ నిర్వాహకులు డాక్టర్ పి.వి.ఎస్ లక్ష్మి, డాక్టర్ రాయల సుధాకర్ రాయలు పాల్గొన్నారు.

# డా. పి.వి.ఎస్. లక్ష్మికి 'ఉమెన్ హెల్త్ ఐకాన్ అవార్డు'



**కలికిరి, ఏప్రిల్ 10 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి చేతుల మీదుగా ప్రముఖ యోగా థెరపిస్ట్ డా. పి.వి.ఎస్. లక్ష్మికి 'ఉమెన్ హెల్త్ ఐకాన్ అవార్డు' ప్రదానం చేయడం జరిగింది. కలికిరి మండలం నగిరిపల్లిలోని ఎమ్మెల్యే స్వగృహంలో జరిగిన ఈ కార్యక్రమం ఘనంగా జరిగింది. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని అంతర్జాతీయ న్యాచురోపతి ఆర్గనైజేషన్ ప్రకటించిన ఈ అవార్డును ఎమ్మెల్యే చేతుల మీదుగా అందుకోవడం ఆనందకరమైన విషయమని డా. పివిఎస్ లక్ష్మి తెలిపారు. 25 సంవత్సరాలుగా యోగా రంగంలో విశేష సేవలు అందిస్తూ మహిళల శారీరక, మానసిక ఆరోగ్యానికి కృషి చేస్తున్నారు. యోగా ద్వారా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం సాధ్యమని విశ్వసిస్తూ, గ్రామీణ ప్రాంతాల్లో కూడా ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా 'షీ' సంస్థ న్యాయ సలహాదారులు డాక్టర్ రాయల సుధాకర్ రాయలు మాట్లాడుతూ, మహిళల ఆరోగ్యాభివృద్ధి కోసం డా. లక్ష్మి చేస్తున్న సేవలు ప్రశంసనీయ మన్నారు. ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ నిర్మాణానికి తమ వంతు కృషి కొనసాగుతుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, స్థానిక నాయకులు, సంస్థ ప్రతినిధులు పాల్గొని డా. లక్ష్మిని అభినందించారు.

# అధిక ఎండలకు పానీయం పరమౌషధం

## - డా:చంద్రశేఖర్ నాయక్

**పీలేరు, ఏప్రిల్ 10 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** వడదెబ్బ ప్రమాదకరం, ప్రాణాంతకమని పి. హెచ్.సి తలుపుల వైద్యాధికారులు డా:చంద్రశేఖర్ నాయక్ తెలిపారు. పీలేరు సమీప ఇమ్మనియల్ నగర్ లో ఇటుక బట్టీల వద్ద దినసరి కూలీలకు "వడదెబ్బ - ప్రాణాంతకం" అంశంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.అధిక పగటి ఉష్ణోగ్రతలకు తోడు ఉక్కపోత నుండి తమను తాము రక్షించుకొనుటలో భాగంగా ఆరోగ్య సూత్రాలు పాటించాలని, ఎండలో, అధిక శ్రమతో పనిచేసే క్రమంలో , తలకు టోపి, రుమాలు లాంటివి చుట్టుకొని, తగిన నీరు తాగుతూ ఉండాలని, మత్తు పానీయాలు, మసాలాలు జోలికి వెళ్లకుండా జాగ్రత్త వహించాలని లేనిచో తల నొప్పి, వికారం, వాంతులు, జ్వరం, తల తిరగడం, అపస్మారకస్థితి మొదలగు లక్షణాల వడదెబ్బగా భావించి, నివారణ చర్యల్లో భాగంగా తక్షణం ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచిత చికిత్స పొందాలని తెలిపారు. తర్వాత డిప్యూటి హెచ్ఇఓ కొండయ్య , ఓ.ఆర్.యస్ ద్రావణం తయారు ఎలాగో, వడదెబ్బకు ఓఆర్ యస్ సహకరించే విధానం, కూలీలకు వివరించి, అవసరమైన వారికి ఏ యన్ యం లు మాత్రలు, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ హెచ్ఇఓ కొండయ్య, ఏయన్ యం అరుణ, నూర్జహాన్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# విలువలతో కూడిన విద్యను అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం : నల్లారి




**కలికిరి, ఏప్రిల్ 10 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందించడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పాఠశాలల్లో అత్యాధునిక డిజిటల్ సౌకర్యాలు, నో బ్యాగ్ డే, పారదర్శక ఉపాధ్యాయ బదిలీలు, ఉన్నత విద్యలో పరిశోధనలకు కీలక నిర్ణయాలు తీసుకొని సమూల మార్పులు తెచ్చారని, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి పీలేరు నియోజకవర్గ శాసన సభ్యులు నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి సూచించారు. అన్నమయ్య జిల్లా కలికిరి పట్టణంలోని శ్రీనివాస జూనియర్ డిగ్రీ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ (ఏపీ ఎస్ ఎస్ డి సి) నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆధ్వర్యంలో యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు 10 కంపెనీలకు పైగా పాల్గొన్నాయి. 500 కు పైగా ఉద్యోగ ఖాళీలు అందుబాటులో ఉన్నాయని జాబ్ మేళా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పీలేరు ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10వ తరగతి ఇంటర్ ఐటిఐ డిప్లమా డిగ్రీ , ఇతర అర్హత కలిగిన నిరుద్యోగలకు జాబ్ మేళా అవకాశం శుభ పరిణామమని అన్నారు. విద్యార్హత సాధించిన నిరుద్యోగ యువతీ యువకులు జాబ్ మేళా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాల్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు శ్రద్ధతో మెరుగైన విద్యను అందించి విద్యార్థులకు ఉన్నత శిఖరాలను చేరేలా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# క్యాంపస్ డ్రైవ్‌లో 33 మంది ఎంపిక



**పీలేరు, ఏప్రిల్ 10 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** స్థానిక సిఎన్ఆర్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలో ఫస్ట్ సోర్స్ ప్రైవేట్ లిమిటెడ్, బెంగళూరు సంస్థ ఆధ్వర్యంలో క్యాంపస్ నియామక కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు రెండు దశల్లో ఇంటర్వ్యూలు నిర్వహించారు. మొదటి దశలో హెచ్ఆర్ మేనేజర్ అరుల్ , గ్రూప్ డిస్కషన్ నిర్వహించగా, రెండవ దశలో ఆప్టిట్యూడ్ పరీక్షను నిర్వహించారు. ఇంటర్వ్యూలలో 33 మంది విద్యార్థులు షార్ట్‌లిస్ట్ అయ్యారు. ఎంపికైన విద్యార్థులకు వార్షికంగా రూ. 2.44 లక్షల నుండి రూ. 3.10 లక్షల వరకు వేతనం అందించనున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలేజీ కరస్పాండెంట్ విజయ భాస్కర్ రెడ్డి, ప్రిన్సిపాల్ డా. డి. లావణ్య మరియు అధ్యాపకులు పాల్గొని ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

# చందర్లపాడు మండలం లక్ష్మీపురం గ్రామసభలో గంజాయి దుష్ప్రభావాలపై అవగాహన...



**చందర్లపాడు ఏప్రిల్ 10( నేటి మనదేశమ్ ప్రతినిధి)** :డ్రగ్స్ నిర్మూలన లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన "డ్రగ్స్‌పై దండయాత్ర--2.0" కార్యక్రమంలో భాగంగా గురువారం (09-04-2026) చందర్లపాడు మండలంలో పోలీసులు విస్తృత చర్యలు చేపట్టారు. గుడిమెట్ల గ్రామపంచాయతీ పరిధిలోని లక్ష్మీపురం గ్రామంలో మిర్చి పొలాల్లో గంజాయి సాగు జరుగుతుందనే అనుమానాలపై ప్రత్యేక కూంబింగ్ నిర్వహించారు. పొలాలన్నీ సవివరంగా తనిఖీ చేసిన అనంతరం, గ్రామంలో ప్రజలతో కలిసి గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు గంజాయి వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలను గ్రామస్థులకు వివరించారు. ఆరోగ్యపరమైన నష్టాలతో పాటు కుటుంబ వ్యవస్థలు దెబ్బతింటాయని, యువత భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందని హెచ్చరించారు. గంజాయి సాగు, రవాణా, సరఫరా వంటి అక్రమ కార్యకలాపాల్లో పాల్గొనేవారిపై కఠిన చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. గ్రామంలో ఎవరికైనా గంజాయి సంబంధిత సమాచారం తెలిసినట్లయితే 1930 లేదా 1972 టోల్‌ఫ్రీ నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు. సమాచారం ఇచ్చే వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు. అంతేకాకుండా సైబర్ నేరాలపై కూడా ప్రజలకు అవగాహన కల్పించారు. ఆన్‌లైన్ మోసాల నుండి ఎలా రక్షించుకోవాలో వివరించగా, చిన్నపిల్లలపై జరిగే లైంగిక దాడులపై చట్టాలు, శిక్షల గురించి కూడా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రూరల్ లా అండ్ ఆర్డర్ డీసీపీ శ్రీ లక్ష్మీనారాయణ, ఏసీపీ ఎబీజీ తిలక్, రూరల్ సీఐ చవాన్, చందర్లపాడు ఎస్సై ధర్మరాజు తదితర పోలీసులు పాల్గొన్నారు. గ్రామస్థులు కూడా చురుకుగా పాల్గొని పోలీసులకు సహకరించారు.

# "ప్రకృతి సాగు విధానంలో న్యూట్రి గార్డెన్స్‌తో ఆరోగ్యకరమైన జీవనం -- కలెక్టర్ సూచన"



**పల్నాడు ఏప్రిల్ 10( నేటి మనదేశమ్ ప్రతినిధి)** : జిల్లా కేంద్రంలోని గుర్రం జాషువా మీటింగ్ హాల్లో న్యూట్రి గార్డెన్స్, కిచెన్ గార్డెన్స్, సూర్య మండలం, ఏటీఎం (ూావీ) మోడల్స్, టెర్రస్ గార్డెన్స్, కమ్యూనిటీ గార్డెన్స్ మరియు బయో-రిసోర్స్ సెంటర్లపై శుక్రవారం సమగ్ర శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గౌరవనీయులైన జిల్లా కలెక్టర్ Dr. Kruthika Shukla ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మనోజ్, డి పి యం ూ్రాజచీఖీ కె. అమల కుమారి, , ఐజూం, , ప్రాజెక్ట్ డైరెక్టర్ MEPMA, DRDA, ICDS, DPO, MPDO\T, MC\T, APM\T, MEO\T, CDPO\T, సూపర్వైజర్లు, మున్సిపాలిటీ జవీవీలు తదితరులు పాల్గొన్నారు పురుగుమందుల అవశేషాలు లేని ఆరోగ్యకరమైన ఆహారం అందించడం, ప్రతి కుటుంబం స్వయంగా ఆహారాన్ని పండించుకోవడం, రసాయన రహిత వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించడం ఈ శిక్షణ ప్రధాన ఉద్దేశ్యంగా నిర్వాహకులు తెలిపారు ఈ సందర్భంగా జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ శ్రీమతి కె. అమలుకుమారి మాట్లాడుతూ, రసాయన ఎరువులు మరియు పురుగుమందుల వినియోగం వల్ల నేల నాణ్యత దెబ్బతినడం, ఆరోగ్య సమస్యలు పెరగడం వంటి సమస్యలను వివరించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా నేల సారాన్ని కాపాడుతూ తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు సాధ్యమవుతాయని తెలిపారు. న్యూట్రి గార్డెన్స్, కిచెన్ గార్డెన్స్, సూర్య మండలం, ఏటీఎం మోడల్స్, టెర్రస్ మరియు కమ్యూనిటీ గార్డెన్స్ ప్రాముఖ్యతను వివరించారు. చిన్న స్థలంలోనే పలు రకాల కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు సాగు చేయవచ్చని చెప్పారు. సూర్య మండలం మోడల్‌లో పంటల శాస్త్రీయ అమరిక వల్ల తక్కువ నీటితో అధిక దిగుబడులు సాధ్యమవుతాయని, ఏటీఎం (ూాఅఎ ుఆఎవ వీశీఅవఎ) మోడల్ ద్వారా నిరంతర ఆదాయం పొందవచ్చని వివరించారు. ఇంటి వద్ద పండించిన ఆహారం రసాయన రహితంగా ఉండటం వల్ల కుటుంబ ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు, అదనపు ఉత్పత్తిని విక్రయించి ఆదాయం పొందవచ్చని సూచించారు. ప్రతి గ్రామంలో ప్రతి కుటుంబం కనీసం ఒక కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ డా. కృతిక శుక్ల మాట్లాడుతూ, పాఠశాలలు, అంగనవాడి కేంద్రాలు, కళాశాలలు మరియు ూఎ+ మహిళల వద్ద అందుబాటులో ఉన్న స్థలాన్ని వినియోగించి న్యూట్రి గార్డెన్ మోడల్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రజలు రోజువారీగా పోషక విలువలతో కూడిన ఆహారం పొందేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. చిన్నపిల్లలకు అంగనవాడి కేంద్రాల ద్వారా పోషకాహారం అందించడం అత్యంత అవసరమని, చిన్న వయస్సు నుంచే ఆరోగ్యకరమైన ఆహార అలవాట్లు పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. న్యూట్రి గార్డెన్స్ ప్రోత్సాహం కోసం గ్రామ స్థాయిలో పోటీలు నిర్వహించి మొదటి, రెండవ, మూడవ బహుమతులు అందజేయాలని సూచించారు. బయో-రిసోర్స్/ఇన్‌పుట్ సెంటర్ల ఏర్పాటు మరియు పాయింట్ పర్సన్స్ బాధ్యతలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు. శిక్షణలో భాగంగా సూర్య మండల మోడల్, కిచెన్ గార్డెన్, న్యూట్రి గార్డెన్, టెర్రస్ మరియు కమ్యూనిటీ గార్డెన్స్ ఏర్పాటు, విత్తనాల ఎంపిక, నీటి నిర్వహణ, సేంద్రియ ద్రావణాల తయారీపై ప్రాక్టికల్ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో పోషకాహార భద్రత పెంపొందించడంతో పాటు ప్రకృతి వ్యవసాయం విస్తరణకు, రైతుల ఆర్థిక స్థితి మెరుగుదలకు దోహదం అవుతుందని అధికారులు అభిప్రాయపడ్డారు. కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

# నందిగామ రైతులకు న్యాయం..

## డిజిటల్ పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ...



**నందిగామ ఏప్రిల్ 10( నేటి మనదేశమ్ ప్రతినిధి)** : నందిగామ మండలం రుద్రవరం, గొల్లమూడి గ్రామాల్లో రైతులకు జాయింట్ కలెక్టర్ ఇలాకీయా పట్టాదారు పాసుపుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గత ప్రభుత్వ కాలంలో భూ రికార్డుల్లో జరిగిన పొరపాట్ల కారణంగా తమకు ఎన్నో ఇబ్బందులు ఎదురయ్యాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. భూముల సరిహద్దులు, ఎకరాల వివరాలు సరిగా నమోదు కాకపోవడంతో పంట రుణాలు, ఇతర ప్రభుత్వ పథకాలు పొందడంలో సమస్యలు తలెత్తినట్లు తెలిపారు. ఈ సమస్యలను దృష్టిలో ఉంచుకుని కూటమి ప్రభుత్వం రీ-సర్వే ప్రక్రియను చేపట్టిందని జాయింట్ కలెక్టర్ తెలిపారు. ఆధునిక సాంకేతికతతో భూములను మళ్లీ కొలిచే పనులు చేపట్టి, ఖచ్చితమైన రికార్డులను సిద్ధం చేసినట్లు చెప్పారు. కొత్తగా అందజేస్తున్న పట్టాదారు పాసుపుస్తకాలలో ప్రత్యేక క్యూఆర్ కోడ్, ప్రభుత్వ రాజముద్రను పొందుపరిచినట్లు వివరించారు. ఈ డిజిటల్ పాసుపుస్తకాల ద్వారా రైతులు ఎక్కడైనా తమ భూమి వివరాలను సులభంగా ధృవీకరించుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. అదేవిధంగా, భవిష్యత్తులో ఎలాంటి వివాదాలు తలెత్తకుండా ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటుందని తెలిపారు. రైతుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఈ రీ-సర్వే ప్రక్రియ ద్వారా వారికి పూర్తి న్యాయం జరుగుతుందని జేసీ స్పష్టం చేశారు. కార్యక్రమంలో స్థానిక అధికారులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. రైతులు ఈ చర్యలను స్వాగతిస్తూ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

# వత్సవాయి రూ.20 లక్షలతో సీసీ రోడ్డు..

## గ్రామాల మధ్య కనెక్టివిటీకి ఊతం...



**నందిగామ ఏప్రిల్ 10( నేటి మనదేశమ్ ప్రతినిధి)** : వత్సవాయి మండలం వేముల నర్వలో ఉపాధి హామీ పథకం నిధులు రూ. 20 లక్షలతో నిర్మించిన 400 మీటర్ల సీసీ రోడ్లను ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య శుక్రవారం ప్రారంభించారు. పాత వేములనర్వ, కొత్త వేములనర్వ గ్రామాల మధ్య రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతుండగా, ఈ సీసీ రోడ్డు నిర్మాణంతో కనెక్టివిటీ మెరుగుపడనుంది. గ్రామస్థుల దీర్ఘకాలిక సమస్యకు పరిష్కారం లభించిందని స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందన్నారు. రోడ్లు, కాల్వలు, తాగునీరు వంటి సౌకర్యాలను మెరుగుపరచడం ద్వారా గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. వేములనర్వలో నిర్మించిన ఈ సీసీ రోడ్డు రెండు గ్రామాల ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో బురద, చెత్త కారణంగా ఎదురయ్యే ఇబ్బందులు ఇకపై ఉండవని చెప్పారు ఈ రోడ్డు నిర్మాణానికి దాత మాధవరావు తన స్థలాన్ని అందించడం అభినందనీయమని ఎమ్మెల్యే కొనియాడారు. ప్రజా ప్రయోజనాల కోసం సహకరించిన దాతకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామాభివృద్ధికి అందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ నాయకులు వడ్లమూడి రాంబాబు, చిత్తూరు రమేష్, పెద్ది రామారావు తదితరులు పాల్గొన్నారు. స్థానికులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఇంద్రకీలాద్రిపై నకిలీ వారసత్వ కలకలం

## : అర్చక ఉద్యోగం కోసం భారీ కుట్ర!



**విజయవాడ , ఏప్రిల్ 10( నేటి మనదేశమ్ ప్రతినిధి)** : విజయవాడ దుర్గగుడిలో మరణించిన అర్చకుడు లింగాల సాయిబాబు స్థానంలో, నకిలీ పత్రాలతో ఉద్యోగం పొందేందుకు లింగాల దిలీప్ కుమార్ అనే వ్యక్తి చేసిన ప్రయత్నం వివాదాస్పదమైంది. దత్తత పత్రాలు సృష్టించి వారసుడిగా నియామక ఉత్తర్వులు కూడా పొందినట్లు తెలుస్తోంది. గతంలోనూ నామయ్య అనే అర్చకుడి పేరుతో ఇలాగే మోసానికి యత్నించినట్లు ఆరోపణలు ఉన్నాయి. సాయిబాబు మేనకోడలు లక్ష్మీ పద్మావతి ఈవో శీనా నాయక్‌కు ఫిర్యాదు చేయడంతో అధికారులు నియామకాన్ని నిలిపివేశారు. దేవాదాయ శాఖలో పత్రాల పరిశీలన లోపభూయిష్టంగా సాగిందని అర్చక సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఈ కుట్రపై సమగ్ర విచారణ జరిపి అసలైన దోషులను శిక్షించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# గంజాయి రహిత నగరమే లక్ష్యం : ఏసీపీ దామోదర్



**విజయవాడ , ఏప్రిల్ 10( నేటి మనదేశమ్ ప్రతినిధి)** : విజయవాడ నగరంలో గంజాయి, ఇతర మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టేందుకు ప్రజలు సహకరించాలని సెంట్రల్ ఏసీపీ దామోదర్ కోరారు. ఎవరైనా డ్రగ్స్ తీసుకుంటున్నట్లు గమనిస్తే వెంటనే 112 టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.సమాచారం అందిన వెంటనే పోలీసులు వేగంగా స్పందించి చర్యలు తీసుకుంటారని స్పష్టం చేశారు. పట్టుబడిన వ్యక్తులకు తొలుత వైద్య పరీక్షలు నిర్వహిస్తామని, వ్యసనం తీవ్రతను బట్టి వారిని డీ-అడిక్షన్ సెంటర్లకు తరలించి కౌన్సెలింగ్ ఇప్పిస్తామని తెలిపారు. సమాచారం అందించిన పౌరుల వివరాలను అత్యంత గోప్యంగా ఉంచుతామని, యువత మత్తుకు బానిస కాకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఏసీపీ పేర్కొన్నారు.

# నరసరావుపేట డిఎస్పి గా హనుమంతరావు



**పల్నాడు ఏప్రిల్ 10( నేటి మనదేశమ్ ప్రతినిధి)** : రాష్ట్రంలో పలువురు డిఎస్పి లకు బదిలీలు ఒ పోస్టింగ్స్ ఇస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. అందులో భాగంగా సత్తెనపల్లి డిఎస్పి గా విధులు నిర్వహిస్తున్న మేదరమెట్ల హనుమంతరావు ను నరసరావుపేట డిఎస్పి గా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. హనుమంతరావు ఇప్పటివరకు నరసరావుపేట ఇంచార్జి డిఎస్పీగా పనిచేశారు.


# మూడు ప్రైవేట్ పాఠశాలల బస్సులు దగ్ధం



**కమలాపురం ఏప్రిల్ 10( నేటి మనదేశమ్ ప్రతినిధి)** : మండలంలోని కోగటం గ్రామంలో గురువారం అర్ధరాత్రి వేర్వేరు ప్రైవేట్ పాఠశాలలకు చెందిన మూడు బస్సులు దగ్ధమయ్యాయి. ప్రొద్దుటూరులోని పలు ప్రైవేట్ పాఠశాలలకు చెందిన బస్సులను కోగటం గ్రామంలోని ఓ ఖాళీ ప్రదేశంలో నిలిపి ఉంచుతారు. నిన్న మధ్యాహ్నం విద్యార్థులను దింపి వచ్చిన తర్వాత బస్సులను యధావిధిగా గ్రామంలో పార్కింగ్ చేశారు. ఈ క్రమంలోనే అర్ధరాత్రి సమయంలో ఒక్కసారిగా మంటలు చెలరేగి వేర్వేరు పాఠశాలలకు చెందిన మూడు బస్సులు దగ్ధమయ్యాయి. ప్రమాదాన్ని గుర్తించిన స్థానికులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్న వారు మంటలను అదుపు చేశారు. ఆకతాయిలెవరైనా బస్సులకు నిప్పు పెట్టారా లేదా షార్ట్‌సర్క్యూట్ వల్ల ఈ ప్రమాదం జరిగిందా? అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు.

# మొబైల్ యూజర్లకు గుడ్ న్యూస్

## : ఇక డేటా లేని 'చౌక' ప్లాన్లు!



**విజయవాడ , ఏప్రిల్ 10( నేటి మనదేశమ్ ప్రతినిధి)** : మొబైల్ యూజర్లకు ఊరటనిచ్చేలా టెలికం నియంత్రణ సంస్థ కీలక నిర్ణయం తీసుకుంది. డేటా అవసరం లేని వారి కోసం కేవలం వాయిస్ కాల్స్, ూమీూ సదుపాయంతో కూడిన ప్రత్యేక రీఛార్జ్ ప్లాన్‌లను ప్రవేశపెట్టాలని టెలికం కంపెనీలను ఆదేశించింది. ప్రస్తుతం స్మార్ట్‌ఫోన్ వాడని వారు, కేవలం ఫోన్ మాట్లాడుకునే వృద్ధులు కూడా డేటా కోసం అదనంగా చెల్లించాల్సి వస్తోంది. ఈ భారాన్ని తగ్గించేందుకు, ప్రస్తుతం డేటా ప్లాన్‌లకు ఉన్న అన్ని వ్యాలిడిటీ ఆప్షన్లలోనూ ఈ వాయిస్ ప్లాన్‌లను అందుబాటులోకి తేవాలని సూచించింది. దీనివల్ల సామాన్య వినియోగదారులకు రీఛార్జ్ ఖర్చులు తగ్గి, వారికి నచ్చిన సేవలను ఎంచుకునే వెసులుబాటు కలగనుంది. త్వరలోనే ఈ చౌక ప్లాన్లు మార్కెట్లోకి రానున్నాయి.

# జిఎస్టి వసూళ్లపై పల్నాడు జిల్లా కలెక్టర్ సమీక్ష



**పల్నాడు ఏప్రిల్ 10( నేటి మనదేశమ్ ప్రతినిధి)** : పల్నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ కృతిక శుక్ల, గుంటూరు జాయింట్ కమిషనర్ (రాష్ట్ర పన్నులు) జాన్ స్టీవెన్సన్ పాత్రో ఆధ్వర్యంలో జిఎస్టి కో-ఆర్డినేషన్ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో జిఎస్టి వసూళ్లను మరింత సమర్థవంతంగా పెంచేందుకు వివిధ ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు.జిఎస్టి ఆదాయ వృద్ధికి సంబంధిత శాఖల అధికారులు అందించాల్సిన సహకారంపై జాయింట్ కమిషనర్ వివరించారు. ఈ సమావేశంలో జిల్లా స్థాయి అధికారులతో పాటు నరసరావుపేట, సత్తెనపల్లి, పిడుగురాళ్ల ప్రాంతాలకు చెందిన అసిస్టెంట్ కమిషనర్లు (రాష్ట్ర పన్నులు) పాల్గొన్నారు.

# కొండవీడు కోటలో ప్రేమజంట ఆత్మహత్య



**పల్నాడు ఏప్రిల్ 10( నేటి మనదేశమ్ ప్రతినిధి)** : యడ్లపాడు మండలం కొండవీడు కోట పరిధిలో అత్యంత విషాదకర ఘటన చోటుచేసుకుంది. విడిపోయి ఉండలేమన్న బాధతో ఓ ప్రేమజంట పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరు స్వర్ణభారత్ నగర్‌కు చెందిన రసిక మనికంఠ రాజు (20), అంకమ్మ నగర్‌కు చెందిన ఓ యువతి గత రెండేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. అయితే వీరి వివాహానికి పెద్దలు అంగీకరించకపోవడంతో, ఇటీవల యువతికి వేరే వ్యక్తితో వివాహం జరిపించారు. పెళ్లి జరిగినప్పటికీ విడిపోలేక.. పెళ్లి తర్వాత భర్తతో ఉండలేక మనస్తాపానికి గురైన యువతి, తిరిగి గుంటూరుకు వచ్చేసింది. ఈ క్రమంలో ఈ నెల 7వ తేదీన మనికంఠ రాజుతో కలిసి కొండవీడు కోటకు వెళ్లిన ఆమె, అక్కడ ఇద్దరూ కలిసి 'స్పైకర్' అనే పురుగుమందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. గమనించిన స్థానికులు వెంటనే 108 అంబులెన్స్ ద్వారా వారిని గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి ఆసుపత్రిలో మృత్యువుతో పోరాడుతూ మనికంఠ రాజు 8వ తేదీ సాయంత్రం కన్నుమూయగా, యువతి పరిస్థితి విషమించి 9వ తేదీన ప్రాణాలు విడిచింది. పర్యాటక ప్రాంతమైన కొండవీడు కోటలో జరిగిన ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. మృతుల తల్లులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ టి. శివరామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రాజు మృతదేహానికి గురువారం పోస్టుమార్టం పూర్తి చేసి కుటుంబ సభ్యులకు అప్పగించగా, యువతి మృతదేహానికి శుక్రవారం పోస్టుమార్టం నిర్వహించనున్నట్లు పోలీసులు తెలిపారు.

# వారతిప్పలో బహిరంగంగానే కోడిపందేలు!



**మొగల్తూరు ఏప్రిల్ 10( నేటి మనదేశమ్ ప్రతినిధి)** : మొగల్తూరు మండలం వారతిప్పలో కోడిపందేలు నిషేధం ఉన్నప్పటికీ బహిరంగంగానే జోరుగా సాగుతున్నాయి. నిర్వాహకులు స్థావరాలు ఏర్పాటు చేసి పందేలు నిర్వహిస్తుండటంతో లక్షలాది రూపాయల నగదు చేతులు మారుతోంది. దీనివల్ల అసాంఘిక కార్యకలాపాలు పెరుగుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు తక్షణమే స్పందించి దీన్ని అరికట్టాలని, నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

## కుతకుతలాడిపోతున్న బాలీవుడ్




ఒక భాష నుంచి రికార్డ్ బ్రేకింగ్ హిట్ వస్తే.. ఆ భాషకు సంబంధించిన ఫిలిం ఇండస్ట్రీ గర్వంతో తలెత్తుకుంటుంది. 'బాహుబలి' సినిమా వచ్చినపుడు తెలుగు సినీ పరిశ్రమ ఎంత గర్వించిందో తటటలిసిందే. కానీ బాలీవుడ్ మాత్రం 'దురంధర్' సినిమా విషయంలో ఎంతమాత్రం ప్రౌడ్‌గా ఫీలవ్వకపోవడం ఆశ్చర్యం కలిగించే విషయం. గత ఏడాది డిసెంబరులో 'దురంధర్' రిలీజై సెన్సేషన్ క్రియేట్ చేసినపుడు కానీ.. గత నెలలో 'దురంధర్-2' విడుదలై అంతకుమించిన ప్రభంజనం రేపినపుడు కానీ.. బాలీవుడ్ ప్రముఖులు పెద్దగా స్పందించింది లేదు. హృతిక్ రోషన్ మినహాయిస్తే.. 'దురంధర్' రిలీజైనపుడు బాలీవుడ్ నుంచి ఈ సినిమాను కొనియాడుతూ సోషల్ మీడియా పోస్టులు పెట్టిన వాళ్లు లేరు. హృతిక్ సైతం ఈ సినిమాను పొగుడుతూనే.. కౌంటర్లు వేశాడు. ఇక 'దురంధర్-2' విడుదల సమయంలో ఈ మాత్రం స్పందన కూడా లేదు. సౌత్ నుంచి రాజమౌళి, మహేష్ బాబు, అల్లు అర్జున్ సహా ఎంతోమంది ఈ సినిమాను ఆకాశినికెత్తేశారు. తాజాగా సందీప్ రెడ్డి వంగ 'దురంధర్-2' గురించి పెట్టిన పోస్టు.. దానికి దర్శకుడు ఈ చిత్ర దర్శకుడు ఆదిత్య ధర్ ఇచ్చిన రిప్లై హాట్ టాపిక్‌గా మారాయి. 'దురంధర్', 'దురంధర్-2' చిత్రాలను ప్రాపగండా ఫిలిమ్స్ అంటూ ముద్ర వేసి మౌనం వహిస్తున్న బాలీవుడ్ ప్రముఖులందరికీ సందీప్ రెడ్డి మామూలు కౌంటర్ ఇవ్వలేదు. సందీప్ అంటే ముందు నుంచి బాలీవుడ్ జనాలకు నచ్చదు. కబీర్ సింగ్, యానిమల్ సినిమాలను అక్కడి వాళ్లు ఓన్ చేసుకోలేదు. కానీ ఆ చిత్రాలతో ప్రేక్షకులను మెప్పించి బ్లాక్ బస్టర్లు కొట్టాడు సందీప్. ఈ సినిమాలను డీగ్రేడ్ చేయాలిన చూసిన ఫిలిం క్రిటిక్స్‌ను సందీప్ ఎలా ఆటాడుకున్నాడో తెలిసిందే. ఆదిత్య ధర్ సినిమాలను సైతం ఇలాగే ఫిలిం క్రిటిక్స్ టార్గెట్ చేశారు. వాళ్లకు తన సినిమా బాక్సాఫీస్ ఫలితంతోనే జవాబు చెప్పాడు ఆదిత్య. ఈ ఇద్దరు దర్శకుల సక్సెస్‌ను చూసి బాలీవుడ్ ఓర్చుకోలేకపోతోందన్నది స్పష్టం. వాళ్లు భారీ విజయాలు అందుకోవడమే కాదు.. బాలీవుడ్ లిబరల్ బ్యాచ్‌కు ఇచ్చిన కౌంటర్లు కూడా ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి.

## 'జననాయగన్' నిర్మాత పరిస్థితేంటి?

తమిళంలో సూపర్ స్టార్ రజినీకాంత్ ఉండగా ఆయన్ని మించిన స్టార్ రాడని అంతా అనుకున్నారు. ఆయన సినిమాల బడ్జెట్లు, బిజినెస్, వసూళ్లు ఆ స్థాయిలో ఉండేవి. కానీ విజయ్ గత దశాబ్ద కాలంలో ఇంతింతై అన్నట్లు ఎదిగిపోయి.. రజినీనే మించిపోయాడు. తమిళంలో నంబర్ వన్ హీరోగా ఎదిగాడు. అలాంటి హీరోతో తన చివరి సినిమాను ప్రొడ్యూస్ చేసే అవకాశం దక్కించుకున్న నిర్మాత నారాయణను చూసి ఎంతో లక్కీ అనుకున్నారు. కర్ణాటకకు చెందిన ఈ నిర్మాత కేవీఎన్ ప్రొడక్షన్స్ బేనర్లో విజయ్ చివరి చిత్రం 'జననాగయన్'ను ప్రొడ్యూస్ చేశాడు. ఈ సినిమా ద్వారా ఆయన తక్కువలో తక్కువ రూ.100 కోట్ల లాభం అందుకుని ఉంటాడని అంచనా వేశారు. ఈ సినిమా అనుకున్న ప్రకారం జనవరి 9న రిలీజ్ అయి ఉంటే అంతకుమించే లాభం వచ్చేదేమో. కానీ సెన్సార్ సమస్యల కారణంగా ఆ చిత్రం అనూహ్యంగా వాయిదా పడిపోవడంతో నిర్మాత పరిస్థితి తీవ్ర ఇబ్బందికరంగా మారింది. వాయిదా వల్ల బయ్యర్లు వెనక్కి తగ్గారు. సమయానికి రావాల్సిన డబ్బులు రాలేదు. ఓటీటీ సంస్థ కూడా డీల్ క్యాన్సిల్ చేసింది. వడ్డీల భారం మీద పడి నిర్మాతకు రావాల్సిన లాభమంతా ఆవిరైపోయే పరిస్థితి తలెత్తింది. ఇప్పటిదాకా జరిగిందంతా ఒకెత్తయితే.. ఇప్పుడు జరుగుతున్న నష్టం మరో ఎత్తు. సినిమా ఎప్పుడు రిలీజైతే అప్పుడు



బాగానే డిమాండ్ ఉంటుందని.. పెట్టిన పెట్టుబడి అంతా వెనక్కి వచ్చేలా బిజినెస్ జరుగుతుందని ఆశిస్తూ వచ్చాడు నిర్మాత. కానీ ఇప్పుడు ఈ సినిమా ఆన్ లైన్లో లీక్ అయిపోయింది. ముందు ఐదు నిమిషాల్ ఎపిసోడ్ మాత్రమే బయటికి వచ్చింది. తర్వాత చూస్తే మొత్తం లీక్ అయిపోయింది. పైరసీ వెబ్ సైట్ల ద్వారా పెద్ద ఎత్తున డౌన్ లోడ్స్ జరుగుతున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. దీని వల్ల జరిగే నష్టం అంతా ఇంతా కాదు. పైరసీ వెర్షన్స్ ఆన్ లైన్ నుంచి డెలీట్ చేయించేందుకు ఎంత గట్టి ప్రయత్నం జరుగుతున్నా సరే లాస్ పెద్దగానే ఉండబోతోంది. సినిమా బిజినెస్ మీద ఇది తీవ్ర ప్రభావమే చూపేలా ఉంది. ఇటు బయ్యర్లు, అటు ఓటీటీ, శాటిలైట్ ఛానెళ్లు ఇప్పుడు అనుకున్న దాని కంటే తక్కువకే సినిమాను అడుగుతారనడంలో సందేహం లేదు. దీని వల్ల నిర్మాతకు భారీ నష్టం తప్పేలా లేదు. మొత్తానికి విజయ్ చివరి చిత్రంతో జాక్ పాట్ కొట్టాడనుకున్న నిర్మాత.. ఇప్పుడు భారీ నష్టాల పాలయ్యేలా కనిపిస్తున్నాడు. ఈ పరిస్థితుల్లో విజయ్ తన ప్రొడ్యూసర్‌ను ఎంతమేర ఆదుకుంటాడో చూడాలి.


## మూవీ మసాలా.. ఎంటర్‌టైన్‌మెంట్ న్యూస్

### అతిథి చాలా పెద్ద రిస్కు చేస్తున్నాడు



ఈ మధ్య రీ రిలీజుల ట్రెండ్ కొత్త పోకడలు పోతోంది. మొదలైనప్పుడు కేవలం తెలుగు రాష్ట్రాలకు పరిమితం చేయడం దగ్గరి నుంచి ఇప్పుడు ఓవర్సీస్ లో అడ్వాన్స్ ప్రీమియర్లు వేయడం దాకా హడావిడి మాములుగా ఉండటం లేదు. అయితే అన్నింటికీ ఒకే ఫలితం రావడం లేదు. ఖలేజా మంచి లాభాలు ఇస్తే అతడు కొంచెం పోరాడాల్సి వచ్చింది. వీటి మెయిన్ రిలీజ్ లో బాక్సాఫీస్ రిజల్ట్స్ రివర్స్ లో వచ్చిన సంగతి తెలిసిందే. మే 29 గ్రాండ్ గా అతిథి రాబోతోంది. అనూహ్యంగా ఈసారి అతిథి టీమ్ కొన్ని ప్రయోగాలు చేస్తోంది. ఎడిటింగ్ ప్యాట్రన్ మార్చి న్యూ ఫీల్ వచ్చేలా ప్లాన్ చేస్తున్నారట. అంతే కాదు రీ రికార్డింగ్, డిఐ, రీ స్టోరింగ్ లాంటి చర్యల్లోనూ కొత్త ట్రెండ్ సృష్టించే దిశగా ఏర్పాట్లు చేసుకున్నట్టు తెలిసింది. అయితే ఇక్కడో రిస్క్ ఉంది. నోస్టాల్జియా ఫ్యాన్స్ ఎప్పుడూ ఒరిజినల్ నే కోరుకుంటారు. ఆ మధ్య సూర్య సికందర్ ని ఇలాగే మార్పులు చేసి తమిళంలో మళ్ళీ విడుదల చేస్తే ఆశించినంత గొప్ప స్థాయిలో ఫలితం రాలేదు. మాయాబజార్, షోలే లాంటి క్లాసిక్స్ కి బ్యాక్ గ్రౌండ్ స్కోర్ మొత్తాన్ని మళ్ళీ రీ రికార్డింగ్ చేయించడం అధిక శాతం కల్ట్ లవర్స్ కి నచ్చలేదు. దీని వల్ల వాటి ఆత్మ దెబ్బ తిందని ఫీలవుతూ ఉంటారు. అయితే అతిథి విషయంలో ఈ ఎక్స్ పరిమెంట్ ని సమర్థిస్తున్న వాళ్ళు లేకపోలేదు. అతిథి ఫ్లాప్ అవ్వడానికి కారణం స్క్రీన్ ప్లే అని, కొంచెం నిడివి తగ్గించి, ట్విస్టులను సరిగ్గా ప్రెజెంట్ చేసి ఉంటే పెద్ద హిట్టయ్యేదని మహేష్ బాబు అభిమానులు భావించడం చూశాం. మరి నిజంగా ఆ స్థాయిలో కొత్త కట్ రెడీ చేసి మెప్పిస్తారా లేక ఊరికే ప్రమోషన్ అటెన్షన్ కోసం ఇలాంటి ఫీలర్లు వదులుతున్నారా అనేది థియేటర్ లో చూశాకే క్లారిటీ వస్తుంది. టీజర్ లో అయితే అన్నంత పని చేసినట్టే కనిపిస్తోంది. అయితే మణిశర్మ బ్యాక్ గ్రౌండ్ స్కోర్ ని కొత్తగా వినడంతో పాటు కొన్ని కీలక మార్పులనైతే చూడబోతున్నాం అన్న మాట. సురేందర్ రెడ్డి దర్శకత్వం వహించిన అతిథిని మహేష్ బాబు అన్నయ్య స్వర్గీయ రమేష్ బాబు నిర్మించడం విశేషం.

## తండెల్ దర్శకుడి సినిమాకు పెద్ద బ్రేక్?



గత ఏడాది యానిమేషన్ మూవీ 'మహావతార నరసింహ' భారీ విజయాన్నందుకున్న నేపథ్యంలో అదే తరహాలో ఆంజనేయుడి కథతో 'వాయుపుత్ర' తీయాలని వీళ్లిద్దరూ సంకల్పించారు. దాదాపు ఏడాది నుంచి ఈ ప్రాజెక్టు మీద పని చేస్తున్నాడు చందూ మొండేటి. ఈ ప్రాజెక్టు గురించి నాగవంశీ మీడియా ముందు కూడా ఎంతో ఎగ్జైట్ అయ్యాడు. త్వరలో అనౌన్స్‌మెంట్ గ్లింప్స్ వస్తుందని కూడా గతంలో చెప్పాడు. కానీ ఇప్పుడేమో ఈ ప్రాజెక్టుకు బ్రేక్ పడిందంటూ వార్తలు వస్తున్నాయి. ఈ యానిమేషన్ మూవీని చందూ విజన్‌కు తగ్గట్లు తీయాలంటే బడ్జెట్ కొంచెం ఎక్కువే అవుతుందని.. కానీ బిజినెస్ పరంగా ఆ బడ్జెట్‌ను వర్కవుట్ చేయడం కష్టమని భావిస్తున్నారట. ఇటీవల డిజిటల్ మార్కెట్ బాగా దెబ్బ తినేయడం వల్ల అనుకున్న రేట్లు రావట్లేదు. నాగవంశీ సినిమాలను రెగ్యులర్‌గా కొనే ఓటీటీ సంస్థ.. 'వాయుపుత్ర'కు ఆఫర్ చేసిన రేటు ప్రకారం ఈ సినిమా బడ్జెట్‌ను వర్కవుట్ చేయడం సాధ్యం కాదనే నిర్ణయానికి వచ్చారట. ఈ సినిమాను క్యాన్సిల్ చేయడం కాదు కానీ.. హోల్డ్‌లో పెట్టినట్లు తెలుస్తోంది.


చేసినవి తక్కువ సినిమాలే అయినా దర్శకుడిగా మంచి గుర్తింపే ఉంది చందూ మొండేటికి. తొలి చిత్రం 'కార్తికేయ'తోనే అతను బలమైన ముద్ర వేశాడు. ఆ తర్వాత 'సవ్యసాచి'తో నిరాశపరిచినా.. ఆపై కార్తికేయ-2, తండేల్ చిత్రాలతో విజయాలందుకున్నాడు. చందూతో ఈసారి ఒక భారీ యానిమేషన్ సినిమా చేయడానికి టాలీవుడ్ అగ్ర నిర్మాతల్లో ఒకరైన 'సితార ఎంటర్టైన్మెంట్స్' నాగవంశీ రెడీ అయ్యాడు.



## బిజినెస్ న్యూస్



## మళ్లీ తెరపైకి టాటా సన్స్ వ్యవహారం.. లిస్టింగ్‌కు జైకొట్టిన ఎస్‌పీ గ్రూప్




టాటా సన్స్ లిస్టింగ్ వ్యవహారం మళ్లీ తెరమీదకు వచ్చింది. దీన్ని లిస్టింగ్ చేయాలా? వద్దా? అనే అంశంపై టాటా గ్రూప్‌లో ఉన్న అభిప్రాయభేదాలు మరోసారి బయటపడ్డాయి. ఇప్పటికే టాటా ట్రస్ట్స్ ట్రస్టీ అయిన వేణు శ్రీనివాసన్ లిస్టింగ్‌కు బహిరంగంగా మద్దతు పలకగా.. మొదటి నుంచీ ఈ విషయంలో అనుకూలంగా ఉన్న షాపూర్జీ పల్లోంజీ గ్రూప్ లిస్టింగ్‌కు జైకొట్టింది. దీంతో ప్రస్తుతం ఈ బంతి ఆర్‌బీఐ కోర్టులో పడింది. టాటా సన్స్‌ను సకాలంలో లిస్టింగ్ చేయడం అనేది కేవలం నియంత్రణ సంస్థల నిబంధన మాత్రమే కాదని, అది ఒక అవసరమని షాపూర్జీ పల్లోంజీ గ్రూప్ ఛైర్మన్ షాపూర్జీ పల్లోంజీ మిస్త్రీ పేర్కొన్నారు. ఇది కార్పొరేట్ పాలనను బలోపేతం చేసి, పారదర్శకత, జవాబుదారీతనాన్ని పెంచుతుందన్నారు. ఇవే టాటా గ్రూప్‌కు మూలస్తంభాలు అని పేర్కొన్నారు. లిస్టింగ్ ద్వారా రిటైల్ పెట్టుబడిదారులకు మేలు జరుగుతుందన్నారు. టాటా ట్రస్ట్‌లకు స్థిరమైన డివిడెండ్ ఆదాయం లభిస్తుందని, తద్వారా వారు మరిన్ని సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టవచ్చని మిస్త్రీ అభిప్రాయపడ్డారు. ఈ విషయంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నుంచి స్పష్టమైన దిశానిర్దేశం కోసం తాము ఎదురుచూస్తున్నామని ఆయన చెప్పారు.

టాటా సన్స్‌ను అప్పర్ లేయర్ నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీ (చీదీఖీజ)గా ఆర్‌బీఐ గుర్తించింది. దీని ప్రకారం టాటా సన్స్‌ను లిస్ట్ చేయాల్సి ఉంటుంది. టాటా సన్స్‌లో మెజారిటీ వాటా కలిగిన (66 శాతం) టాటా ట్రస్ట్స్‌కు లిస్టింగ్ చేయడం ఏమాత్రం ఇష్టం లేదు. టాటా ట్రస్ట్స్ లిస్టింగ్ వల్ల సంస్థపై ట్రస్ట్ నియంత్రణ తగ్గి, బయటి వ్యక్తుల జోక్యం పెరుగుతుందనేది ట్రస్ట్ ఛైర్మన్ నోయల్ టాటా, మరికొందరు ట్రస్టీల ఆందోళన. అయితే, షాపూర్జీ పల్లోంజీ గ్రూప్ మాత్రం మొదటి నుంచీ లిస్టింగ్‌కు అనుకూలంగా ఉంది. తీవ్ర ఆర్థిక ఒత్తిళ్లలో ఉన్న ఈ గ్రూప్.. టాటా సన్స్‌లో తనకున్న 18.37% వాటాలను తనఖా పెట్టింది. వాటిని విడిపించుకోవడానికి టాటా సన్స్ లిస్టింగ్ కోసం ఒత్తిడి తెస్తోంది. అయితే, అప్పర్ లేయర్ ఎన్‌బీఎఫ్‌సీకి సంబంధించి ఆర్‌బీఐ త్వరలో సవరించిన సర్క్యులర్‌ను జారీ చేయనుంది. కంపెనీ విజ్ఞప్తిని దృష్టిలో పెట్టుకుని మినహాయింపు ఇస్తుందా? లేదా లిస్టింగ్ చేయాల్సిందేనని చెబుతుందా? అనేది వేచి చూడాలి.

## ఆల్‌టైమ్ గరిష్ఠానికి సిప్ పెట్టుబడులు

మ్యూచువల్ ఫండ్ పథకాల్లోకి మార్చి నెలలో సిప్ పెట్టుబడులు రికార్డు స్థాయిలో నమోదయ్యాయి. ఫిబ్రవరి నెలలో సిప్ రూపంలో రూ.29,845 కోట్లు రాగా.. మార్చిలో సిప్ ఇన్‌ఫ్లోలు 8 శాతం వృద్ధితో రూ.32,087 కోట్లుగా నమోదయ్యాయి. గతేడాది మార్చిలో నమోదైన రూ.25,925 కోట్లతో పోలిస్తే ఈ తరహా పెట్టుబడుల్లో 24 శాతం వృద్ధి నమోదైంది. ఈ మేరకు అసోసియేషన్ ఆఫ్ మ్యూచువల్ ఫండ్స్ ఇన్ ఇండియా మార్చి నెల గణాంకాలను శుక్రవారం వెలువరించింది. భౌగోళిక ఉద్రిక్తతలు కొనసాగుతున్నా ఈక్విటీ ఆధారిత మ్యూచువల్ ఫండ్స్‌లోకి నిధులు ప్రవాహం కొనసాగింది. అంతకుముందు నెలతో పోలిస్తే 56 శాతం వృద్ధితో రూ.40,450 కోట్లు పెట్టుబడులు వచ్చినట్లు యాంఫీ వెల్లడించింది. మార్కెట్ ఒడుదొడుకులు, అంతర్జాతీయంగా అనిశ్చితులు కొనసాగిన ప్పటికీ ఈక్విటీ పథకాల పట్ల నమ్మకాన్ని ఇది తెలియజేస్తోందని యాంఫీ పేర్కొంది. ముఖ్యంగా ఫ్లెక్సీ క్యాప్, మిడ్‌క్యాప్, స్మాల్ క్యాప్ పథకాల్లోకి ఎక్కువ నిధులు వెళ్లాయి. ఫ్లెక్సీ క్యాప్ ఫండ్స్‌లోకి అత్యధికంగా రూ.10వేల కోట్లు, స్మాల్ క్యాప్ ఫండ్స్‌లోకి




రూ.6,263 కోట్లు, మిడ్ క్యాప్ ఫండ్స్‌లోకి రూ.6,063 కోట్లు చొప్పున పెట్టుబడులు వచ్చాయి. డివిడెండ్ ఈల్డ్, ఈక్విటీ లింక్డ్ సేవింగ్స్ స్కీమ్ ఫండ్స్ నుంచి నిధులు తరలివెళ్లాయి. అదే సమయంలో గోల్డ్ ఈటీఎఫ్‌ల్లోకి రూ.2,266 కోట్ల మేర పెట్టుబడులు వచ్చాయి. ఫిబ్రవరితో (రూ.5,255 కోట్లు) పోలిస్తే తగ్గుముఖం పట్టాయి. మొత్తంగా మ్యూచువల్ ఫండ్స్ పథకాల నుంచి మార్చి నెలలో రూ.2.4 లక్షల కోట్ల మేర పెట్టుబడులు తరలిపోయాయి. అత్యధికంగా డెట్ మ్యూచువల్ ఫండ్స్ నుంచి రూ.2.95 లక్షల కోట్ల విలువైన పెట్టుబడులు తరలిపోవడం ఇందుకు కారణం. ఫిబ్రవరి నెలలో రూ.94,530 కోట్ల పెట్టుబడులు తరలివచ్చాయి. మ్యూచువల్ ఫండ్ పరిశ్రమ నిర్వహణలోని ఆస్తుల విలువ (ఏాఖవీ) ఫిబ్రవరిలో రూ.82.03 లక్షల కోట్లుగా ఉండగా.. రూ.73.73 లక్షల కోట్లకు తగ్గుముఖం పట్టింది.

## బ్యాంకింగ్ బ్యాకప్.. భారీ లాభాల్లో ముగిసిన సూచీలు




దేశీయ మార్కెట్లు శుక్రవారం భారీ లాభాల్లో ముగిశాయి . బ్యాంకింగ్ రంగం నుంచి లభించిన మద్దతు, అంతర్జాతీయ మార్కెట్లలోని సానుకూల సంకేతాలతో మన సూచీలు రాణించాయి. దాంతో సెన్సెక్స్ 918 పాయింట్లు లాభపడి 77,550 వద్ద ముగిసింది. నిఫ్టీ 275 పాయింట్లు ఎగబాకి, 24,050 వద్ద స్థిరపడింది. క్రితం సెషన్‌లో 76,631 వద్ద ముగిసిన సెన్సెక్స్.. నేటి ట్రేడింగ్‌లో 77,121 వద్ద ప్రారంభమైంది. ఒక దశలో 77,622 వరకు ఎగబాకింది. నిఫ్టీ సూచీలో ఏషియన్ పెయింట్స్, ఐషర్ మోటార్స్, ఐసీఐసీఐ బ్యాంక్, శ్రీరామ్ ఫైనాన్స్, బజాజ్ ఆటో షేర్లు రాణించాయి. కోల్ ఇండియా, సన్ ఫార్మా, ఇన్ఫోసిస్, టీసీఎస్, టెక్ మహీంద్రా షేర్లు నష్టపోయాయి. డాలర్ పోలిస్తే రూపాయి మారకం విలువ 92.73గా ఉంది. బ్యాంకింగ్ షేర్లలో భారీ కొనుగోళ్లే నేటి లాభాలకు ప్రధాన కారణం. ఇక, దక్షిణ కొరియా కొస్పి, జపాన్ నిక్కీ సహా పలు ఆసియా మార్కెట్లు లాభాల్లో కదలాడాయి. నేడు ఒక దశలో రూపాయి కోలుకోవడం కూడా కలిసొచ్చింది.

## మొబైల్ యూజర్లకు షాక్.. మళ్లీ ధరలు పెంచిన శాంసంగ్




దక్షిణ కొరియా మొబైల్ తయారీ దిగ్గజం శాంసంగ్ (ఋఖఎంబఅస్త్ర) మరోసారి తన స్మార్ట్‌ఫోన్ ధరలను పెంచేసింది. ఫిబ్రవరి నెలలో ఒకసారి పలు ఎంట్రీ లెవల్, మిడ్ రేంజ్ స్మార్ట్‌ఫోన్లపై ధరలను పెంచిన ఈ సంస్థ.. తాజాగా ఎంపిక చేసిన ఫోన్ల ధరలను సవరించింది. గెలాక్సీ ఏ, ఎఫ్ సిరీస్ మోడళ్లు ఇందులో ఉన్నాయి. ఈ మేరకు టిప్‌స్టర్ అభిషేక్ యాదవ్ సదరు ధరల పట్టికను ఎక్స్‌లో షేర్ చేశారు. పెరిగిన ధరలు నేటినుంచే అమల్లోకి రానున్నాయి.

**ఏయే స్మార్ట్‌ఫోన్లపై ఎంతంటే..?**

టిప్‌స్టర్ వెల్లడించిన వివరాల ప్రకారం.. గెలాక్సీ ఏ06 స్మార్ట్‌ఫోన్ ధరను దాదాపు శాంసంగ్ రూ.1000 పెంచేసింది. దీంతో బేస్ వేరియంట్ ధర రూ.13,499కు చేరింది. ఏ07 స్మార్ట్‌ఫోన్‌పై రూ.1250 పెంచింది. దీంతో దీని ప్రారంభ ధర రూ.10,999 నుంచి ప్రారంభం కానుంది. గెలాక్సీ ఏ17 స్మార్ట్‌ఫోన్‌పై వేరియంట్‌ను బట్టి రూ.1000 నుంచి రూ.1500 మేర పెంచింది. దీంతో టాప్ వేరియంట్ ధర రూ.27,999కు చేరింది. శాంసంగ్ ఏ36పై రూ.1500 నుంచి రూ.3000, గెలాక్సీ ఏ56 స్మార్ట్‌ఫోన్‌పై రూ.2000 నుంచి రూ.3500 చొప్పున పెంచింది.

**ఈ మోడళ్ల పైనా..**

రెండ్రోజుల క్రితం కూడా కొన్ని స్మార్ట్‌ఫోన్ ధరలను శాంసంగ్ సవరించింది. గెలాక్సీ ఎం36, గెలాక్సీ ఎఫ్ 36 స్మార్ట్‌ఫోన్లపై రూ.1000 చొప్పున పెంచింది. గెలాక్సీ ఎం6, ఎఫ్06 స్మార్ట్‌ఫోన్లపై రూ.1500 నుంచి రూ.2000 మేర పెంచింది. గెలాక్సీ ఎం 07, గెలాక్సీ ఎఫ్07 మోడళ్లపై రూ.1900 వరకు రేట్లను సవరించింది. ఈ ధరలు ఏప్రిల్ 8 నుంచే అమల్లోకి వచ్చాయి.

## ముక్కంటి సేవలో పరిటాల సునీత



**శ్రీకాళహస్తి, ఏప్రిల్ 10 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** శుక్రవారం రాహుకాల సమయంలో రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత కుటుంబ సభ్యులతో కలసి కాల సర్ప దోష నివారణ పూజలు నిర్వహించారు. వారికి దక్షిణ గోపురం వద్ద ఆలయ ఇఓ బికె వెంకటేశులు స్వాగతం పలికారు. తరువాత స్వామి అమ్మవార్ల ఆలయాల్లో అంతరాలయ దర్శనం ఏర్పాటు చేశారు. అనంతరం వేద పండితులచే ఆశీర్వఛనం, స్వామి అమ్మవారి చిత్ర పటం తీర్ధ ప్రసాదాలు ఇఓ బి కె వెంకటేశు లు అందజేశారు.వారితో పాటు ఆలయ బోర్డు సభ్యులు ఉన్నారు. అనంతరం ఆలయ పరిపాలన భవనం వద్ద పరిటాల సునీత ను తెలుగు దేశం పార్టీ కార్యకర్తలు, మహిళలు శాలువాతో సత్కరించారు.

## గొల్లవాని గుంటలో నూతన స్టేడియం పరిశీలన



**తిరుపతి,ఏప్రిల్ 10 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** శాప్ చైర్మన్ రవి నాయుడు తిరుపతి గొల్లవానిగుంటలో నూతనంగా నిర్మించి ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న నందమూరి తారక రామారావు క్రీడా ప్రాంగణాన్ని, స్థానిక శాసనసభ్యులు ఆరిణి శ్రీనివాసులుతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా రవి నాయుడు మాట్లాడుతూ ప్రారంభోత్సవానికి అవసరమైన అన్ని ఏర్పాట్లను నిర్దిష్ట సమయానికి, ఎలాంటి అవకతవకలు జరగకుండా పూర్తి చేయాలని సంబంధిత శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

## శిశు మరణాలపై సమీక్ష



**తిరుపతి,ఏప్రిల్ 10 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వి బాలకృష్ణ నాయక్ ఆధ్వర్యంలో శక్రవారం జిల్లా స్థాయి శిశు మరణాల సమీక్ష సమావేశం జరిగింది. డీ ఎం హెచ్ ఓ కార్యాలయ మీటింగ్ హాల్ లో జరిగిన ఈ సమావేశంలో జిల్లావ్యాప్తంగా శిశు మరణాలపై సమీక్ష నిర్వహించినారు. శిశు మరణాలు జరిగిన పది ప్రాథమిక ఆరోగ్యకేంద్ర వైద్యాధికారుల నుండి , చికిత్స అందించిన ఆయా ఆసుపత్రుల డాక్టర్ల నుండి డిఎం అండ్ హెచ్ఓ కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు , మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లు , అంగన్వాడీ కార్యకర్తలు వారికి అందించిన సేవలను గురించి సమీక్షించారు. డిఎంహెచ్వో మాట్లాడుతూ ఆరోగ్య సిబ్బంది గర్భవతులు, బాలింతలు,చిన్నపిల్లలను క్రమం తప్పకుండా సందర్శించి వారికి అన్ని రకాల ఆరోగ్య సేవలు, సూచనలు, సలహాలు సకాలంలో అందించాలని ఆదేశించారు. సమావేశంలో డి .ఐ. ఓ .డాక్టర్ శాంతకుమారి,డిప్యూటీ డిఎంహెచ్వోలు ,డాక్టర్ సెల్వియా , డాక్టర్ మృదుల వాణి, గవర్నమెంట్ మెటర్నిటీ హాస్పిటల్, రుయా హాస్పిటల్ పీడియాట్రీషియన్లు, గైనకాలజిస్ట్ డాక్టర్లు, డి పి హెచ్ ఎన్ ఓ మంజుల, డిప్యూటీ డెమో బలరామరాజు , స్టాటిస్టికల్ ఆఫీసర్ నాగేంద్రకుమార్, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులు, సూపర్వైజర్లు,మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లు, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ కార్యకర్తలు తదితర సిబ్బంది పాల్గొన్నారు

## ప్రహరీ నిర్మాణాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే



**పిచ్చాటూరు,ఏప్రిల్ 10 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పిచ్చాటూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రహరీ గోడ నిర్మాణ పనులను ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం శుక్రవారం పరిశీలించారు. ఈ పనులకు జడ్పీ నిధుల నుంచి రూ.25 లక్షలు విడుదల చేయడం జరిగింది. కళాశాల చుట్టూ పూర్తిగా ప్రహరీ గోడ నిర్మించాలంటే మరో 10 లక్షలు కావల్సి వస్తోందని ప్రిన్సిపాల్ వెంకట సుబ్బమ్మ ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. వెంటనే జడ్పీ సీఈవో కు ఎమ్మెల్యే ఫోన్ చేసి పరిస్థితిని వివరించి, అదనంగా రూ.10 లక్షలు విడుదల చేయాలని కోరగా, సానుకూలంగా స్పందించిన జడ్పీ సీఈఓ నిధుల విడుదలకు అంగీకారం తెలిపినట్లు సమాచారం. కార్యక్రమం లో ఏఎంసి చైర్మన్ డి ఇలంగోవన్ రెడ్డి, జడ్పీటీసీ మాజీ సభ్యులు సుమాంజలి, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

## మురుగన్ ఆధ్వర్యంలో అన్నదానం

**పలమనేరు , ఏప్రిల్ 10 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** డాక్టర్ మురుగన్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం జరిగింది. గంటవూరు బీసీ కాలనీని తిరుపతి గంగమ్మ గుడిలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం భక్తులకు అన్నదాన చేశారు. ప్రతి మంగళవారం, శుక్రవారం వారంలో రెండు రోజులు గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.




## ముక్కంటి సేవలో ఆస్ట్రేలియా దేశస్తులు



**శ్రీకాళహస్తి, ఏప్రిల్ 10 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** శ్రీకాళహస్తీశ్వరాలయంలో శుక్రవారం పరదేశీయులు సందడి చేశారు. సంప్రదాయ దుస్తులతో ఆస్ట్రేలియా దేశానికి చెందిన 25 మంది బృందంగా వచ్చారు. ముందుగా ఆలయంలో జరిగే రాహు కేతు సర్ప దోష నివారణ పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. వినాయక స్వామి, సుబ్రహ్మణ్య స్వామి, శని భగవానుని, ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు ఈ సందర్భంగా వారు ఇక్కడి ఆలయ శిల్పకళ సౌందర్యాన్ని చూసి ఆనందం వ్యక్తం చేశారు పురాతన కాలంలో నిర్మించిన గోపురాలు ఆలయంలో స్తంభాలపై చెక్కిన శిల్పకళల లను చూసి ఆత్మానందాన్ని పొందారు. స్నేహితులు చెప్పడంతో ఇక్కడికి వచ్చినట్లు వివరించారు.

## మెరుగైన రోడ్ల నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యం

### - ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు



**తిరుపతి,ఏప్రిల్ 10 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తిరుపతి నగరంలో అంతర్గత రోడ్లు గుంతలు లేకుండా చూస్తామని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివా సులు తెలిపారు. డ్రైనేజీ కాలువలు, తాగునీటి పైపుల లీకేజీలు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన చెప్పారు. శుక్రవారం 43, 41వ డివిజన్లలో రోడ్లు, డ్రైనేజీ కాలువ నిర్మాణానికి ఆరణి శ్రీనివాసులు భూమి పూజ చేశారు. మొదట 43వ డివిజన్ పరిధిలోని సప్తగిరి నగర్‌లో నిర్మించనున్న సీసీ రోడ్డుకు, 41వ డివిజన్ లో డ్రెయిన్, సీసీ రోడ్డు నిర్మాణానికి ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తిరుపతి అభివృద్ధిపై సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్ ప్రత్యేక దృష్టి సారించారని ఆయన చెప్పారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరువేరుస్తామని ఆయన చెప్పారు. సప్తగిరి నగర్ లో యూడిఎస్ సమస్యను పరిష్కరించాలని ఇంజినీరింగ్ అధికారులను ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో డిఈ వెంకటప్రసాద్, మాజీ కార్పొరేటర్లు రాధా, దూది కుమారి, రాజా రెడ్డి, ఆర్పీ శ్రీనివాసులు, హరిశంకర్, కెఎంకే లోకేష్, వెంకటరమణ, ప్రసాద్, రమణా రెడ్డి, సుబ్బారావు, శీను, వెంకట్ రెడ్డి, అనీష్, వంశి, ఆముదాల వెంకటేష్, దూది శివ, అంకాలమ్మ ఆలయ పాలకమండలి ఛైర్మన్ కొండా రాజమోహన్ , హెచ్ డిసి సభ్యులు మునస్వామి, రాజేష్ ఆచ్చారి, దూది శివ, ప్రభాకర్ రెడ్డి, సాయిదేవ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## యుపిఎస్‌సి పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై డిఆర్ఓ సమీక్ష



**తిరుపతి,ఏప్రిల్ 10 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఈ నెల 12 న జరగనున్న యుపిఎస్‌సి (1), జాతీయ రక్షణ అకాడమీ అండ్ నావల్ అకాడమీ పరీక్ష-2026 నిర్వహణకు పగడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు రెవెన్యూ అధికారి నరసింహులు తెలిపారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో పరీక్షల నిర్వహణకు సంబంధించి రెవెన్యూ అధికారి నరసింహులు లైజనింగ్ అధికారులు , సంబంధిత అధికా రులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. రెవెన్యూ అధికారి మాట్లాడుతూ తిరుపతి జిల్లాలో నాలుగు పరీక్ష కేంద్రాలలో 1535 మంది అభ్యర్థులు హాజరు కానున్నారని తెలిపారు. పరీక్షా కేంద్రాలలోకి మొబైల్ ఫోన్, ఎలక్ట్రానిక్ పరికరాలు, ఎలక్ట్రానిక్ వాచ్ లు, ఎలక్ట్రానిక్ వస్తువులు అనుమతి ఉండదన్నారు. పద్మావతి మహిళా జూనియర్ కళాశాల (వింగ్-ఎ), శ్రీ పద్మావతి మహిళా జూనియర్ కళాశాల (వింగ్- బి), బాలాజీ కాలనీ లోని ఎస్.వి ఆర్ట్స్ కళాశాల, (టి.టి.డి.), (వింగ్-'ఎ'), ఎస్.వి ఆర్ట్స్ కళాశాల, (టి.టి.డి.), (వింగ్-' బి లలో పరీక్షలు జరుగతాయని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో పరీక్షల రాష్ట పరిశీలకులు జితేంద్ర కుమార్ , సంబందిత అధికారులు పాల్గొన్నారు.

## వడదెబ్బ నివారణపై అవగాహన

### -సిబ్బందికి, ప్రయాణీకులకు ఓఆర్ఎస్ పంపిణీ



**తిరుపతి,ఏప్రిల్ 10 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బాలకృష్ణ నాయక్ మార్గదర్శకత్వంలో తిరుపతి ఏపీఎస్ఆర్టీసీ బస్టాండ్ లో శుక్రవారం వడదెబ్బ నివారణ పై అవగాహన కార్యక్రమం జరిగింది. విధి నిర్వహణలో డ్రైవర్లు, కండక్టర్లు , ప్రయాణ ప్రాంగణంలో వేచి ఉన్న ప్రయాణికులకు వడ దెబ్బ గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భాగంగా ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి బాలకృష్ణ నాయక్ మాట్లాడుతూ అధికారులు మాట్లాడుతూ.. కార్మికులు, డ్రైవర్లు, కండక్టర్లు వడదెబ్బ బారీ పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. బస్టాండ్ ఆవరణంలో కూలింగ్ ఏరియాస్, తాగునీటి సదుపాయం, ఓఆర్ఎస్ కార్నర్ పాయింట్లు ఏర్పాటు చేయాలని డి ఎం హెచ్ ఓ ఆర్టీసీ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా ప్రజా రవాణాధికారి జగదీష్, డాక్టర్ రెడ్డి ప్రసాద్, డిప్యూటీ డి ఎం హెచ్ ఓ డాక్టర్ సెల్వియా, డిపిఎమ్ఓ డాక్టర్ చత్ర ప్రకాష్ రెడ్డి, డీఎస్ఓ డాక్టర్ జితేంద్ర, డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ విశ్వనాథ్ సెంట్రల్ బస్ స్టేషన్ అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ భాస్కర్, తిరుపతి డిపో మేనేజర్ కె.సురేంద్ర కుమార్ యూపీహెచ్సీ వైద్యాధికారులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, ఎన్సీడీ సిబ్బంది, ఐ డి ఎస్ పి పారామెడికల్ సిబ్బంది, తిరుపతి డిపో ట్రాఫిక్ , గ్యారేజ్ సూపర్వైజర్లు, అసోసియేషన్ ప్రతినిధులు, ప్రయాణికులు పాల్గొన్నారు.

## స్విమ్స్ ఆధ్వర్యంలో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్



**తిరుపతి,ఏప్రిల్ 10 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** శ్రీ వెంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) ఆధ్వర్యంలో శుక్రవారం తిరుపతిలోని ఐఎస్ మహల్ సచివాలయంలో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ముందుగా క్యాన్సర్ వ్యాధి లక్షణాలు, ముందస్తు నివారణ చర్యలపై చిత్రపటాల ద్వారా అవగాహన కల్పించారు. స్విమ్స్ డైరెక్టర్/వైస్ చాన్సలర్ డాక్టర్ ఆర్వీ కుమార్ ఆదేశాల మేరకు కమ్యూనిటి మెడిసిన్ ప్రొఫెసర్, పింక్ బస్ ప్రాజెక్టు ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్ డాక్టర్ అంజు దాము ఆడె మార్గదర్శకత్వంలో నోడల్ ఆఫీసర్లు డాక్టర్ భవాని, డాక్టర్ శివసంతోష్ పర్యవేక్షణలో ఈ వైద్య శిబిరం జరిగింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సహకారంతో తిరుపతి జిల్లాలో పింక్ బస్సులో మహిళలు, పురుషులకు నోటి క్యాన్సర్ పరీక్షలు, మహిళలకు రొమ్ము క్యాన్సర్ నిర్ధారణకు మామోగ్రామ్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నిర్ధారణ కోసం పాప్ స్మియర్ పరీక్షలను నిర్వహించారు. నెహ్రూ నగర్ అర్బన్ పిహెచ్సీ పరిధిలో ఏప్రిల్ 13న చిన్నబజారు వీధి, ఏప్రిల్ 17న రాజన్న పార్కు వద్ద పింక్ బస్ క్యాంపులు జరుగనున్నాయి.ఈ కార్యక్రమంలో నెహ్రూ నగర్ అర్బన్ పిహెచ్సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్వేత, పింక్ బస్ మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ పద్మావతి, డాక్టర్ హరిత, డాక్టర్ లావణ్య, ఏఎన్ఎంలు సంపూర్ణ, మణెమ్మ, స్థానిక నాయకులు తలారి బాలయ్య, సికె.రేవతి, సికె.రవి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## వర్కింగ్ జర్నలిస్టుల ఆరోగ్య పథకం మరో ఏడాది పొడిగింపు

**తిరుపతి,ఏప్రిల్ 10 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** అర్హత కలిగిన వర్కింగ్ జర్నలిస్టులకు సమగ్ర ఆరోగ్య సేవలు అందించేందుకు అమలు చేస్తున్న "వర్కింగ్ జర్నలిస్టుల ఆరోగ్య పథకాన్ని 2026-27 ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వం మరో ఏడాది పాటు పొడిగిస్తూ జీవోఎంఎస్ 43 ద్వారా ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ఉత్తర్వులు సమాచార పౌర సంబంధాల శాఖ డైరెక్టర్ ఎస్.విశ్వనాథ్ నుండి అందినట్లు జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి పి.గురుస్వామి చెట్టి శుక్రవారం తెలిపారు. ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియాకు చెందిన అక్రిడిటెడ్ జర్నలిస్టులు, ఫ్రీలాన్స్ , వెటరన్ జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులకు క్యాష్‌లెస్ వైద్యం అందించాలనే లక్ష్యంతో ఈ పథకం మొదటగా 2015-16లో ప్రారంభించబడి, ప్రతి సంవత్సరం కొనసాగిస్తూ ప్రభుత్వం పునరుద్ధరిస్తూ వస్తోందని తెలిపారు. ప్రస్తుత జీవోఎంఎస్ 43 ఉత్తర్వుల ప్రకారం పథకం 2026 ఏప్రిల్ 1 నుండి అమల్లోకి వచ్చే విధంగా, ప్రస్తుత నిబంధనలు , మార్గదర్శకాలతోనే ఈ పథకాన్ని కొనసాగించ నున్నట్లు ఉత్తర్వులలో పేర్కొన్నారన్నారు. ఈ మేరకు అవసరమైన చర్యలు తీసుకోవాలని డాక్టర్ వైఎస్సార్ వైద్య సేవా ట్రస్ట్ ముఖ్య కార్యనిర్వాహక అధికారి, సమాచార , పౌరసంబంధాల శాఖను ప్రభుత్వం ఆదేశించడం జరిగిందన్నారు. జిల్లాలోని జర్నలిస్టులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని గురుస్వామి చెట్టి కోరారు.

## భూసేకరణ పనులను పరిశీలించిన జేసీ

**తిరుపతి,ఏప్రిల్ 10 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రేణిగుంట, కడప జాతీయ రహదారి భూసేకరణ పనులను శ్రీకాళహస్తి ఆర్ డి ఓ భాను ప్రకాష్ రెడ్డి తో కలిసి జాయింట్ కలెక్టర్ గోవిందరావు శుక్రవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రేణిగుంట, కడప జాతీయ రహదారి భూసేకరణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. జాతీయ రహదారి నిర్మాణానికి సంబంధించి కరకంబాడి ఇందిరానగర్ కాలనీకి చెందిన గ్రామస్తులు తమకు చెల్లించాల్సిన భూ పరిహారం ఇప్పించేలా చూడాలని జాయింట్ కలెక్టర్‌కు విజ్ఞప్తి చేయగా ఆయన సానుకూలంగా స్పందించి, పరిహారం అందేలా చూడాలని సంబంధిత అధికారులకు సూచించారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

### - వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ - స్వర్ణ వెంకటగిరి' యాక్షన్ ప్లాన్ ఆవిష్కరణ



**వెంకటగిరి,ఏప్రిల్ 10 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** వెంకటగిరి నియోజకవర్గ ప్రజల సమస్యలను తెలుసుకుని, సత్వరమే పరిష్కరించే ఉద్దేశ్యంతో వెంకటగిరి శాసనసభ్యులు కురుగొండ్ల రామకృష్ణ 'ప్రజా దర్బార్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి, పలు సమస్యలపై అక్కడికక్కడే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారానికి ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇకపై నియోజకవర్గ కేంద్రంలో ప్రతి శుక్రవారం 'ప్రజా దర్బార్', , ప్రతి సోమవారం 'గ్రీవెన్స్ డే' నిర్వహించి ప్రజల సమస్యలు పెండింగ్ లేకుండా చూస్తామని స్పష్టం చేశారు. అధికారులు ప్రజల సమస్యలపై స్పందించి పరిష్కరించాలని ఆదేశించారు. గత ప్రభుత్వ హయాంలో కొందరు దౌర్జన్యంగా ఇతరుల భూములను ఆక్రమించు కున్నారని, భూకబ్జాలపై ఉక్కుపాదం మోపుతామని ఎమ్మెల్యే హెచ్చరించారు. సరైన పత్రాలు ఉండి భూములు కోల్పోయిన ప్రతి ఒక్కరికీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రభుత్వంలో కచ్చితంగా న్యాయం జరుగుతుందని, ఆక్రమణలను తొలగించి నిజమైన లబ్ధిదారులకు భూములు అప్పగిస్తామని భరోసా ఇచ్చారు. నియోజకవర్గ సమగ్రాభివృద్ధి కోసం రూపొందించిన 'స్వర్ణ వెంకటగిరి' విజన్/యాక్షన్ ప్లాన్ బ్రోచర్‌ను ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆవిష్కరించారు.

## జలధార, జలహారతి కార్యక్రమంలో ఎంపీడీవో

**సత్యవేడు,ఏప్రిల్ 10 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** నీటిని సంరక్షణకు ప్రభుత్వం వందరోజుల కార్యాచరణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని తిరుపతి జిల్లా సత్యవేడు ఎంపీడీవో చంద్రశేఖర్ పేర్కొన్నారు.శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నీటి భద్రత, సాగునీటి సంఘాల బాధ్యతపై ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో పంచాయతీ ప్రత్యేక అధికారులు, పంచాయతీ సెక్రటరీలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, సాగునీటి సంఘాల అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంపీడీవో చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రతి ఎకరానికి సాగునీరు అందించాలన్న ఉద్దేశంతో జలహారతి కార్యాచరణను చేపట్టడం జరిగిందన్నారు. ఎంఈఓ రవి మాట్లాడుతూ. భూగర్భ జలాలు అడుగంటుతున్న విషయాన్ని ప్రస్తావించారు. ప్రతి నీటి బొట్టును ఒడిసి పట్టి నిల్వ చేయడం వల్ల భూగర్భ జలాలు పెంపొందే అవకాశాలు ఉందన్నారు. ఇరిగేషన్ ఇన్చార్జి ఏఈ మురళీమోహన్ మాట్లాడుతూ మండలంలో 13 చెరువులకు ఆయకట్టు భూములు ఉన్నాయన్నారు.ప్రధానంగా జలదార పథకంలో చెరువుల్లో పూడికతీత, ఓరువకాలువ, కలుజు కాలువలు,తూము కాల్వలలో పూడికతీత పనులు గుర్తించాలన్నారు. ఇందుకు ఆయా అసిస్టెంట్ ఇంజనీర్లు, పంచాయతీ సెక్రటరీలు సాగునీటి సంఘాల అధ్యక్షులతో సమన్వయం చేసుకొని ఏప్రిల్ 13వ తేదీ లోపల ప్రతిపాదన సిద్ధం చేసి, గ్రామసభ నిర్వహించి ఆమోదం తీసుకోవాలన్నారు. ఆ ప్రతిపాదనలు ఏప్రిల్ 15కు జిల్లా అధికారులకు పంపడం జరుగుతుందని, ఆమోదం రాగానే ఉపాధి హామీ పథకం ద్వారా పనులు చేపడతారని ఆయన పేర్కొన్నారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు ఉంటుందని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో షణ్ముగం, మండల పరిషత్తు పరిపాలనాధికారి త్రివిక్రమరావు, సత్యవేడు పంచాయతీ సెక్రటరీ మునిరవికుమార్, సాగునీటి సంఘాల అధ్యక్షులు వెంకటేశులు, శివానందం, గోవిందరాజులు, జయరాం రెడ్డి, మునిరత్నం రెడ్డి, రాణెమ్మ, అల్లాస్వామి, పంచాయతీ సెక్రటరీలు, తదితరులు పాల్గొన్నారు.

## హిందీలో విద్యార్థుల విశిష్ట ప్రతిభ



**కేవీబీ పురం,ఏప్రిల్ 10 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** కేవీబీ పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు, రాష్ట్ర స్థాయిలో తమ ప్రతిభను చాటి విద్యా సంస్థకు గుర్తింపు తెచ్చారు. హైదరాబాద్‌లోని హిందీ సేవా సదన్, మహావిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయి విశిష్ట హిందీ ప్రతిభారత్న అవార్డు-2025 కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించి, దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు. 7వ తరగతికి చెందిన ఎన్. వైష్ణవి, డి. కీర్తి, 9వ తరగతి విద్యార్థినులు డి. కీర్తన, జె. లక్ష్మి ప్రవంతి, 8వ తరగతికి చెందిన కె. ప్రేమలత, 6వ తరగతి విద్యార్థి డి. దేవిశ్రీ ప్రసాద్‌లు ఈ ప్రతిష్ఠాత్మక అవార్డులను అందుకున్నారు. ఉత్తమ శిక్షణ ఇచ్చిన హిందీ ఉపాధ్యాయురాలు అనిత ను ఎమ్మెల్యే ప్రశంసించి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులు భాషా నైపుణ్యంలో రాష్ట్ర స్థాయి అవార్డు సాధించడం అభినందనీయమన్నారు. ప్రధానోపాధ్యాయులు కూనాటి సురేష్ మాట్లాడుతూ విద్యార్థుల కృషితో పాఠశాల కీర్తి ప్రతిష్ట పెరిగిందన్నారు.

Edited, Printed, Published and Owned by K.S. Rangasayi and published from D.No. 19-9-3A/1, Jayanagar, Ramanuja Circle, Tirupati - 517501 and Printed at SKYLINE Press, D.No. 19-9-3A/1, Jaya Nagar, Tirupati- 517501, Associate Editor: K. Neeraja, Ph:0877-2239899, email : netimanadesamdailytpt@gmail.com; Postal Reg. No TRP/139/2025-2027